అనంతర ప్రబంధయుగములో

గోల్కొండ తెలుగు కవి పండితులు సాహిత్యపరిణామము

జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

డిసెంబర్ 2000

సంపాదకుడు

డా॥ ఎం. బాగయ్య

తెలుగు శాఖ

(పి.జి. కళాశాల సైన్సు - సైఫాబాద్)

ఉస్మానియా విశ్వ విద్యాలయము, హైదరాబాద్

అనంతర ప్రబంధయుగములో

గోల్కొండ తెలుగు కవి పండితులు సాహిత్యపరిణామము

జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

డిసెంబర్ 2000

సంపాదకుడు

డా॥ ఎం. బాగయ్య

తెలుగు శాఖ

(పి.జి. కళాశాల సైన్సు - సైఫాబాద్)

ఉస్మానియా విశ్వ విద్యాలయము, హైదరాబాద్

Anantara Prabandha Yugamulo
GOLKONDA TELUGU KAVI PANDITULU
SAHITYA PARINAMAMU
Research Journal

ఉస్మానియా విశ్వవిద్యాలయము మరియు
తెలుగు విశ్వవిద్యాలయంవారి ఆర్థికసహాయం పొందినది

December - 2000

Director :

Dr. M. BAGAIAH
I/c Head Dept. of Languages
P.G. College of Science - O.U.
Saifabad, Hyderabad - 4

Copies : 1000

Price Rs. 60-00

For Copies :

Dr. M. Bagaiah
H.No. 12-11-833/4/71
Ambar Nagar, Addikmet
Hyderabad - 500 044
Ph : 7071118

Printed at :

Karshak Art Printers,
Vidyanagar, Hyderabad - 44
Ph: 7618261, 7653348

ఆహ్వానము

U.G.C. SEMINAR

యు.జి.సి. సాహిత్య సదస్సు

"అనంతర ప్రబంధ యుగములో గోల్కొండ తెలుగు కవి పండితులు - సాహిత్య పరిణామం"

30 మార్చి 2000 గురువారం

వేదిక

వివేకానంద హాలు, పి.జి. సైన్స్ కళాశాల,
సైఫాబాద్, హైదరాబాద్

డా॥ ఎం. బాగయ్య
సదస్సు - సంచాలకులు
తెలుగుశాఖ
పి.జి. సైన్సు కళాశాల, సైఫాబాద్
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 4

కార్యక్రమము

30-3-2000 గురువారం ఉ॥ 10-00 గం॥లకు ప్రారంభోత్సవ సభ

అధ్యక్షులు : డా॥ పి. జడ్సన్ గారు
ప్రాచార్యులు, పి.జి. సైన్స్ కళాశాల, సైఫాబాద్

ముఖ్య అతిథి ప్రారంభకులు : జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణరెడ్డి గారుఎం.పి.
అధ్యక్షులు, ఆం.ప్ర. రాష్ట్ర సాంస్కృతిక మండలి

గౌరవ అతిథులు : శ్రీ కె. హనుమంతరావు గారు
అదనపు కార్యదర్శి, న్యాయశాఖ, ఆం.ప్ర. సచివాలయం

స్వాగత ప్రసంగం : డా॥ ఎం. బాగయ్య గారు
భాషా శాఖల అధ్యక్షుడు, పి.జి. సైన్స్ కళాశాల, సైఫాబాద్

కృతజ్ఞతా నివేదనం : డా॥ వి. నిత్యానందరావు గారు

మొదటి సదస్సు

30-3-2000 గురువారం ఉ॥ 11-00 గం॥లకు

అధ్యక్షులు : ఆచార్య ఎం. కులశేఖరరావు గారు
"దాశరథి శతకము - భక్త రామదాసు"

ప్రత్యేక అతిథి : ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారు

పత్ర సమర్పణ : డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి గారు
"రాకమచర్ల వెంకటదాసు"

డా॥ కె. విద్యావతి గారు
"పొన్నిగంటి తెలగన్న-యయాతి చరిత్ర"

డా॥ ఎం. పద్మకుమారి గారు
"అద్దంకి గంగాధర కవి తపతీ సంవరణము"

డా॥ అయాచితం నటేశ్వర శర్మ గారు
"రాజామల్లారెడ్డి షట్చక్రవర్తుల చరిత్ర, పద్మపురాణం"

సమావేశకర్తలు : డా॥ చింతల యాదయ్య గారు
డా॥ రత్నాకర్ గారు

రెండవ సదస్సు

30-3-2000 గురువారం మ॥ 2-00 గం॥లకు

అధ్యక్షులు : ఆచార్య ఎస్వీ రామారావు గారు
డీన్, ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, ఉస్మానియా యూనివర్సిటీ

పత్ర సమర్పణ : డా॥ కె. కుసుమాబాయి గారు
"సారంగు తమ్మయ్య"

డా॥ ఎం. చెన్నప్ప గారు
"తెలంగాణా సారస్వతములో మరింగంటి కవులు"

డా॥ బి.ఎన్. శాస్త్రి గారు
"గోల్కొండ (కుతుబ్షాహీల) శాసన సాహిత్యము"

డా॥ పొద్దుటూరి యెల్లారెడ్డి గారు
"జానపద ప్రక్రియలు - యక్షగానము"

డా॥ బి. కేశవులు గారు
" చెర్విరాల భాగయ్య యక్షగానాలు - తాత్త్విక చింతన"

సమావేశకర్తలు : డా॥ డి.కె. శ్రీనివాసాచార్యులుగారు
శ్రీమతి డి. సూర్య గారు

ముగింపు సభ

అధ్యక్షులు : కవిశాసన ఆచార్య. రఘుమన్న గారు

ముఖ్య అతిథి : డా॥ శివునూరి విశ్వనాథ శర్మ గారు
డీన్ ప్రాచ్య భాషలు (రిటైర్డ్)

గౌరవ అతిథి : డా॥ వి. ప్రభాకర రెడ్డి గారు
వైస్ ప్రిన్సిపాల్, పి.జి. కళాశాల, సైఫాబాద్

సదస్సు నివేదిక : డా॥ ఎం. బాగయ్య గారు
సదస్సు సంచాలకులు

కృతజ్ఞతా నివేదనం : డా॥ ఎం. వెంకట కృష్ణ గారు
గణిత శాస్త్ర విభాగాధ్యక్షులు

విషయ సూచిక

మున్నుడి

తెలుగు సాహిత్య చరిత్రలో అనంతర ప్రబంధయుగమునకు ఒక ప్రాముఖ్యమున్నది. తెలుగు సరస్వతి చారిత్రక పరిణామదశను అనుసరించి దక్షిణదేశములోనే చోళ-పాండ్య రాజ్యములకు వలసపోయినది. అక్కడ ఇతోధికంగా చిరుగజ్జెల సవ్వడి చేసే సాహిత్యకులను అలరించినది. అది ఒక పరిణామ దశ.

ఇక మన దేశములో సాహిత్య పోషకులు కరువైపోయిన స్థితిలో వలసపోయిన కవి-పండితులు అక్కడ ఇక్కడా చేరి సాహిత్య జ్యోతి ఆరిపోకుండ కాపాడుకున్నారు. ఆ పరిస్థితులలో తెలంగాణములోని కొందరు కవులు గోలకొండ ప్రాంతములో నివసించి సాహిత్య దీపమును నిలబెట్టుకున్నారు. ఇది చాల క్లిష్టమైనపని. ఎందుచేతనంటే పాలకులు భారతీయ సంస్కృతి మీద, సంప్రదాయము మీద, సంగీత-సాహిత్యముల మీద అభిమానము కలిగిన వారు కారు. వారి మాతృభాష అన్యదేశ భాష కావటము చేత ఆ రాచరిక వ్యవస్థలో ప్రజల భాషయైన తెలుగు భాషను పట్టించుకున్న నాధుడు లేడు. పర్షియన్, ఉర్దూ, దక్కని మొదలైన అన్యభాషలకు రాజసత్కారము లభించినప్పుడు మన భాషను గురించి పట్టించుకున్నవాడేడి?

ఐన తెలుగు సరస్వతి సర్వజీవ కళలకు కేంద్రమైనట్టి ప్రజలే ఆమెకు నాట్యరంగము. అటువంటి పరిస్థితులలో ప్రజల నుండియే సాహిత్య చైతన్యము కల్గినది. తెలంగాణపు కవులలో కొందరినైన పేర్కొనుట నా ధర్మము. పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతనామాత్యుడు, మడికి సింగన, గౌరన, చరికొండ ధర్మన, పొన్నికంటి తెలగన, అద్దంకి గంగాధరకవి, సారంగు తమ్మయ, కామినేని మల్లారెడ్డి, సురభిమాధవరాయకవి, పరశురామ పంతులు లింగమూర్తి, మరింగంటి కవులు, కంచర్ల గోపన్న, కందుకూరి రుద్రకవి, రాకమచర్ల వేంకటదాసు, చెర్విరాల బాగయ్య వంటి కవులెందరో తమ జన్మ చేతనో, తమ జీవితయాత్ర చేతనో రచనలు చేసి తెలంగాణామును పవిత్రము చేసినారు. వీరేకాక జ్ఞాత-అజ్ఞాత కవులెందరో తెలుగు సరస్వతికి చిరుదివిటీలు పట్టి, ప్రజలకు జ్ఞానోదయము కల్పించినారు. ముఖ్యముగా గోల్కొండ తెలుగు కవులను కొందరినైన పేర్కొనుటయే ఈ వ్యాస సంచిక ఉద్దేశ్యము.

భక్త కవి, ప్రజాకవియైన రామదాసు కటకటాల వెనుకయుండి, కమ్మని గానమాధుర్యమును వెలయించినారు. శతక ప్రవాహమును జాలువార్చినాడు. ఇక మరింగంటి కవులు మూడు నాలుగు తరములు ప్రాబంధిక ఉద్యమమును చేపట్టి, వైవిధ్య సంవిధాన సమన్వయముతో కావ్య రచన చేసి, నిరాశ్రయులైన కవిపండితులు కూడ సాహిత్య చైతన్యమును ఉద్దీపింపగలరని నిరూపించినారు. ధనము, ధాన్యముతో, పల్లకీలతో పనిలేదన్నట్లుగా, గ్రామ మునసబులుగా నుండిన సారంగు తమ్మయగారు మధురాతి మధురమైన వైజయంతీ విలాసమును తీర్చిదిద్దినాడు. ఒక ఆళ్వారు వైభవమును, ఒక విశిష్టాద్వైత మధుర సిద్ధాంతమును సూక్ష్మాతి సూక్ష్మముగా సుందరమైన కథలో చిత్రించిన మహాకవి సారంగు తమ్మయ. గాఢాంధకారములో చిన్న క్రొవ్వొత్తి వలె గోలకొండ రాజులలో మలికె ఇభ రాముడు కనిపించగా, ఆ సన్నని వెలుగులోనే మహా భారతములోని మూలకథకు తపతీ సంవరణము సరసమయినదయి మంచి కల్పనా చాతుర్యమును కల్గిన ప్రబంధ రచన చేసిన అద్దంకి గంగాధరుడు ఘనుడే. ఈ కాలములోనే అపూర్వమైన కావ్యమగు యయాతి చరిత్రను అచ్చ తెనుగులో రచించిన పొన్నిగంటి తెలగన్న ఆంధ్ర సరస్వతికి అలంకారము చేసినాడు. తెలగన్న కవికి అమీనుఖాను ఏమని ఆదరించినాడో కాని, ఆ తురుష్క సరుదారును, తన కావ్యము ద్వారా అజరామరున్ని చేసినాడు. తెలుగు కవుల చాటు పద్యముల చేతను, ప్రస్తుతి చేతను రవంత ఆంధ్ర భాషాభిమానము కల్గిన మల్కిభరాముడు తెలుగు సాహిత్యములో అభిరాముడై శాశ్వతముగా నిలిచిపోయినాడు. మన తెలుగు కవుల ఔదార్యముతోనే ఈ విశేషము జరిగినది.

ఒకవైపు విద్వత్సంపన్నులైన కవులు రసాన్వితమైన కావ్యములు వెలయింపగా, అంతగా పాండిత్య ప్రభావములు లేని కవులు రాజాశ్రయము లభింపలేదని చేతులు ముడుచుకొని కూర్చున్నవారు కారు. రాకమచర్ల వేంకటదాసు అసంఖ్యాకమైన కీర్తనలు రచించి పాడి తెలంగాణ ప్రాంత ప్రజలను ఆనందములో నోలలాండించినాడు. ఆయన పాటలు తెలంగాణా ప్రజల నాల్కల మీద ఇంకా నాట్యము చేస్తూనే యున్నవి.

శ్రవ్య కావ్యములకంటే దృశ్య కావ్యములకు అప్పటికి, ఇప్పటికి ప్రజాదరణ అధికమే. యక్షగానములనే దేశి నాటకములు తెలంగాణా ప్రజలను చాలా కాలము నుంచి అలరించుచునే యున్నవి. చెట్టు క్రిందనో, రచ్చబండ మీదనో, భాగవతమును (యక్షగాన) ప్రదర్శించని పల్లె తెలంగాణ సీమలో లేనే లేదు. పాండవ వనవాసము మొదలుకొని బాల నాగమ్మ వరకు, మహాభారతము

మొదలుకొని మాయల మరాఠి వరకు భాగవతములు పల్లె ప్రజలను తరతరములుగా నలరించుచునే యున్నవి.

ఇది కాక కొందరు సంపన్న సంస్థానాధీశ్వరులు కూడా సాహిత్యము మీద అభిమానము చూపి, ఈ ప్రాంతములో చైతన్యమును నిలిపినారు. వారిని కూడా మనము మరచిపోలేము కదా!

ఇన్ని దిశలలో ప్రవహించిన సాహిత్య స్రవంతిని ఏకముఖిము చేయుటకు, ఒక స్వరూపమును నిలుపుటకు పలువురు పండితులు పూనుకొని ఈ సదస్సులో వ్యాసగుచ్ఛములను సమర్పించినారు. మాకు లభించిన పరిధిలో ఈ సాహిత్య స్వరూపమును ఆవిష్కరించుటకు కృషి చేసినాము. ఇంకా చేయవలసిన పని చాలానే యుండవచ్చును. అయినను ఆంధ్ర సరస్వతికి ఈ వ్యాసమాల అణుమాత్రమైన అలంకారమైనను మేము చేసిన కృషి ఫలించినట్లే.

హైదరాబాద్ - 44

తేది : 11 - 11 - 2000

డా॥ మొరంగపల్లి బాగయ్య

డైరెక్టర్ (సదస్సు)

1. దాశరథి శతకము - భక్త రామదాసు

- ఆచార్య ఎం. కులశేఖరరావు

తెలుగు సాహిత్యంలో నాటి నుంచి నేటి దాకా వెలువడిన నాలుగైదు వేల శతకాల్లో వేయికి పైగా భక్తి శతకాలున్నాయని పరిశోధకులు భావిస్తున్నారు. కావ్య రసాలను, వాటి ప్రాధాన్యాన్ని చర్చించిన లక్షణకారులెవరు? కావ్యానంద కారణాలైన నవరసాల్లో భక్తిని రసాల్లో చేర్చనే లేదు. అది వారి దృష్టిలో భావం మాత్రమే. కాని భక్తి శతకములు, పోతనాది మహాకవులు భక్తికి రసస్థితిని కలిగించి దానిని తమ కృతుల్లో ప్రధానాంశంగా నిక్షిప్తం చేసినారు. భక్తి శతక కవుల్లో రామదాసుగా ప్రఖ్యాతి వహించిన కంచెర్ల గోపన్న కూడ భక్తికి రసస్థితిని అందించిన ఘనతను పొందినవాడే. అందుచేతనే గోపన్నను శ్రీరామ భక్తులు, వైష్ణవులు భాగవతోత్తమునిగా భావించి గౌరవిస్తారు. గోపన్న గారు భక్తి అనే భావావేశంలో పడి దాశరథి శతకం అను లఘు కావ్యాన్ని కవితా ప్రవాహంలాగా వెలువరించిన వాడు కాదు. భక్తి సంప్రదాయంలో ఉన్న విశేషాలను ఒక ప్రణాళిక లాగ వేసుకొని దాని కనుగుణంగా ఈ శతకాన్ని తీర్చిదిద్దినాడు. ఆయన ఆలోచనా విధానం ఏ విధంగా వుందో 6వ పద్యంలో వ్యక్తం చేసినాడు. దాని భావం ఇట్లా వుంటుంది.

"నేను వినయంతో పెద్దలందరికీ నమస్కరించి, నా గురువులైన రఘునాథ భట్టరాచార్యుల వారికి చేతులు జోడించి మొక్కి, పూర్వ కవులను స్తుతి చేసి నేను చేసే రచన సుకరముగా, సులభముగా నెరవేరగా ఇపుడు శతకమనే కావ్యాన్ని వ్రాస్తున్నాను. కరుణా సముద్రుడైన ఓ భద్రాచల రామా! ఈ శతకాన్ని మంచి అభిప్రాయంతో స్వీకరించుము".

ఈ పద్యంలో కావ్య సంప్రదాయాలు, భక్తి సంప్రదాయాలు నిరవశేషంగా పాటింపబడినాయి. ఆర్యులకు నమస్కరించడం, నన్నయ, తిక్కనాదులు పాటించిన సాహిత్య సంప్రదాయం దాన్ని అనుసరించినాడు గోపన్న. ఈ కవికి రఘునాథ

భట్టరాచార్యుల వారు గురుపాదులు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని బోధించి తిరు మంత్రోపదేశం చేసినవారు. విశిష్టాద్వైత సంప్రదాయానుయాయులు ఏ సత్కార్యాన్ని ప్రారంభించినా 'అస్మద్ గురుభ్యోనమః' అని ఉచ్చరించి ఉపక్రమించడం సంప్రదాయం. ఆ సంప్రదాయం ఇక్కడ అభివ్యక్తమైంది. తరువాత సంస్కృతాంధ్ర కవులను వినుతించినాడు. అనంతరం శ్రీరాముణ్ణి ప్రార్థించి శతకాన్ని అంకితం ఇస్తానని, దయతో గ్రహించమని వేడుకొన్నాడు. ఈ విధంగా అంకితం చేసే సత్కార్యం కూడా దీనితో సూచింపబడింది. తిక్కనాదులు తమ ఇష్టదైవతములకు కావ్యాలు అంకితం చేసినవారే కదా!

భక్తుడైన రామదాసు ప్రాపంచిక సౌఖ్యాలను కాంక్షించినవాడు కాదు. తన మేనమామతో రాజాస్థానంలో ఉండిన వారు కాబట్టి ఆయన కోరుకొంటే నృత్యాలు, సంపద నిరాటంకంగా సంపాదించుకొనేవారు. కాని ఆయనకు వాటి మీద అభిమానం ఉంటే కదా! సర్వ వేళ సర్వావస్థలలో శ్రీరాముని ధ్యానించడమే ఆయన కోరిక, సంపద. మానవుని జీవితం ఎంత క్షణ భంగురమైందో తెలిసినవారు కాబట్టి తన రామనామ జపానికి భంగం వాటిల్లుతుందేమో అని భయపడిన భక్తుడు ఈ పద్యం వ్రాసినాడు.

ముప్పున కాలకింకరులు ముంగిట నిల్చిన వేళ, రోగముల్
గొప్పదమైనచో కఫము కుత్తుక నిండిన వేళ, బాంధవుల్
గప్పినవేళ, మీ స్మరణ గల్గునొ గల్గదొ? నాటికిప్పుడే
తప్పక చేతుమీ భజన దాశరథీ కరుణాపయోనిధీ.

శతక కవులు చాలా మంది కవిత్వం వ్రాసేటప్పుడు ఆత్మాశ్రయంగా వ్రాయడం ఉన్నది. కవి తన అనుభూతులను, ఇతరుల అనుభూతులతో సరిసమానంగా చెప్పగా పాఠకులకు, కవిలాంటి అనుభూతి కలిగితే దాన్ని ఆత్మాశ్రయత్వమని విమర్శకులు భావిస్తారు. కవి తన వృత్తాంతం చెప్పడంతో పాటు, ఇతరుల వృత్తాంతం చెప్పడం అనే నేర్పు ఇది. ఇక్కడ కంచర్ల గోపన్న

గారు, తాను వృద్ధుడై తనకు అంతిమ సమయము ఆసన్నమైనప్పుడు, తన ఇష్ట దైవమైన శ్రీరాముని భజన చేయడానికి, నామస్మరణ చేయడానికి, అవకాశం ఉంటుందో లేదో అని సందేహించి, ఆ సేవ ఇప్పుడే అంటే అవయవాలు స్వాధీనంలో ఉన్నప్పుడే చేస్తాను అని తన స్థితిని పరమాత్మునికి నివేదిస్తున్నాడు.

లోకంలో నివసించే మనుష్యమాత్రులకు, వార్ధక్యం రావడం, రోగాలు అధికం కావడం, చుట్టాలు చుట్టుముట్టడం వంటి పరిస్థితులు అందరికి ఏర్పడుతాయి. అటువంటి అవస్థలో భగవద్ధ్యానం చేయడం సాధ్యం కాకపోవడం కూడా సహజమే. కవి గారి ఈ అనుభవాన్ని పాఠకులు తమ అనుభవంగా భావించి, ఆత్మాశ్రయత్వం అనే అనుభూతిని పొందుతూ ఉన్నారు. కవి, ముందుగానే జాగ్రత్త పడి ఇప్పుడే శ్రీరాముని భజన చేస్తానని చెప్పడంలోనూ పరమార్థం ఉంది. మీకందరకు వార్ధక్యం వస్తుంది, రోగాదులు చుట్టుకొని అనిశ్చిత స్థితి ఏర్పడుతుంది. అప్పుడు భగవంతుని స్మరించడం అసంభవమవుతుంది. అందుచేత, దేహంలో శక్తి ఉన్నప్పుడే ఈశ్వరధ్యానం చేయండి అని ధ్వని ప్రధానంగా సూచిస్తున్నాడు కవి. తన గోడు వినిపిస్తూనే ఇతరులకు ప్రబోధం చేసే రమణీయ పద్ధతి ఇది.

గోపన్నకు ఈ పద్యం వ్రాస్తూ ఉన్నప్పుడు ముకుందమాలలోని ఈ శ్లోకం వారి మనస్సులో మెదలి వుంటుంది.

కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాంత
మద్యైవమే విశతు మానస రాజహంసః
ప్రాణాప్రయాణ సమయే కఫవాత పిత్తైః
కంఠావరోధన విధౌ స్మరణమ్ కుతస్తే?

దీనికి తెలుగు అనువాదం వినండి.

కృష్ణ! ఇప్పుడె త్వత్పాద పంకేరుహ పంజరమ్మునాచిత్త రాజహంసమ్ము చొరుత - మిత్తి దరియంగ కఫవాతపిత్తములొగి - గళము మూయంగా నీ స్మృతి కలుగుటేద?

ముకుందమాల అనే విష్ణుభక్తి కావ్యాన్ని రచించిన వారు శ్రీ కులశేఖరాళ్వార్లు. విశిష్టాద్వైత సంప్రదాయానికి, విష్ణుభక్తి తత్వానికి ఈ స్తుతి కావ్యం ఊటబావి వంటిది. కులశేఖరులు రాజకవి. కేరళాధీశ్వరుడు శ్రీ వేంకటేశ్వరునికి పరమభక్తుడు. జీవన్ముక్తుడైన రాజయోగి. ముకుందమాలా ప్రభావం సంస్కృతంలో లీలాశుకుడు రచించిన శ్రీకృష్ణకర్ణామృతం అనే గ్రంథంపై కనిపిస్తుంది.

వ్యాధిగ్రస్తుడైన మనుష్యుడు మరణించడం సహజమే. అటువంటి సమయంలో అతడు తమను వీడిపోతాడు అని దుఃఖించే ఆప్తులు కొంతమంది. అతడు మరణిస్తే అతని ఆస్తిపాస్తులను ఇతరులను సంగ్రహింపనీయక ఆక్రమించడానికి వచ్చే బంధువులు కొంతమంది. వీరందరు అతన్ని చుట్టుముట్టుతారు. అటువంటి సమయంలో వారిని చూచేటందుకే కాని, రాముని ధ్యానించే అవకాశం ఏది?

కఫవాతపిత్తములు అనేవి శరీరంలోని అంశాలు. కఫాపచయాదారోగ్యైక మూలమాశయాగ్ని దీప్తి' అనే అయుర్వేద శాస్త్రము గొంతులో కఫం తట్టుకొన్నప్పుడు శ్వాసకోసం నిండి మరణమాసన్నమవుతుందని వైద్యునిదానం.

శ్రీమద్భాగవతంలో భక్తి వలన భగవంతుని కొలిచే మార్గాలు, మానవుడు తరించే మార్గాలు చెప్పబడినాయి.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్

రామదాసు ఆ మార్గాల్లో చాలా పద్ధతులను అవలంబించిన భక్తుడే. ఒకచోట కీర్తనం అనే భక్తిమార్గాన్ని గురించి చెప్పినారు. అతడు దీనిని భజన అని అన్నాడు. అది ఎంతటి మాహాత్మ్యం కలిగిందొ ఈ పద్యంలో ప్రతిపాదించినాడు.

పరమ దయానిధీ, పతిత పావన నామ, హరేయటంచు సు
స్థిరమతులై సదా భజన చేయు మహాత్ముల పాదధూళి నా
శిరమున దాల్తు మీరటకు జేరకుడంచు యముండు కింకరో
త్కరముల కానబెట్టునట, దాశరథీ కరుణాపయోనిధీ

విశిష్టాద్వైత సంప్రదాయంలో భాగవతసేవ అనేది ఒక ముఖ్య భాగం. భాగవతులంటే భగవంతుని సేవ చేసేవారే. వారిని సేవిస్తే నారాయణుని సేవ చేసినట్లే. అందుచేతనే విష్ణు భక్తులు 'ప్రహ్లాద నారదా పరాశర పుండరీక' మొదలైన భక్తులను స్మరిస్తారు. వారి సేవ వలన నారాయణుడు తృప్తి చెందుతాడు అని విష్ణు భక్తుల భావం. మహేశ్వరుడు ప్రథమ భాగవతోత్తముడని ప్రతీతి. అటువంటి సదాశివుని నిరంతరం ధ్యానించి మార్కండేయుడు మృత్యు ముఖం నుంచి బయట పడినాడుకదా. విష్ణు భక్తులకు సేవ చేసిన వారిని యమకింకరులు సమీపించరు అని చెప్పడం, ఇటువంటి ఐతిహ్యాన్ని మనస్సున పెట్టుకొన్నదే. ఈ భావం ముకుందమాలలో ఇట్లా ఉంటుంది. మజ్జన్మ ఫలమిదం మధుకైట భారే - మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ తద్భృత్య పరిచారక భృత్య - భృత్య స్యభృత్య ఇతిమాం స్మరలోకనాథ॥

వైష్ణవులు తమకు మంత్రోపదేశం చేసిన ఆచార్యులను పరమోత్తములుగా భావించి, భాగవతోత్తముడుగా సంభావించి ఆయన పాదములకు అనునిత్యం సేవిస్తారు. అట్లా చేయడం చేత వారికి అపమృత్యువు కలుగదని విశ్వాసం. ఇది సామాన్యులకే సమ్మతం కాదు. పన్నిద్దరాళ్వారుల్లో ఒకడైన విప్రనారాయణ స్వామి, ఈ సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా విశ్వసించి, తన పేరును మార్చుకొని తొండరడిప్పొడి

ఆళ్వార్ అని పెట్టుకున్నాడు భక్తుల పాదధూళి అనేది దానికి అర్థం. భక్తాంఘ్రిరేణు ఆళ్వార్లు అని ఆయనకు ప్రఖ్యాతి కలిగింది.

భక్తుల సేవించేవారి దగ్గరకు, వైష్ణవుల సమీపానికి యముడు తన కింకరులను రానీయడనే దానికి అజామిళుని కథను ఉదాహరణగా చెప్పవచ్చు. అజామిళుడు తనకు మరణమానన్నమైనప్పుడు నారాయణ నామాన్ని ఉచ్చరించినాడు. దాని వలన యమదూతలకు ఆటంకం, విష్ణు దూతలకు ప్రవేశం కలిగింది. యమదూతలు తిరిగివచ్చి యమధర్మరాజుతో తమ పరాభవాన్ని చెప్పుకొన్నారు. అది విని యముడు విష్ణు భక్తుల జోలికి పోవద్దని హితవు చెప్పి, విష్ణు దూతల దర్శనమైనందుకు వారి అదృష్టాన్ని మెచ్చుకొని ఇట్లా అన్నాడు.

తే దేవ సిద్ధ పరిణీత పవిత్ర గాథా
యే సాధకః సమదృశో భగవత్ప్రసన్నాః
తాన్ నోపసీదత హరేర్గదయాభిగుప్తాన్
నైషాం నయమ్ నచ నయః ప్రభవామ దండే ॥ భాగ ॥

'సమదర్శకులు, ప్రపన్నులు అయినవారు, భగవంతుని తమకు సాధ్యంగాను, సాధనాంగాను భావించి భగవంతునిపై తన భారమంతా మోపి, నిశ్చింతగా ఉంటారు. పెద్ద పెద్ద దేవతలకే సిద్ధ పురుషులే వారి పవిత్ర చరిత్రను గానం చేస్తూ ఉంటారు ఓ దూతలారా, అలాంటి వారి దగ్గరకు మీరు పొరపాటునైనా పోవద్దు. వారి యొద్ద భగవంతుని గదాయుధం ఉండి, సదా వారిని రక్షిస్తుంది. అట్టి వారిని దండించడానికి నాకు సాధ్యం కాదు.'

భజన, భజన చేసే భాగవత్తుల మాహాత్మ్యం ఇటువంటిదట! రామదాసు సార్థక నాముడైన మహా రామభక్తుడు. అందునా వైష్ణవుడు. భక్తి సిద్ధాంతం మీద ఇతనికి పరిపూర్ణ విశ్వాసం ఉంది. బహుశా విద్యాధికుడు కావడం చేత, ఇతర వాదాలను, సిద్ధాంతాలను చక్కగా అవగాహన చేసుకొన్నవాడే. ఆ భక్తికి ఎంతటి శక్తి కలదో ఒక పద్యంలో వక్కాణించినాడు.

కొంజక తర్కవాదమనుగుద్దలిచేపరతత్త్వ భూస్థలిన్
రంజిల త్రవ్వి కన్గనని రామనిధానము, నేడు భక్తి సి
ద్ధాంజనమందు హస్తగతమయ్యెభళీ యనగా మదీయ హృ
త్కంజమునన్ వసింపుమిక దాశరథీ కరుణాపయోనిధీ.

కొంజు అంటే సందేహించు, సంకోచించు అనే అర్థాలున్నాయి. ఇది ఆధునిక భాషలో ప్రయోగింపబడడంలేదు. ఆంధ్ర మహాభాగవతంలో దశమస్కంధంలో ఈ పదమీవిధంగా ఉపయోగింపబడింది.

అంజక బాలకుడనియును - కొంజక దయమాలి రాజకుంజరయంతన్
కుంజరమునుడీకొలిపెను - కుంజర పాలకుడు గోపకుంజరుమీదన్

తర్కము అనే పదానికి ఊహ, అధ్యాహారము, కారణము, కోరిక, ఒక శాస్త్రము అనే అర్థాలున్నాయి. కారణం మీద వాదించే ఒక శాస్త్రం అని గ్రహించవచ్చు. శాస్త్రాన్ని అరు రకాలుగా విభజించినారు. 1. తర్కము, 2. వ్యాకరణము, 3. ధర్మము, 4. మీమాంస, 5. వైద్యము, 6. జ్యోతిష్యము.

శాస్త్రబద్ధంగా వాదాలు చేసి భగవంతుని కనుగొనడం సాధ్యం కాదని కవి భావం. పరతత్త్వం అంటే పరమాత్మ. పురుషుడు పంచవింశతి తత్త్వము, అష్టప్రకృతులు, షోడశవికారాలు, ఇవన్నీ పురుషుని గురించి చెబుతాయి.

భక్తి అనేది ఎనిమిది విధాలుగా వుంటుంది. భాగవత వాత్సల్యం. భగవత్పూజ యందనుమోదము, భగవదర్చన, భగవద్విషయమునందు అదంభము, భగవత్కథాశ్రవణేచ్ఛ, స్వరనేత్రాంగ వికారము, సదా భగవదనుస్మరణము, అమాంసభక్షణము.

తర్కవాదాల చేత కాక, పరతత్త్వమైన శ్రీరాముని భక్తి మార్గం చేత కనుగొన్నానని కవి కంచెర్ల గోపన్న ఉద్ఘాటించారు. ఈ మార్గమేమో కనుగొనవలె.

కర్మ మార్గము, జ్ఞాన మార్గము, భక్తి మార్గము మోక్ష సాధనాలుగాను, పురుషార్థ సాధనాలుగాను పురాణోపనిషత్తులలో చెప్పబడింది. విధివిహితమైన కర్మానుష్ఠానం భగవదాజ్ఞా పరిపాలనంగా పర్యవసించి సాధకునకు భగవదనుగ్రహ సంపాదకమవుతుంది.

'నహిజ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే' అని గీతావాక్యం. జ్ఞానయోగం చాలా పవిత్రమైంది. దానికి సాటి మరొకటి లేదని గీతలో చెప్పబడింది.

మోక్ష ప్రాపకాలైన యోగములలో భక్తి యోగానికి విశిష్టస్థానం ఉంది. 'మోక్షసాధనసామగ్ర్యాం, భక్తిరేవగరీయసీ' అని శాస్త్రోక్తి. లౌకిక విషయాల్లో కలిగే ప్రీతి. ఆసక్తి, రక్తి అనే చిత్తవృత్తిని భగవత్పరంగా మరల్చి, అతనిలోనే నిల్పినట్లయితే అది భక్తిగా పరిణమిస్తుంది. ఈ భక్తి తైలధారలాగా ఎడతెగక సాగవలె. సర్వేశ్వరుని అఖిల కల్యాణగుణ గణాలను కీర్తించడం, తల్లీలాదులను స్మరించడం తన్మంగళమూర్తిని దర్శించడం, దాని నర్చించడం, భక్తి వెలయించే కృత్యాలు.

'ఆత్మావారేద్రష్టవ్యోమంతవ్యోనిధిధ్యాసితవ్యః'
అనే బృహదారణ్యకంలోని వాక్యం భక్తి కృత్యాన్నే వ్యక్తం చేస్తూ ఉన్నది.
మత్కర్మ భిర్యత్తపసా జ్ఞాన వైరాగ్య తశ్చయత్
యోగేనదాన ధర్మేణ శ్రేయోభిరిత రైరపి,
సర్వం మద్భక్తి యోగేన, మద్భక్తే లభతేంజసా'

అని భక్తి ప్రాశస్త్యాన్ని శ్రీమద్భాగవతం వక్కాణించింది. కర్మ జ్ఞానాదులగు అనేక సాధనాల చేత, క్లేశపడి సాధకుడు ఏది సాధిస్తాడో, అది అంతా భక్తి యోగపరుడు అనాయాసంగాను శీఘ్రంగాను పొందగలుగుతాడు అనేది దీని భావం.

సర్వ పాపాలను పటాపంచలు చేసి, సాధకుని ఉద్ధరించే మహిమ, భక్తి యోగానికే ఉన్నదని వ్యాసమహర్షి వచించినాడు.

యథాగ్ని సుసమృద్ధార్చిః, కరోత్యేధాంసి భస్మసాత్
తథామద్విషయాభక్తి రుద్ధవైనాంసి కృత్స్నశః॥ భాగ॥ 11-14-19

భగభగమనే మంటలు ఎగసిన అగ్ని కట్టెలను, బుగ్గి చేసినట్లుగా, ఓ ఉద్ధవా, నా మీది భక్తి, భక్తుని అన్ని పాపాలను నశింపచేస్తుంది.

భక్త్యాహమేకయా గ్రాహ్యః శ్రద్ధయాత్మా ప్రియః సతామ్
భక్తిః పునాతిమన్నిష్ఠశ్వపాకాదపి సంభవాత్॥ భాగ॥-11-14-22

'కర్మచే ఎట్టి పాపియైనా, జాతిచే ఎంత నికృష్టుడైనా, దృఢమైన భగవద్భక్తి అతన్ని పవిత్రుణ్ని చేస్తుంది. అదే నన్ను తనియిస్తుంది. దానికే నేను కట్టుబడతాను.

భక్తియోగంతో సమ్మిళితమైందే ప్రపత్తి మార్గం. సాధకుడు సర్వేశ్వరునికి తన్నుతాను సమర్పించుకోవడమే ప్రపత్తి యోగం. దానికే శరణాగతి అనేది ప్రసిద్ధి. ఈ ప్రపత్తిని గురించి, వేదము, ఉపనిషత్తులు, ఆగమశాస్త్రం, పురాణములు, మహాభారతంలోని భగవద్గీత మొదలైన ప్రామాణిక గ్రంథాల్లో ప్రతిపాదితమైంది. బ్రహ్మ, శివుడు, నారదుడు, కపిలాచార్యులు, ప్రహ్లాదుడు, భీష్ముడు, అర్జునుడు మొదలైనవారు దీన్ని అనుష్ఠించినారు.

మధుసూదన సరస్వతి తన భక్తి రసాయనంలో భక్తి యొక్క పదునొకండు భూమికలను నిర్వహించినాడు. వీటిని అతడు భాగవతంనుంచే గ్రహించినట్లున్నది.

ప్రథమం మహతాంసేవా తద్దయాపాత్రతాతతః
శ్రద్ధాథతేషాంధర్మేషు తతో హరిగుణశ్రుతిః
తతోరత్యంకురోత్పత్తిః స్వరూపాధిగతిస్తతః

ప్రేమవృద్ధి పరానందే తస్యాథస్ఫురణంతతః
భగవద్దర్శనిష్మాతః సస్మింస్తద్గుణశాలితా
ప్రేమోకథపరాకాష్ఠేన్యుతితా భక్తి భూమికా

ఈ పదునొకంటినాతడు శాస్త్రీయోపాయాలని పేర్కొన్నాడు.

కామోత్కంఠత గోపికల్, భయమునంగంసుండు, వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై కృష్ణులున్
ప్రేమన్ మీరల్, భక్తి నేము నిదె చక్రింగంటి మెట్లైన ను
ద్ధామధ్యాన గరిష్ఠుడైన హరిఁజెందన్వచ్చు ధాత్రీశ్వరా

శతకం, భక్తి కావ్యమైనా, లఘుకావ్యమైనా, కావ్యకర్తకు, దానిలోను రసపోషణ చేయవలసిన బాధ్యత ఉన్నది. కానీ శతక ప్రక్రియలో ప్రధాన కథ అనేది ఉండదు కాబట్టి, రసప్రస్తారం చాల సందర్భాల్లో సాధ్యం కాకపోవచ్చును. అయినా సమర్థులైన కవులు సందర్భాన్ని సృష్టించుకొని రసప్రాధాన్యాన్ని నిక్షిప్తం చేస్తూ ఉంటారు. రామదాసు, రసరాజంగా ఉండే శృంగార రసాన్నే ఈ శతక పద్యంలో సముచిత రీతిలో పొందుపరచినాడు.

అవనిజ కన్నుదోయి తొగలందు వెలింగెడు సోమ, జానకీ
కువలయనేత్ర, గబ్బిచనుగొండల నుండు ఘనంబ, మైథిలీ
నవనవయౌవనంబను వనంబునకున్ మదదంతి నీవెకా!
దవిలి భజింతు నెల్లపుడు దాశరథీ కరుణాపయోనిధీ.

ఓ దశరథరామా! నీవు సీతాదేవి కనుదోయి అనే కలువలను వికసింప చేసే చంద్రుడవు. సీతాదేవి అనే కలువ కంటి ఉన్నత గిరుల వంటి కుచములందు నిలిచే మేఘమవు. మిథిలాధిపతి కుమార్తె సీతాదేవి లేత ప్రాయమనే పూలదోటలో విహరించే మదపుటేనుగు లాంటి వాడవు. అట్లా సీతాదేవికి ప్రియుడవైన నిన్ను ఎల్లప్పుడు భజిస్తాను, కీర్తిస్తాను, సేవిస్తాను అనేది దీని భావం.

సుందరమైన వనిత కన్నులను కలువలతో పోల్చి చెప్పడం కవి సమయం సీతాదేవి కన్నులు కలువపూల వంటివి. కలువలను వికసింపచేసేవాడు చంద్రుడు. కాబట్టి కలువకు, చంద్రునకు, ప్రేయసీ ప్రియుల సంబంధం చెప్పడం సంప్రదాయం. సీతాదేవి కన్నుల కలువలను శ్రీరాముడు చంద్రునిలాగ వికసింపచేస్తాడు.

ఉన్నత కుచములు వనితలకు సౌందర్య లక్షణం. సీతాదేవి లోకోత్తర సౌందర్యం కలిగింది కాబట్టి ఆ లక్షణం ఆమెకు ఉన్నది. సీతాదేవి భర్త శ్రీరాముడు ఆ సౌందర్యానికి ముగ్ధుడైనాడు. ఎత్తైన కుచములను కొండలతో పోల్చడం కవి సమయమే. కొండలు వర్షాకాలంలో మేఘాలను ఆకర్షిస్తాయి. ఆ విధంగానే శ్రీరామునికి సీతాదేవి ఆకర్షిస్తే ఆయన అక్కడ చేరినాడు. కొండలకు మేఘాలకు ప్రేయసీ ప్రియా సంబంధం కవులు కల్పిస్తారు. కాళిదాసు మేఘ సందేశ కావ్య ప్రారంభంలోనే 'ఆషాఢాస్య ప్రథమ దివసే మేఘ మాశ్లిష్ట సానుం' అని చెప్పినాడు కదా. సీత లోకమాత, ఆమె వర్ణన ఇట్లా చేయవచ్చునా? అనే సందేహం రాకమానదు. కాని కవులు ఇట్టి వర్ణనలు చేసిన సందర్భాలున్నాయి. 'కుచోన్నతే కుంకుమ రాగశోణే' అని దేవీస్తవంలో ఉన్నది.

ఏనుగులు, అందులో మదించినవి సుందరమైన వనాల్లో విహరించడం ప్రీతికరంగా భావిస్తాయి. మహావీరుడు, లోకోత్తర సుందరుడు, జగన్మోహనాకారుడు అయిన శ్రీరామచంద్రుని, ఈ కవి మదగజంతో పోల్చినాడు. ఇట్లా చేయడంలో ఆయన శక్తి గాంభీర్యాలు వ్యక్తమైనాయి. ఇక ఆయన విహరించేది తనకు ప్రియాతిప్రియమైన సీతాదేవి సమీపంలోనే ఆమె నవయౌవనం అనేది సుందరమైన ఉద్యానవనంలాంటిది. దానిలో మదించిన ఏనుగు లాగున ఆయన విహారం చేస్తాడు. అంటే సీతాదేవితో మనసార ఆనందిస్తాడు అనేదే కవి భావం.

దాశరథి శతకం మౌలికంగా భక్తి శతకం. చాలా పద్యాల్లో భక్తి భావాలనే కవి వ్యక్తం చేసినాడు. కాని శృంగారం అనేది రసరాజంగా ప్రఖ్యాతి చెందింది.

కవిప్రైనవాడు ప్రధాన రసమైన శృంగారం వైపు ఆకర్షితుడు కాక ఉండడు. గోపన్న గారు కూడ, సీతారాముల ప్రణయాన్ని మనస్సులో పెట్టుకొని శృంగారాత్మకంగా ఈ పద్యం వ్రాసి చదువరులను అలరింపచేయడంలో కృతార్థుడైనాడు. ఇట్లా చేయడంలో అనుచితం ఏమీ లేదు. శ్రీనివాసుని వర్ణిస్తూ ఒక కవి ఆయన వక్షస్థలంలో కమలాదేవి కుచకుంభములకు కుంకుమ శోభాయమానంగా ఉండడం వర్ణించినాడు కదా.

శ్రీ సీతారాములనేకంగా సేవించి స్తుతించే సంప్రదాయం మనకు అనాదిగా వస్తున్నది. 'వైదేహీ సహితం' అనే ప్రఖ్యాత శ్లోకంలోను, 'శ్రీరాఘవమ్' అనేది తన పఠనీయ శ్లోకంలోను ఇదే సంప్రదాయం. ఈ రామదాస కవియే తన కీర్తనలో

అనుపమ గుణ హారా - హన్యమానారివీరా
జనవినుతవిహారా - జానకీ చిత్తచోరా
దనుజ ఘన సమీరా - దానవ శ్రీవిదారా
ఘన కలుషకఠోరా - కంధి గర్వాపహారా

అని సీతారాములనేకంగా భజించినాడు.

ఇటువంటి భక్తి రచనల్లో స్థూలదృష్టికి ఈ వర్ణనలు శృంగార రసంగా కనిపించినా, ఆ కవుల పరమార్థం జీవాత్మ పరమాత్మల తోడి సంశ్లేషంగా భావించవలె. సాక్షాత్తు శ్రీమన్నారాయణుని దివ్య శృంగార లీలాభివర్ణనలుగానే గణించవలె. కాని లౌకికమైన భౌతిక దృష్టితో పరికించడం ఇక్కడ సముచితం కాదు.

ఇన్ని గుణాలున్న దాశరథి శతక, మహాభక్తి కావ్యంగా లోకంలో ప్రచారాన్ని పొందింది. ప్రాభవాన్ని సంపాదించింది.

2. పొన్నిగంటి తెలగన్న - యయాతి చరిత్ర

- డా॥ కె. విద్యావతి

అచ్చ తెనుగులో మొట్టమొదటి కావ్యము పొన్నిగంటి తెలగన్న రచించిన "యయాతి చరిత్రము" అచ్చ తెలుగు కవులలో మొదటివాడైన గోల్కొండ పాలకుడైన ఇబ్రహీంషా కాలపువాడు. మీర్-జుమ్లా అమీన్ ఖాన్ అనే సర్దారు పొట్ల చెఱ్వు (నేటి పటాన్ చెఱువు) లేదా ఇప్పటి పటన్ చెర్వు ప్రాంతం పాలకుడు. తెలగన్న యయాతి చరిత్రను ఈ సర్దారు కోరికపై వ్రాసి అంకితమిచ్చాడు. కృతిపతి అమీన్ ఖాన్ ఆయన భార్య బడే బీబీ ఔదార్యాన్ని కృతిపతి వంశవర్ణనలో ఎంతగానో ప్రశంసించాడు. ఈ రచన వెనుక రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. 1. నూతన ప్రయోగాన్ని చేపట్టాలనే కవి ఆసక్తి, 2. కృతిభర్త అమీన్ ఖాన్ ప్రోత్సాహపూర్వక కోరిక. తాను అచ్చతెనుగులో కావ్యం ఎందుకు వ్రాశారో తెలగన్న ఇలా చెప్పాడు.

ఉ॥ "అచ్చతెనుంగు పద్యమొకటైనను గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుండురది యెన్నుచు నేర్పునఁబొత్త మెల్లని;
ట్లచ్చ తెనుంగునన్నొడువ నందుల చంద మెఱుంగువారునిన్,
మెచ్చరొ యబ్బురం బనరొమేలనరో కొనియాడరో నినున్. (1-12)

అలాగే అచ్చతెలుగు రచనకు తాను ఏర్పరుచుకున్న నియమాలను కూడా తెలిపాడు. యయాతి చరిత్ర మహాభారతం ఆదిపర్వంలోని ఒక ఉపాఖ్యానం. తెలగన్న ఈ చిన్నికథను వస్తువుగా గ్రహించి అలంకారిక శైలిలో శృంగార రసపోషణలో ప్రబంధంగా మలిచాడు. మూలకథను యథాతథంగా అనుసరించలేదు. వ్యాసభారతంలోని కథ, నన్నయ నిర్మాణంలో కొంత మారింది. తెలగన్న మరికొన్ని మౌలికమైన మార్పులు చేశాడు. శర్మిష్ఠ దేవయానుల పాత్ర చిత్రణలో మార్పు, జలక్రీడ తర్వాత శర్మిష్ఠ, దేవయానుల వలువలు మారినపుడు

ముందుగా అసహ్యించి కోపించింది దేవయాని ఒక భారత కథ. తెలగన్న తన కథలో ముందు అసహ్యించి నిందించింది రాచబిడ్డ అయిన శర్మిష్ఠ.

ఈ మార్పు వెనుక కారణం కాలానుగుణంగా సంఘంలో వచ్చిందే. ఇతివృత్త నిర్మాణంలో నన్నయ దృష్టి వేరు. తెలగన్న దృష్టి వేరు. నన్నయ ధర్మ సూత్రాలకు బదులుగా దేవయాని పాత్రను మలిచాడు. ధర్మాతిక్రమణ దాని ఫలితం పరిణామం ఆ పాత్రలో స్పష్టంగా ఆవిష్కరించాడు.

1. మార్పు : యయాతి చరిత్రలో తెలగన్న అవసరం వేరు. రాచ సంప్రదాయాలు, రాచ బ్రతుకులకు నిలువుటద్దంగా రచన చేశాడు. అంకితమిచ్చింది ఒక సరదారుకు, అందుకే వాళ్ల రాజసపు దీవెనలు శర్మిష్ఠ పాత్రలో ప్రవేశపెట్టి (సందర్భాన్ని) పాత్రల చర్యలను మార్చాడని చెప్పవచ్చు.

2. మార్పు : పాత్ర సంవిధానంలో కనిపించేది ఋతుమతియైన శర్మిష్ఠ, యయాతిని తనకు సంతానం ఇమ్మని కోరుతుంది. యయాతి చరిత్రలో శర్మిష్ఠ యయాతి తనకు భర్త అని, తనను భార్యగా స్వీకరించుమని పుష్పవనానికి వచ్చిన యయాతిని కోరుతుంది.

కం॥ విను నన్నేలిన నెల(తకు(
బెనిమిటి వైనపుడె నాకు(బెనిమిటి వగు దె
ట్లనన నాలు(గొడుకు వరవుడు
ననునవి పాయనివి చదువులందును వినవే (5-16)

నన్నది పురాణతత్త్వం. 16వ శతాబ్దం సాంఘిక వ్యవస్థకు అనువుగా తెలగన్న ఈ మార్పు చేసి, దాంపత్య విశిష్టతను నిలబెట్టాడు. "పెనిమిటిని పెండ్లి కొడుకుల గత మగువలు కోరుటెందు గలదు" అని ముందు పెనిమిటిని పొందాలనే బలమైన కాంక్షను శర్మిష్ఠ చేత వ్యక్తం చేయించాడు.

3. మార్పు : శుక్రాచార్యుడు యయాతికి శాపమిచ్చిన వృత్తాంతాన్ని పూర్తిగా తొలగించాడు. ఈ మార్పుకు కారణం తెలగన్న నివసించిన రాజమహళ్ళు, తనను పోషించిన ఆమీన్ ఖాన్ కోరికపై ప్రబంధం రచించాడు. తను చెప్పబోయే శృంగార కావ్యానికి ఇతివృత్తం ప్రసిద్ధమై ఉండాలని భారతంలోని యయాతి చరిత్రను ఎన్నుకొన్నాడు. ఈ ఉపకథను కావ్యంగా మలచడంలో తెలగన్నది మహాభారతంలో వలె ధార్మిక దృష్టి కాదు. శృంగారాత్మక కల్పన. అపార భోగ విలాసాలతో నిండిన గోల్కొండ నవాబులు, వారి సర్దారుల మనస్సుకు ఎక్కాలంటే తెలగన్న ఈ మార్పు చేయక తప్పదు. ఒకరాజు ఇద్దరు భార్యలను పెళ్ళాడివారితో, వారి పుత్ర సంతతితో హాయిగా కాలం గడపాడని శృంగార కవనం చేసినపుడు తాదాత్మ్యంతో వినిన ఏ రాజు అయినా హాయిని ఆనందాన్ని అనుభవిస్తాడు. అందులోను యయాతిని పెళ్ళాడిన ఇద్దరు కన్యలు ఒకరినొకరు తీసిపోరు. వీరిద్దరు ఒకరి తర్వాత మరొకరు వరుసగా యయాతిని ప్రేమించి పెళ్ళాడి, అయిదుగురు కొడుకులను అందించారు. ఈ సరసమైన శృంగార కథను విన్న రసిక రాజులు "భళీ" అనవలసిందే! వందలకొద్ది భార్యలను పెట్టుకొనే నవాబుల యుగంలో సమకాలికుల మెప్పు నాశించి తెలగన్న దేవయాని శర్మిష్ఠలతో యయాతి పెళ్ళి వృత్తాంతాన్ని మాత్రమే కథా వస్తువుగా స్వీకరించి కాలానుగుణమైన ఔచిత్యాన్ని పాటించాడు. యయాతికి శుక్రుని శాపం మొ॥న అంశాలతో కూడిన కథాభాగాన్ని వదిలివేసి, ప్రబంధ రచనకు అనుకూలంగా కథా వస్తువును సంగ్రహించాడు.

4. మార్పు : యయాతి చరిత్రలో తెలగన్న చేసిన మరొక ప్రధానమైన మార్పు మహర్షి జాబాలి యయాతికి రామకథ చెప్పటం. తెలగన్న రామభక్తి, ఇబ్రహీంషాను ఇభరామునిగా భావించడం కారణమని యయాతి చరిత్రపై కొందరు అభిప్రాయపడ్డారు. మరి కొందరు ఇది కథాగతికి అవరోధంగా ఉన్నదని తెలిపారు.

కాని ఈ మార్పుకు కారణం - ఆనాటి భక్తి ఉద్యమం క్రీ.శ. 15వ శతాబ్దము తర్వాత వైష్ణవ భక్తి ఉద్యమం కారణంగా అటు ఉత్తర, దక్షిణ భారతదేశంలో రామభక్తి సంప్రదాయం వ్యాపించింది. విజయనగర రాయల

పరిపాలన కాలంలో దక్షిణ భారత దేశంలో రాముని గుళ్లు ఊరూరా వెలిశాయి. రామానందుడు, కబీరు మొదలగు భక్త కవుల మూలంగా రామకథ విశేష జనాదరణ పొందింది. జానపదుల రామభజన ప్రభావంతో తెలగన్న యయాతికి జాబాలి చేత రామకథను చెప్పించాడు. అంతేకాని తెలగన్న రామభక్తి కారణమని చెప్పటంలో ఔచిత్యం కనిపించదు. ఒకవేళ తెలగన్న రామభక్తుడయితే ఆ విషయాన్ని కావ్యంలో సూచించేవాడు. ఆశ్వాసాంత గద్యంలో "ఇది శ్రీమదనగోపాల మంత్ర ప్రసాదలబ్ధ సారస్వత సుకవిజనవర్ణనీయ వచోవిభవ భావనామాత్యతనూభవపొన్నికంటివంశ్య తెలగనార్య ప్రణీతంబైన"... అని మదన గోపాల మంత్ర పాలకునిగా తనను గురించి తెలిపాడు. ఇబ్రహీంషాను ఇభరామునిగా సంభావించడం రాజభక్తికి నిదర్శనం. రామకథకు ఆనాడు జనంలో ఉన్న విశేషమైన భక్తి ప్రచారాన్ని కూడా తెలగన్న స్వయంగా చెప్పాడు.

"ఇప్పగిది ననిచి రాముండు కడలేని సిరులు తొడరి కడలి కడగఁగల పుడమిఁదడవేలెనిది కనువినుకలి నెలవుపుట్టుచే విరివిగఁ జెప్పంబడ జగంబు లెఱింగిని దగుటంచేసి నీకుంగొంచెంబుగా చెప్పితి..." అని జగంబులెఱింగినదని రామకథ ప్రాశస్త్యాన్ని తెలిపాడు.

ఈ మార్పు సందర్భం అనటం కూడా సమంజసం కాదు. భారతకథలో యయాతి చంద్రవంశపు రాజు. రామాయణంలో రఘుకులంలోని వాడు. అయితే త్రేతాయుగంలోని వంశానుచరితం, ద్వాపరంలోనికి వచ్చేసరికి క్రమం మారింది. ఇలా మారటం పురాణ లక్షణమని పండితాభిప్రాయం. ఈ మార్పు మొదట మూలకథకే వర్తిస్తుంది. ఇక్కడ ఇంకొక అంశము కూడా మనం గమనించవచ్చు. తెలగన్న మొదటిసారి అచ్చతెనుగులో రచనకు పూనుకున్నాడు. రామాయణ, మహాభారతాలు యావద్భారత సంస్కృతికి నిక్షేపాలు. మన భారతంలో ఇతివృత్తాన్ని ప్రధాన వస్తువుగా ఎన్నుకున్న తెలగన్నకు రామాయణాన్ని వదలిపెట్టటం వెలితిగా అనిపించింది. యయాతి వేటను సందర్భం చేసుకొని రాముని కథను చెప్పాడు. తద్వారా జనాదరణ మరింత లభించే అవకాశం వుంది. (తెలగన్న రామకథను

చెప్పిన తీరు, అనగనగా ఒక రాజు... అని జానపదులు కథ చెప్పుకున్నట్లు వుంది. ఒంటరిగా వస్తున్న రంభను పది మొగాల రాకాసి దశకంఠుడు, రావణాసురుడు) బలవంతంగా అనుభవించడంలో ఈ కథను ప్రారంభించాడు. ఆ తర్వాత ఒంటరిగా ఉన్న సీతను లంకకు ఎత్తుకుపోయాడు. ఈ కథా అంశాలను వర్ణించడం ద్వారా స్త్రీలకు ఒంటరిగా ఉండటం చాలా అపాయకరమైనదని సందేశమిచ్చాడు.

రావణుని కామానికి బలియైన రంభస్థితిని చిత్రించి అత్యాచారానికి బలయిన ఒక స్త్రీని మన ముందు నిలిపాడు. ఈ సందర్భములో పోకముడి వేసి కట్టుకున్న చేల చెఱగు చినిగిపోయిందని చెప్పటం అచ్చమైన జానపద భావన.

వర్ణనలు : దేశీయ పదజాలం, జానపదీయత, ప్రబంధ రచనలకు కావలిసిన వర్ణలన్ని కనిపిస్తాయి. వేట, సూర్యోదయం, సూర్యాస్తమయం మొ॥న ప్రబంధ వర్ణనలెన్నో యున్నవి. శుక్రుడు కూతురు పెళ్ళిలో భాసించే వర్ణనలు కొన్ని 'పొసగెడు వేలుపున్మొదవుబోలినయావుల నొక్క వేయిటినిచ్చాడు. వృషపర్వుడు పసుపునకు కొన్ని విలాతులను చదివించాడు. పెళ్లిలో కట్నాలను చదివించడం ఇప్పటికి తెలంగాణ ప్రాంతంలో ఆచరణలో వుంది. "ఎండబడకుండ కూతుంగొండిక యన కంపవలయు కూరిమిననుడున్" (4-127) అని శుక్రుడు ఇల్లాలితో అన్నాడట. ఈ మాటలు సూటిగా పాఠకుల హృదయానికి తగులుతాయి. ఎండపొద్దు పూలవనంలో తిరుగుతున్న శర్మిష్ఠ పయ్యెద చెఱుగును ముంగల చెక్కుకుందట ఇట్లు ప్రకృతి వర్ణనలో కవి లోతైన పరిశీలన కనిపిస్తుంది. ఉద్యానవనాల శిల్పిగా తెలగన్న ప్రతిభ ఆయా వర్ణనల్లో భాసించింది. అందమైన పూలతోటలను, సరస్సులను వాటి నిర్మాణాన్ని చిత్రం గీసి చూపినట్టు వర్ణించాడు. భాగ్యనగర పరిసరాల్లోని పాఠకులకు వన విహారం చేయించాడంటే అతిశయోక్తి కాదు. ఇకపోతే ఈ కావ్యం ప్రత్యేకత కవి ఎన్నుకున్న 'అచ్చతెనుగు' భాషది.

నన్నయ, తిక్కనాదులు తెలుగు భాషను గూర్చి భారత రచనలో ప్రత్యేకంగా చెప్పలేదు. నన్నెచోడుడు పాల్కురికి సోమన "జానుతెనుగు"ను ప్రస్తావించారు. తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణంలో తాను పాడదల్చుకున్న భాషా నియమాలను తెలుపుతూ విద్వాంసుల మనములు వికసించునట్లు ప్రయోగింతునని చెప్పినాడు. ఇంపారెడు పలుకులను హృదయమునకు హత్తుకొనునట్లు దేశ్యాలయిన తెలుగు మాటలను ఎక్కువగా వాడి భావగాంభీర్యాన్ని కావ్య గౌరవాన్ని ఇనుమడింపచేశాడు. ఒక విధంగా ఎటువంటి భావాలనైనా వ్యక్తీకరించడానికి మహాకావ్య రచనకు దేశ్య శబ్దాల ప్రయోగాన్ని సమర్థవంతంగా చేయవచ్చునని, ఆ భాషకు అటువంటి శక్తి వుందని నిరూపించాడు. అందుకే కేతన తన తొలి తెలుగు వ్యాకరణం, ఆంధ్ర భాషాభూషణంలో అంతకు ముందెవ్వరు చెప్పని 'అచ్చతెనుగు'ను నిర్వచించి ఉదాహరణం చూపించాడు. అల్లసాని పెద్దన సంస్కృత తెలుగు కవితారీతులను వివరించి మృదుమధురాలయిన భావాలను కేవలం తెలుగు మాటల్లోనే చెప్పాలన్నాడు. మొత్తం మీద కవుల ప్రయోగాలలోని 'జాను తెనుగు' దేశి 'అచ్చతెనుగు' మాటల్లో కొంత అస్పష్టత కనిపిస్తుంది. తెలుగుకు మొదటి వ్యాకరణ గ్రంథంగా పరిగణిస్తున్న ఆంధ్ర శబ్ద చింతామణిలో 'అచ్చతెనుగు' ప్రస్తావన లేదు. కేతన ఆంధ్ర భాషా భూషణంలో తెలుగు పదాలను తత్సమ, తద్భవ, అచ్చతెలుగు, దేశ్యము, గ్రామ్యము అని అయిదు భాగాలుగా వర్గీకరించాడు. అచ్చతెనుగు కావ్యాలలోని భాష "తత్సమంబు దక్క తక్కిన నాలుగు అచ్చతెనుగు లందు రఖిల జనులు అని కేతన చేసిన అచ్చతెనుగు విభాగానికి చెందుతుంది. చిన్నయసూరి బాలవ్యాకరణంలో "తెలుగునకు వర్ణములు ముప్పదియారు.." అని అచ్చతెనుగు కావ్యాల్లోని భాషావర్ణాలను చూపించాడు. "త్రిలింగ దేశ... దేశ్యంబు" కోట, పేటాదులను ఉదాహరించాడు. ఆచ్ఛిక పరిచ్ఛేదంలో "సంస్కృత సమేతరంబైన ఈ భాష యచ్చయనంబడు" అని సూత్రించి, తత్సమాలు తప్ప, సంస్కృతభవ, ప్రాకృతసమ, ప్రాకృతభవ పదాలు కూడా తెలుగులో ప్రయుక్తమై తెలుగు కావ్యాలలోని అన్యదేశ్యాల విభాగం బాలవ్యాకరణంలో లేదు. అచ్చతెనుగు

కావ్యాల భాషను పరిశీలించినపుడు వ్యాకర్తల సూత్రీకరణ పూర్తిగా అన్వయించదు. అచ్చతెనుగంటే సంస్కృత సమాలు కాని తక్కిన పదజాలం. అన్యదేశ్యాలతో సహా. అయితే తెలుగు కావ్యరచనలో ఇతివృత్త మంతా సంస్కృత సాహిత్యం నుంచే వచ్చింది. సంస్కృతంలో వున్న పాత్రల పేర్లు, బిరుదులను మార్చి కృతకమైన పదబంధాలను కల్పిస్తే ఇంపుగా లేకపోవటం, అర్థానికి ఆటంకం కలుగుతుందని ఆ మేరకు సంస్కృత శబ్దాలను అంగీకరించారు.

తెలగన్న యయాతి చరిత్ర పీఠికలో కూడా ఇదే తెలియచేశాడు. తర్వాతి అచ్చ తెనుగు కావ్యకర్తలందరు తెలగన్ననే అనుసరించారు. అయినప్పటికి యయాతి చరిత్రలో సంస్కృత సమాసాలు, పేర్లకు బదులు కొత్త పదబంధాలు కల్పించబడ్డాయి.

ఉదా : పదిమొగముల రాకాసి, రాకాసిపోలు, రాకాసి రేని కూతురు, రాకాసులయొజ్జ కూతురు, దయ్యంబుయొజ్జ, కడవపట్టి, పైడికంటి రాకాసి తద్భవాలు : ఇంగలము, పసరము దేశ్యాలు : దిడ్డితోవ, మొగులు, యొద్దికి, ఉలుపయాడ, యాడిది.

సమాస రచన, సంధి విధానంలో స్వతంత్రత కనిపిస్తుంది. ముఖ్యంగా పదమధ్యంలో అచ్చు లోపించటం, నామపదాలపై ఇత్వసంధి - దేవయాననగ, అనేక జానపద నిరుక్తులు, ఉప్పుకడలి ఆవలికేగె, అదియెంత పెద్ద (పని) మాకు, చెంగుముంగల చెక్కు, చుఱుక్కుమని (పొక్కడం) ఇలాంటివెన్నో భాషా విశేషాలు ఒక ప్రత్యేక వ్యాసంగా వ్రాయవచ్చు.

తిక్కన తెలుగు పద్యాలు చదివిన తర్వాత తెనుగుదనం రుచి చూసిన కవులు తమ కావ్యాలలో అక్కడక్కడ అచ్చ తెలుగులో పద్యాలు రాశారు. తిక్కన తెలుగు భాషా సౌందర్యపు సొంపును తెలగన్న తన పొత్తంలో పూర్తిగా ఆవిష్కరించాడు. తెలగన్న యయాతి చరిత్రలోని తెలుగు భాష సొంపు పెంపుకు

ప్రభావితులయిన కవులు అది మొదలుగా అక్కడక్కడ అప్పుడప్పుడు అచ్చతెనుగు కావ్యాలు రాశారు. ఆ విధంగా ఇరవయ్యో శతాబ్దం వరకు సుమారు 50 మంది కవులు వందకు పైగా అచ్చ తెనుగు కావ్యాలు రాశారు.

తెలగన్న తలపెట్టిన అచ్చతెనుగు ప్రక్రియ సాహిత్యంలో ఒక పరిణామానికి దారి తీయలేదు. దీనికి తర్వాతి అచ్చతెనుగు కవులు ఏర్పరుచుకున్న అనేక నియమాలు ప్రధాన కారణం. కొందరు కవులు అచ్చతెనుగులో నిరోష్ఠ్యంగా, మరికొందరు దీనితోపాటు నిర్వచనంగా ఇలా రకరకాల నియమాలను ఏర్పరచుకొని ఎవరికి వారు ఒక నూతన ప్రయోగం చేయాలని, తమ పాండిత్యాన్ని ప్రదర్శించాలని ప్రయత్నించారు. అందుకే అచ్చతెనుగు కావ్యాలు ప్రయోగ వైచిత్రి నిదర్శనాలయ్యాయి. కాని ఒక ప్రత్యేక కావ్య ప్రక్రియగా స్థిరపడలేదు. పదబంధాల్ని కొత్త పదకల్పనలో ఎవరి దారి వారిదయ్యింది. భాషాపరంగా ఒక స్పష్టమైన మార్గాన్ని కవులు నిర్మించుకోలేకపోయారు.

నూతన ప్రయోగాన్ని చేపట్టాలని ఆసక్తి, స్వీకృతిభర్త అమీన్ ఖాన్ ప్రోత్సాహము వలన యయాతి చరిత్ర సమకాలిక సాంఘిక విలువలతో అయిదు ఆశ్వాసాల అచ్చ తెనుగు ప్రబంధంగా వెలువడింది.

✦

3. అద్దంకి గంగాధరకవి - తపతీ సంవరణము

- డా॥ ఎం. పద్మకుమారి

తపతీ సంవరణ ప్రబంధ రచయిత అద్దంకి గంగాధరకవి. ఇతని తండ్రి పేరు వీరయామాత్యుడు. గురువు కేదారశ్రీగురువర్యులు. దీక్షా సాహిత్యముల రెంటిని నేర్పిన గురువు ఈయనే. స్వగ్రామము నెల్లూరు మండలము నందలి అద్దంకి. గంగాధరుని తండ్రి కాలముననో, తాత కాలముననో గోలకొండ ప్రాంతమునకు తరలివచ్చి స్థిరపడి వుండవచ్చును.

కృతిపతి ఇబ్రహీమ్ తండ్రి కుతుబ్ - ఉల్ - ముల్క్. ఇతడు తూర్పు భారతదేశమున కొంత భాగమును ఓఢ్రుల నుండి గెలుచుకొన్నట్లు 'గూడూరు' శాసనమున తెలుపబడినది. నెల్లూరు మండలములోని కొంత భాగమును కుతుబ్‌షాహీల పాలనలో ఉన్నప్పుడు గంగాధరుని తండ్రి వీరయామాత్యుడు వారినాశ్రయించి కొలువు సంపాదించి యుండవచ్చును. తండ్రి సహాయముతో గంగాధర కవి కూడా సుల్తానుల ఆస్థానములో ప్రవేశించియుండును. గంగాధరకవి తొల్దొలుత కుతుబ్-ఉల్-ముల్క్ అనంతరము రాజ్యపాలన చేస్తున్న 'జంషీద్' కొలువులో వున్నట్లు ఒక సీస పద్యమును బట్టి తెలియుచున్నది. జంషీద్ అనేవాడు కుతుబ్-ఉల్-ముల్క్ కుమారుడు ఇతడు. తండ్రిని సంహరించి, సోదరుడైన 'హైదరుఖాను'ను ఖైదును చేసి నిజాం గద్దెనెక్కినాడు. ఇతనికి భయపడి ఇబ్రహీం విజయనగరమునకు పారిపోయినాడు. విజయనగర రాజ్యాధిపతి 'అళియరామరాజు'ను శరణుజొచ్చినాడు. జంషీద్ పరిపాలించినంత కాలము అనగా క్రీ.శ. 1543 నుండి క్రీ.శ. 1550 వరకు 7 సంవత్సరములు విజయనగరముననే యున్నాడు. విజయనగరమున ఉన్నంత కాలము అక్కడి పండితువల్ల రాజనీత్యాది శాస్త్రములను, సంస్కృతాంధ్ర భాషలను, సాహిత్యములను నేర్చుకొన్నాడు. విజయనగర రాజుల ఉత్తమాదర్శములను అలవర్చుకొన్నాడు.

క్రీ.శ. 1550లో జంషీద్ మరణానంతరం "ఇబ్రహీం" గోలకొండ రాజ్యాధిపతి అయినాడు. ఇతడు హిందూ ముస్లింలను సమదృష్టితో చూసేవాడు. తెలుగు, ఉర్దూభాషలను సమాదరించినాడు. 'భాగీరథీ" అను హిందూ యువతిని వివాహమాడి గోలకొండకు "భాగీరథీ పట్టణ"మని నామకరణము చేసినాడు. భాగీరథీ వలన కులీకుతుబ్-షా జన్మించినట్లు 'గులామ్ హుసేన్ ఖాన్ జోహర్' 'మహ్‌నామా' అను అముద్రిత పారశీ గ్రంథమునందున్నదని డా॥ బిరుదరాజు రామరాజు గారు 'కుతుబ్-షాహీ- సుల్తానులు - ఆంధ్ర సంస్కృతి' అను పుస్తకము నందు తెల్పియున్నారు. తండ్రి మార్గముననుసరించి కులీకుతుబ్‌షా 'భాగామతి' అను హిందూ యువతిని పెండ్లియాడి భాగ్యనగరమును నిర్మించినాడు.

తెలుగు భాషను నేర్చుకొని, తెలుగు కవిత్వమును ఆస్వాదింప గలవాడగుటచే పలువురు తెలుగు కవులు ఇబ్రహీమ్‌ను దర్శించి తమ కవితాపాటవమును ప్రదర్శించుచుండిరి. ఇతనిని తెలుగువారు 'ఇభరాముడు' అని పిలుచుచుండిరి. ఇభరాముని కవి పండిత పోషణత్వమును గురించి 'సారస్వత సారస్య విచార స్తుతమతి కవీంద్ర సన్నుత మూర్తీ', 'హిందూరాయవిభాళ సత్కవిమణీ బృందావన ప్రక్రియా మందార ద్రుమ', 'ప్రతివారస్తుత సారస్వత ధీర ప్రణుత విజయ చారిత్రునకున్' అని గంగాధరకవి కొనియాడినాడు. ఇభరాముడు ఇస్లాం మతస్థుడైనను హైందవ పురాణేతిహాసముల పట్ల ఆసక్తిని చూపుచుండెడివాడు.

ఒకనాడు ఇభరాముడు ఆస్థానమునందు ఆసీనుడైయున్న తరుణమున గంగాధర కవిని పిలువనంపి అతనితో

"పెక్కు కృతుల్ చమత్కృతులు బెంపుగ నందితిఁగాని నీదు స
మ్యక్కృతి కన్యపైఁగల మమత్వము వర్తిలదందు; లెక్కకుం
బెక్కువగాఁగ గోపికలు మించివసించిన నేమి రాధపై
మక్కువ యెక్కువై మిగుల మన్నన సేయడె శౌరి వేడుకన్".

"అట్లు గావున భారతాఖ్యానమందుఁ
గలుగు తాపత్య చరితంబు ఘనత నరసి
వివిధ శృంగార మహిమల విస్తరించి
కబ్బమొనరింపు నాపేర గవివరేణ్య"

అని కర్పూరతాంబూలమిచ్చి తపతీసంవరణమును తనకంకితముగా వ్రాయమని కోరినాడు. భారతము నందలి తపతీ సంవరణుల మూలకథను గ్రహించి తనకు, భాగీరథికి మధ్య నడచిన శృంగార గాథను నిర్మింపుమని గంగాధరకవిని కోరినాడు.

తపతీ సంవరణము శ్రీకృష్ణ దేవరాయల కాలమున వెలువడిన మను, వసుచరిత్రాది ప్రబంధ పరంపర ననుసరించి వ్రాసినట్లుగా భావింపవచ్చును. నలోపాఖ్యానములోని హంస రాయబారమును తలపింపచేయు చిలుక రాయబారము కలదు.

తపతీ సంవరణోపాఖ్యానమనబడు మహాభారత ఉపాఖ్యానము, భారతమునందు ఆదిపర్వములోని సప్తమాశ్వాసములో 23 పద్యగద్యములలో నన్నయచే చిత్రీకరించబడినది. దానిని గంగాధరకవి సుమారు 500 పద్యగద్యములలో, ఐదాశ్వాసములుగా, వివిధ వర్ణనలతో ప్రబంధీకరించినాడు.

సూర్యునకు సావిత్ర, తపతి యను యిద్దరు కుమార్తెలు. తపతి యౌవనవతి అయిన వెంటనే, ఆమెకు తగిన వరుని గురించి ఆలోచింపసాగినాడు సూర్యుడు. భూలోకమున సూర్యునికై తపమాచరించుచున్న భరతవంశపు రాజు సంవరణుడు తపతికి తగిన పతి యని సూర్యుడు నిశ్చయించుకొన్నాడు. ఈ కథను అర్జునుడడుగగా అంగారపర్ణుడను గంధర్వుడు చెప్పినాడు.

ఒకనాడు భరతవంశపు రాజైన సంవరణుడు వేటాడి అలసిపోయి ఒక పర్వతప్రదేశమును చేరినాడు. అచట ఒక కన్యను జూచి, ఆమె సౌందర్యమునకు

అబ్బురపడినాడు. కనక ప్రభలను వెదజల్లుతున్న ఆమె శరీరకాంతిని, చంద్రబింబము వంటి ముఖారవిందమును జూచి వివశుడైనాడు. "ఒంటరిగా తిరుగాడు నీవెవరిదానవు? ఎందులకేతెంచినావని? ప్రశ్నించిన సంవరణునకు సమాధానమీయకనే యా కన్య యదృశ్యురాలైనది. తపతి కొరకు నేలపైబడి విలపించుచున్న సంవరణుని దీనత్వమునకు జాలిపడి తిరిగి ప్రత్యక్షమైంది. అతని వృత్తాంతమును తెలుసుకొని, తన వృత్తాంతమును దెల్పి సూర్యునారాధించి తనను పొందుమని చెప్పి సూర్యలోకమునకు వెళ్ళినది.

తపతిని గానక సంవరణుడు మూర్ఛితుడైనాడు. సంవరణుని అమాత్యుడు వచ్చి శీతలోపచారములు చేసి మూర్ఛ తీర్చెను. సంవరణుడు ఆ పర్వతము నందే యుండి సూర్యునారాధించుచు, తన పురోహితుని (వసిష్ఠుని) స్మరించుకొనెను. వసిష్ఠుడు వచ్చి కృశించియున్న రాజును జూచి యోగదృష్టితో సూర్యసుతయైన తపతి యందు అనురాగబద్ధుడైనట్లు తెలుసుకొన్నాడు. వెంటనే సూర్యలోకమునకు పోయినాడు. నిముషమునకు మూడువందల అరవై నాలుగు యోజముల వేగముతో పరిభ్రమించుచున్న సూర్యుని స్తుతించి, సంవరణునకు తపతిపై గల ప్రేమను దెల్పినాడు. సూర్యుడు సంతోషించి తపతిని వసిష్ఠుని వెంట పంపెను. వసిష్ఠుడు సూర్యుని రథముపై తపతిని భూలోకమునకు తీసుకొని వచ్చి సంవరణునకిచ్చి పెండ్లి చేసెను.

సంవరణుడు ఆమెతో భోగములననుభవించుచు రాజ్యమును, రాజకార్యములను విడిచిపెట్టి ఆ పర్వతారణ్యములందే పండ్రెండు సంవత్సరములు గడిపెను. రాజులేని (హస్తినాపురము) రాజ్యము అనావృష్టి పాలయ్యెను. వసిష్ఠుడు శాంతి పౌష్టిక క్రియ లొనరించి సంవరణుని హస్తినకు తోడ్కొని వచ్చెను. సంవరణుడు రాచకార్యములందు ఆసక్తితో నుండి పరిపాలింపసాగెను. అతనికి తపతి యందు వంశకరుడైన 'కురువు' జన్మించెను.

మహాభారతమునందలి తపతీ సంవరణుల ఉపాఖ్యానమును గంగాధర కవి తన కల్పనా చమత్కృతితో పలువిధములుగ పెంచి ప్రబంధీకరించెను. 1. చిలుక రాయబారము, 2. శ్యేనమయూరముల పోరాటము, 3. తపతి చెలికత్తెలు, 4. అరుంధతి ప్రవేశము, 5. ఇతర వర్ణనములు. మొదలగు పలు వర్ణనలతో పెనుముడింపచేసి రమణీయమైన ప్రబంధమును తయారుచేసినాడు.

నలోపాఖ్యానము నందలి నలదమయంతుల నడుమ ప్రేమాయణమును నడిపిన హంసరాయబారముననుసరించినట్లున్న చిలుక రాయబారము గంగాధరకవి కల్పనలో ప్రధానమైనది. మిగిలివన్నియు దానికి సంబంధించిన ఉపవర్ణనలు.

నలదమయంతుల కథా ప్రభావము తపతీ సంవరణుల ప్రణయ కథకు ఆధారమనిపించును. ఈ ప్రబంధములో చిలుక నాయికా నాయకులకు పరస్పర సౌందర్యములను వర్ణించి, పరస్పర ప్రణయమునకు మార్గము వేసినది. ఈ చిలుక మగచిలుక, తపతికి ప్రియశిష్యుడు. ఆమె వద్ద అన్ని విద్యలను నేర్చుకొని, గురుదక్షిణగా యోగ్యుడైన భర్తను వెదకు బాధ్యతను స్వీకరించి అన్ని దేశములను తిరిగి చివరికి సంవరణుడున్న ప్రదేశమునకు వచ్చినది. సంవరణుడే తపతికి తగిన భర్తయని నిశ్చయించినది.

చిలుక పలుకులతో తపతిపై మరులుగొన్న సంవరణుడు సూర్యుని మెప్పించి సూర్యసుతను పొందగోరెను. మూలమున సంవరణుని సూర్యారాధనకు సరియైన కారణము కన్పింపదు. గంగాధరుడు చిలుకను పంపించి సంవరణుని సూర్యారాధనకు ప్రేరణ కల్పించెను. సంవరణుని ఉపాసనకు సంతుష్టుడైన సూర్యుడు తన పుత్రికనిచ్చుటకు నిశ్చయించుకొనెను. చిలుక ప్రవేశముతో ఉభయుల మనోరథములు సఫలమైనవి. ఈ ప్రబంధమునకు ప్రాణప్రదమైన చిలుక రాయబారమునకు ఇభరాముని కోరికయే కారణము. "వివిధ శృంగార మహిమల విస్తరించి కబ్బమొనరింపు నాపేరఁగవివరేణ్య" అని కోరిన మాట

గుర్తుకువచ్చును. ఆయన కోరిక మేరకు తపతీ సంవరణుల శృంగారమునకు పూర్వానురాగ రూపమైన 'వినుకలి వలపు' కల్పింపబడినది.

గుణ శ్రవణ, స్వప్నాది దర్శనముల వలన నాయికా నాయకులకు జనించు ప్రేమ పూర్వానురాగమై యొప్పును. అది సంగమమునకు పూర్వము జనించి వర్థిల్లును. కవి దీనిని సమయోచితముగా కల్పించి, ప్రయోజనవంతముగా నిర్వహించినాడు.

"యత్ప్రేమ సంగమాత్పూర్వం దర్శన శ్రవణోద్భవం
పూర్వానురాగస్సవిజ్ఞేయః శ్రవణం తద్గుణ శ్రుతిః
ప్రత్యక్ష స్వప్న చిత్రాదౌ దర్శనం దర్శనం స్మృతం"

అను ఆలంకారిక వచనము దీనిని నిరూపించుచున్నది. సూర్యోపాసనతో మూలకథ ఆరంభమైనది. గంగాధరకవి శృంగార రస ప్రధానమైన కావ్యమున కనువుగా సంవరణుడు ఉద్యానవన సందర్శనము, సంవరణుని బలపరాక్రమ గుణ రూపాదులతో ప్రారంభించినాడు.

ఉద్యానవనమున విహరించుచున్న సంవరణుడు వృక్షలతాదుల నడుమ వసంతుని వలెనున్నట్లు చెప్పినాడు. లతలనెడి నాయిక విలాసచేష్టలచే తరువులనెడు నాయకులు అనుభావ సాత్త్విక భావములను ప్రకటించుచున్నట్లు సంవరణుడు భావించినాడు.

నవ్య వసంతుని వలె కనబడుతున్న రాజునకు వనలక్ష్మి అపరంజి పాత్రలో దానిమ్మ పండ్ల నుంచి ఆరతులీయగా, రాజు చెఱవునకు వెఱచి మన్మథుడు నుమసాయకములను జాఱవిడిచినట్లు మలయానిల తాకిడికి పూలు జలజలరాలెను. ఇచట కవి ఉత్ప్రేక్షను కమనీయముగా కనుల ముందుంచినాడు.

నవరసాలము వలె ప్రవేశించిన రాజునకు మహారసాలముపై చిలుక ఒకటి కనబడినది. ఈ రసాలము తపతీ సంవరణుల పెండ్లి ముచ్చట మాట్లాడుటకు రంగస్థలమైనది. ఆ యెలమావి " ఈ రేడు జగముల నాక్రమించి విశ్వరూపము గైకొన్న విష్ణుకరణి' వ్యాపించి యున్నది. కుతూహలముట్టిపడ ఆ మావిని సమీపించి చంద్రకాంత శిలా తలమున ఉపవిష్టుడైనాడు. సంవరణుని మణిబంధమునకున్న మాణిక్యములు పొదిగిన స్వర్ణకంకణమును దాడిమ ఫలముగ భావించిన ఆ రాజకీరము రాజు మణికట్టుపై వ్రాలినది.

కం॥ ఘృణిశాలి కంకణారుణ
మణి పంక్తిం గాంచి దాడిమ ఫలాశను ద
[illegible] బంధముపై వ్రాలెను
భ్రమితించుచు నొక్క చిలుక పటువేగమునన్.

మాణిక్యములు పొదిగిన స్వర్ణకంకణమును దాడిమ ఫలముగ భ్రాంతిపడినట్లు వర్ణించిన గంగాధరుని కల్పనాచమత్కారము మెచ్చదగినది. వచ్చిన రాచిలుక చిత్రమైన వర్ణము కలిగియున్న దివ్య రాజకీరము. సంవరణుడు ఆ రాజకీరమును నిర్నిమిషుడయి తేరిచూచెను. ఆ నిర్నిమిషత్వము దివ్యమైన తపతిని వివాహము చేసికొనబోవు సంవరణునకు దివ్యత్వమబ్బినది. తపతికి గురుదక్షిణగా తగిన భర్తను వెదక బయలుదేరిన రాచిలుకకు సంవరణుడు సరియగు జోడీయని నిర్ణయించి తపతి సౌందర్యమును వర్ణించి చెప్పినది. తపతి వద్దకు చేరి సంవరణుని సౌందర్యమును వర్ణించి ఇరువురకు పరస్పర ప్రేమను మొలకెత్తించుటకు ఆస్కారమై యొప్పుచున్నది.

తపతి ముఖ సౌందర్యమును గురించి సంవరణుని వద్ద వివరించినపుడు ఈ క్రింది విధముగా రాచిలుక వర్ణించినది.

చం॥ కమలము పూర్ణ చంద్రముడు కాంతిఝరులైక నిధానులయ్యు నీ
రమణి మొగంబు చెల్వునఁ బరాజయమందుట సిద్ధమిప్పుడుం

దమకుఁ బరస్పరంబు ముఖదర్శనమబ్బిన వేళఁ దమ్మివే
గమె ముకుళించుఁ జందురుండు గందు మనంబున సిగ్గుదేఱగన్.

గీ॥ చక్కదనమున నా సరోజాత గంధి
పాటి కలకంఠి లేదని పద్మభవుడు
వ్రాయు లిపి కాప్పదంబదే వనిత నుదురు
వేఱె యడుగంగనేల తద్విభవలీల.

అని తపతి ముఖము కమలము వలె సౌందర్యముగను, చంద్రుని వలె కళంకముతోగాక కళంకరహితమై కాంతిమంతముగా నున్నది. ఇటువంటి సుందరమైన ముఖారవిందమును గాంచిన తమ్మి ముకుళించుకొనిపోతుంది. చంద్రుడు మనస్సులో సిగ్గుపడి వ్యథచెందుతాడు. ఇంతటి అందగత్తెను అందమైన పంచవన్నెల చిలుక ఆహ్లాదకర పలుకులు వినసొంపైనవి.

కం॥ చిలుకల పలుకులు రసములు
చిలుకును భువినెట్టివారి చెవులకుఁజవులై
చిలుకల కొలికి ప్రసంగము
చిలుక ప్రశంసించెనేనిఁ జెప్పగనేలా?

కవి చిలుకను, చిలుకల కొలికిని వర్ణించి ఔచిత్యమును ఇనుమడింప చేసినాడు. గంగాధరుడు ప్రణయగాథను వర్ణించినపుడు నలదమయంతుల రాయబారియైన హంసని దృష్టియందుంచుకొన్నాడని అన్పింపక మానదు.

అమృత తుల్యములైన రాచిలుకపలుకులు విని రాజు మిగుల ప్రసన్నుడైనాడు. రాజు రాచిలుకను ప్రశంసించినపుడు అది చెవియొగ్గి విని మనుష్య భాషలో తపతి సౌందర్యమును వివరించిన తీరు అబ్బుర పరుచునదిగా ఉన్నది.

"బంగారు మయమైన బ్రహ్మాండ భాండంబు
మెఱిగిడు నెవ్వాని మేనిఛాయ"

అని మొదలుపెట్టి ముఖచంద్రము, నెలవంక నుదురు మొదలగు అంగాంగ వర్ణనలను సుమారు 26 పద్యములలో వర్ణించినది. సంవరణుని మనస్సున మన్మథ కలతలు రేపినది.

ఎందరో రాజులను జూచిన ఆ రాచిలుక యెవ్వని యెదుటను తపతి సౌందర్యమును వర్ణించలేదు. సంవరణుని జూచిన వెంటనే రాచిలుకలో తపతికి తగిన పతి యనే భావన కలిగినది. కవి చిలుకను తనకుమారుగా సృష్టించినాడు. ఆ చిలుక యందు తన స్వానుభవములను ఆపాదించినాడు. కాబట్టే చిలుకపాత్రను పకడ్బందీగా గడుసరిగా తీర్చిదిద్దినాడు.

"వాచా వధూ విడంబిని
యాచారుకటీ రథాంగ యా సకల కళా
వైచిత్రిని గావుననా
కాచార్యత్వము వహించెనయ్య మహీంద్రా"

తపతి వద్ద తాను నేర్చిన విద్యలన్నింటిని సంవరణునకు దెలియపర్చినది. పలు భాషలలో పలుకగల నేర్పువున్న తనకు ఆంధ్రమొక లెక్కలోనిది కాదని చెప్పినది. ఇచట గంగాధరుని పాండితీగరిమ స్ఫురింపకమానదు. చిలుక గురుభక్తి నందు గంగాధరుని గురుత్వము స్ఫురించును.

తపతి సౌందర్యమును వినిన సంవరణుడు దివ్యమైన తపతికి మర్త్యుడయిన తనకు వివాహయోగంబసాధ్యమని చింతించుచున్నాడు. అతనికి చిలుక ధైర్యవచనములు చెప్పినతీరు చూచినచో ఆహా యనిపించును. "దైవయోగమున్నచో ఎట్టి దుర్ఘటన కార్యములైనను జరుగునని" అభయమిచ్చినది. దేశదేశములు దిరిగిన ఆ చిలుక సంవరణుని యుద్యానవనమున వ్రాలుటయే

దైవయోగమునకు తొలిమెట్టయిన దైవగతి. అంతరిక్షమున గల చంద్రునకు భువి కలువకు ఎంతో దూరము. అయినా వారికి సంయోగము కలుగలేదా?

"జలజదళ నేత్ర రెండవ చంద్రరేఖ
ధరణి తలమున రాజశేఖరుడవీవు
ఇంతకన్నను విధియోగమేమి కలదు"

ఒక చంద్రరేఖ కైలాసమున రాజశేఖరుని జేరినది. రెండవ చంద్రరేఖయైన తపతి భూలోక రాజశేఖరుడవైన నిన్ను చేరక తీరదు. ఇది దైవయోగము. ఈ సందర్భమున రా చిలుక పలికిన పలుకులు సంవరణునకు ఊరట కలిగించి, తపతికై ఆశలు కల్పించినది. శైవభక్తిని పెంపొందించు శివప్రస్తావనను చిలుక ద్వారా ప్రకటించినాడు. తపతిని మరికొంత వర్ణించి రాజు అభిలాషకు ప్రాణం పోసినది. సూర్యోపాసన చేయుమని గుర్తుచేసి సూర్య మండలానికి వెళ్ళిపోయినది.

చిలుక చెప్పిన తపతి సౌందర్యమును నిరతము ధ్యానించుచున్న రాజు మన్మథావస్థలకు లోనయ్యెను. అదిజూచి పరివార జనులు పరిచర్యలు చేసిరి.

"వెలది నవ్వుల చాయ వెలది వెన్నెల గాయఁ
గపురంపు ధూళిపైఁగప్పె నొకడు
చెలువ కౌఁగిలిపాటి చెలువైన పన్నీట
నొకడు సర్వాంగంబు లోలలార్చెఁ
బద్మాక్షి ముఖసామ్య పద్మజాలంబుల
నురమున నిండార నునిచెనొకడు
పల్లవాధర హస్తపల్లవంబులఁబోలు
పల్లవంబు లొకండు పాన్పు పఱచె
సాత్వికోదయవేళ నా సతికి నొడల
దోడ వెడజారు చెమరుబిందువల వంటి

లలిత మకరంద బిందువుల్ చిలికె నొక్క
డంగనా మన్మథునకుఁ బ్రత్యంగకముల"

ఈ విధంగా మన్మథావశిష్టుడైన సంవరణునకు పరివార జనులు శిశిరోపచారములు చేయగా తాపము కొంత తగ్గెను. గాయత్రి జపించుచు సూర్యోపాసన చేయనారంభించెను. సంవరణుని బహువిధ స్తోత్రములకు సూర్యుడు ప్రసన్నుడై తపతినిచ్చుటకు నిశ్చయించుకొనెను.

చిలుక సూర్యమండలమునకు చేరి తపతి చేతి మీద వ్రాలినది. ఇంతకాలమెచటికేగితివని అడిగిన తపతికిట్లు సమాధానమిచ్చుచున్నది.

"అరిగితి నా సముద్ర వలయావనిఁగూర్చి, తదనంతరంబునం
దిరిగితిఁ బెక్కు దేశములు, ద్రిమ్మరితిన్, బహు పట్టణావళుల్
వరుసఁబసిండికొండ వలవంకను, నేరెడు దీవిలోపలం
గిరిపుర మేలుచున్న మహికాంతుని రాజకుమారునిఁ గాంచితిన్

అంధునకు దివ్యదృష్టి కలిగిన విధంబున ఊరటిల్లిన యా చిలుక రాజము యెలమావి ఛాయ యందలి సంభాషణలను వివరించినది.

"అతని రూపము గనుగొన్న యజ్ఞముఖులు
కడక నీతని వరియించు కన్య ధన్య
యనుచుఁ దమలోన పరియింప నవ్విభునకు
సంవరణ నామధేయంబు సఫలమయ్యె."

"బంగరునఁదావి యమరిన
భంగిం, జెఱకునకుఁ బండు పండిన లీలన్
శృంగార వంతుడగు న
య్యంగ భవస్పర్థిమేన యౌవన మొదవెన్"

సంవరణునకు బంగారమునకు తావి యబ్బినట్లు యౌవనమరుదెంచినది. చెఱకునకు పండిన పండువలె సంవరణుని యౌవనము మధురముగా నున్నది. సంవరణుని ఏ కన్య భర్తగా పొందుతుందో ఆమె ధన్య అని ముందుగానే స్త్రీ మనస్సు వశము చేసుకొనేమాటలు చెప్పి, ఆ తర్వాత సంవరణుని రూప సంపదలను వర్ణించింది.

సీ॥ ఆ సంవరణు రూపమరసి జయంతుండు
నివ్వెఱగంది నిర్నిమిషుడయ్యె
నా కుమారుని యాకార మీక్షించి
వెలవెల బాఱె నా కలువ ఱేడు
అక్కుంభినీజాని చక్కందనముఁజూచి
విగ్రహంబుడిగెఁ బూవింటివాడు
ఆ వార్ధి గంభీరు లావణ్యమును గాంచి
నలకూబరుడు చాల నలుకబూనె

గీ॥ నహహ! యీరేడు లోకంబులందు గలుగు
సకల లావణ్య రసమెల్ల సంగ్రహించి
గరిమ నారాజు గావింపఁ గరువుగట్టి
చేసెఁగాబోలు నేర్పుతో సృష్టికర్త.

సంవరణుని సౌందర్యము జయంతుని సౌందర్యమును మించినదని, రూపలావణ్యములలో చంద్రుడు, మన్మథుడు, నలకూబరులు బలాదూరని తపతితో చెప్పినది.

తపతీ సంవరణుల రూపలావణ్య సంపదలను రాచిలుక వలన ఇరువురకు తెలియపర్చి పూర్వానురాగమేర్పర్చుటకు చిలుక చమత్కృతి, వాక్చాతుర్యము తోడ్పడినది.

తపతి రాజు రూపు తలచి సంతాపము పొందనారంభించెను. చిలుక హస్తినాపురమునకు బోయి కార్యము ఫలించెనని చెప్పి, తిరిగి సూర్య మండలమునకు వచ్చినది. తపతి విరహాతిశయమున బాధపడుచుండెను. చెలికత్తెలలో నొక నేర్పుకత్తె మిగిలిన వారికి పంపి ఏకాంతమున కారణము కనుగొనెను. తపతి చిలుక చెప్పిన వృత్తాంతమును తెలిపెను. ఇంత మాత్రమునకే వంత బొందనేల? ఆ రాజు నిటకు దెచ్చి నీ కనుసన్నల మెలగునట్లు జేసెదనని యూరడించెను. అంతలో సాయంకాలమై చీకటి వ్యాపించెను. కొంతసేపటికి చంద్రోదయమయ్యెను. చంద్రుని కిరణముల ధాటికి తాళలేక, మన్మథుని బాధలు పడలేక చంద్రుని, మన్మథుని ఉపాలంభించెను. చెలికత్తెలు తపతికి శిశిరోపచారములు చేయగా తెల్లవారెను. సూర్యుడు ఉదయించెను.

తపతికి కాలయాపన చేయుటకు చెలికత్తెలు, ఆమెతో కూడి భూలోకమునకు వచ్చిరి. వసంతఋతువు అరుదెంచెను. చెలికత్తెలు పుష్పాపచయము చేయుచుండిరి. తపతి మాత్రము చింతాక్రాంతయై యుండెను. చెలికత్తెలు జలక్రీడలొనరించి, అలంకరించుకొని చంద్రకాంత శిలాతలముపై మదనుని ఆవాహన చేసి ప్రార్థించిరి.

సంవరణుడు సూర్యోదయముననే లేచి ఉచిత పరివారములతో వేటకు బయలుదేరెను. కొంతసేపు వేటాడి వనమునంతనుఁ దిరుగుచుండెను. ఆమిష భక్షణార్థియై యొక వనమయూరమక్కడకు వచ్చెను. దానిని పట్టుకొనుటకు సంవరణుడొక సాళువమును బంపెను. నెమలి తప్పించుకొని పారిపోగా సాళువము దానిని వెంబడించెను. రాజు గుర్రముపై వానిననుసరించుచూ చాలా దూరము పోయెను. కొంతసేపటికి మయూరశ్యేనముల జాడ తెలియలేదు. గుర్రము అలసిపోవుటతో పాదచారియై తపతియు, చెలికత్తెలును వున్న వనమునకు చేరెను. ఆ దివ్యకాంతల సౌందర్యములను గాంచిన రాజు నవరత్నములలో వజ్రమువలె భాసించుచున్న తపతిని చూచెను. తన నిజరూపమును జూచినచో ఆ

దివ్యకాంతలదృశ్యులగుదురేమోయని తలచి ఒక చెట్టుచాటున ఒదిగి వారి సౌందర్యములను చూచుచుండెను.

రాచిలుక చెప్పిన సౌందర్య గుణములు కలిగిన సుందరాంగి తపతి యీమెయే యగునని తలచి తపతిని సమీపించెను. అతనిని చూచిన చెలికత్తెలందరు మాయమ్మైరి. తపతి అతనిని చూచి చిలుక చెప్పిన రాకుమారుడితడేనని తలచి యోగమాయచే ఒకచోట నొదిగి యుండి సంవరణుని గమనించుచుండెను. సంవరణుడు తపతిని గూర్చి విలపించుచు పలుచోట్ల వెదకుచు నేలబడి పొరలుచుండెను.

"ఏమిటికి విలపించెదు
భూమీస్థలి యందుఁబొరలి పొరలి? సరోజ
శ్రీముష్టింధయమగు నీ
మోమేటికి వాడె భువన మోహనరూపా!

అని సంవరణుని దీనావస్థకు జాలిపడి ప్రత్యక్షమై ప్రశ్నించెను. రాచిలుక చెప్పిన సుందరాంగవైన నీవు కన్పించీ కన్పించకపోయేసరికి నా మనస్సు వ్యథ చెందినదని సమాధానమిచ్చినాడు.

"నను గాంధర్వ వివాహం
బునఁజేకొని పద్మకోటిఁ బురికొల్పెడు నీ
కనుసన్నల సకలంబును
కనుగొని కావింప నేలుకొనుము శుభాంగీ!

గంధర్వ పద్ధతిన వివాహం చేసుకొందమని తపతిని కోరినాడు. తండ్రి యానతి మీఱనని, సంవరణుని యా గిరి గుహాంతముననే జపతపోపవాసాదులచే సూర్యునారాధించి ప్రసన్నుని గావింపుమని చెప్పినది. తపతి సూర్యలోకానికి వెళ్ళిపోయినది. తపతి తాపమునకు తాళలేక మూర్ఛిల్లిన రాజు

శీతలోపచారములచే సేదదీరి, సేనలను నగరమునకు బంపి తాను తపస్సు చేయనారంభించెను.

సంవరణుడు సూర్యోపాసన చేయు సందర్భములో గంగాధరుడు చెప్పిన పద్యము మనుచరిత్రలోని ప్రవరుడు హిమవన్నగమును జూచిన సందర్భమున అల్లసాని పెద్దన చెప్పిన పద్యమును తలపింపచేయుచున్నది.

"అటజని గాంచె నా జనవరాగ్రణి యంబర చుంబికూటమున్
....
....
గటుతర దుష్క్రియా దురవగాహకూటము, రత్నకూటమున్

తపస్సు చేయుచున్న సంవరణుని వద్దకు అరుంధతీ సమేతుడైన వసిష్ఠుడు వచ్చి, కఠోర తపమునకు కారణమడుగగా, రాజు సిగ్గుపడి యోగదృష్టితో జూచిన మీకే తెలియునని చెప్పెను.

"ముని నాథ యోగమార్గం
బునఁజూచిన మీ కగమ్యములు లేవటుగా
వున నా కోర్కెలు మీకుం
బునరుక్తులు గావె చెప్పుబూనుట యెల్లన్"

యోగదృష్టిచే కారణము తెలుసుకున్న వసిష్ఠుడు "ఇంతమాత్రమునకు నీ తపం బేటికి? గోటనైన పనికి గొడ్డలేల? నెమ్మది గుందనేమిటికి నెమ్మది నుండుము వత్స!" యని యభయమిచ్చెను. ఆ సూర్యసుత నవలీలగ దెచ్చి నీ కర్పించెదనని చెప్పి మహావేగమున సూర్యమండలమునకు వెళ్ళెను.

సతీసమేతుడై వచ్చిన వసిష్ఠుని జూచి సూర్యుడు భీతచిత్తుడై తమ్మిపూల సింహాసనమును దిగివచ్చి కుశల ప్రశ్నలడిగెను. ఆ ముని వచ్చిన కారణమును చెప్పి తపతిని సంవరణునకు ఇమ్మని కోరెను.

"నిగనిగని మించుమేని వన్నియల దానిఁదపతియను కన్యఁ దారుణ్య
ధన్యనపుడు తపసి చేతికినిచ్చెఁబద్మప్రియుడు"

తపతిని, తపతితో పాటు వస్తు సముదాయమును, గజతురంగ వాహనములను, పరివార జనమును అరుంధతీ వసిష్ఠులతో పంపెను. దీనిని బట్టి గంగాధరుని కాలమున కూడ ఆడపిల్ల తల్లిదండ్రులు వస్తు, వాహనాదులను కట్నముగా నిచ్చు ఆచారమెక్కువగా వ్యాప్తిలో నున్నట్లు తెలియుచున్నది. మూలమునలేని ఆరుంధతిని రప్పించి సతీసమేతుడైన వసిష్ఠుని సూర్యుని వద్దకు వెళ్ళి సంవరణునకు పిల్లనిమ్మని అడుగుటకు పంపిన తీరు గంగాధరుని కల్పనలకే తలమానికమైనది. సంప్రదాయబద్ధముగా నున్న ఈ కల్పన భారతీయ సంప్రదాయమునకు ప్రతిబింబము.

తన ప్రతాపముచే లోకాలను గడగడలాడించు మార్తాండుడు తపతిని అరుంధతీ వసిష్ఠులకు అప్పగించి "ఇక మీరే సుమా తల్లిదండ్రులని" చెప్పి కంటనీరు పెట్టుకొనుట సహజమైన కల్పన.

సూర్యసుతను తీసుకొని అరుంధతీ వసిష్ఠులిద్దరు భూలోకమునకు వచ్చి, శౌనకుడను శిష్యునిచే సంవరణునకు తెలియచేసినారు. హస్తినాపుర మంతయు అలంకరింపబడి పెండ్లి శోభను కలిగించుచుండెను. అమాత్యాదులు రాజునెదుర్కొని హస్తినకు తోడ్కొని వచ్చిరి.

వసిష్ఠుడు లగ్నము నిర్ణయించి రాజులందరికీ వివాహ్వానములను పంపించెను. చెలికత్తెలు వధువును మంగళ స్నానమాడించి అలంకరించిరి. ఉచిత

రీతిన నలంకరించుకొన్న రాజు వివాహమందిరమునకు వచ్చెను. వసిష్ఠుడు తపతిని సంవరణునకు ధారపోసి, వివాహము జరిపెను.

పెండ్లి పీటలపై వరుడు ఆసీనుడగుట, పడతులు పన్నీరు చిలుకుట, వరుని కాళ్ళు కడిగి కన్యాదానము చేయుట, గౌరీ కల్యాణమును నారీమణులు ఆరతులు పాడుట, తెరచీర చాటునున్న తపతి మోము, కందర్పుని సవ్యసాచిత్వము, వధూవరులు తలఁబ్రాలు పోసుకొనుట, మంగళ సూత్రము కట్టుట, కొంగులు ముడివేయుట మొదలగు పెండ్లి తంతునంతటిని చతుష్టదివసమున సాంగంబుగా వర్ణించిన కవి కాలములోని వివాహతంతు వర్ణింపబడినది.

పూర్వము పదహారు రోజులు పెండ్లి జరిగేదట. గంగాధరుని కాలమునాటికి నాలుగు రోజులుగా నాలుగోవంతుకు తగ్గింది. నేడు ఒకరోజుకు కుదింపబడింది.

వివాహానంతరము వసిష్ఠుడు సంవరణునకు పదహారువేల బంగారు రథములను, ఆరువేల మంది పరిచారికలను, కుండలకొద్ది గంధ సామ్రాణీ తేజీలు, లక్షలాది పెట్టెల నిండా చీనిచీనాంబరములు అరణముగా ఇచ్చెను.

తపతీ సంవరణులు వివాహానంతరము మలయాచలముపై చేరి విహరించుచు చాలా సంవత్సరములు రాజ్యమును వీడియుండిరి. రాజ్యములో అనావృష్టి సంభవించి క్షామమేర్పడెను. వసిష్ఠుడు శాంతివిధులు చేసి, సదుపదేశము చేసి రాజ్యమును పాలింపుమని హస్తినకు తీసుకు వచ్చెను. సంవరణుడు హస్తినను సుభిక్షముగా పాలించుచుండెను. తపతి గర్భము ధరించి శుభలగ్నమున పుత్రుని గాంచెను. ఆ పుత్రుడు దినదినప్రవర్ధమానముగా వర్ధిల్లి యౌవన ప్రాప్తుడయ్యెను. అతనికి యువరాజ్య పట్టాభిషిక్తుని చేసి, రాజ్యభారమప్పగించెను.

కవి భాగీరథీ ఇబ్రహీంల ప్రేమకథను అంతర్గతముచేసి వివిధ వర్ణనలతో, అమూలక కల్పనలతో నింపి చక్కని ప్రబంధమును రచించెను. ✦

4. తెలంగాణా సారస్వతములో మరింగంటి కవుల సాహితీ సేవ

- డా॥ మసన చెన్నప్ప

మరింగంటి కవుల సాహితీసేవ ఐదు శతాబ్దాల నుండి నిరాఘటంగా కొనసాగుతూనే ఉంది. రకరకాల పూలతో మాలఅల్లినట్లే రకరకాల రచనలతో వారల్లిన సాహితీమాల ఆంధ్రభారతికి అలంకారప్రాయమైందని చెప్పవచ్చు.

మరింగంటి కవుల జన్మస్థానం ఆంధ్రదేశమే. నల్గొండ వీరి నివాసభూమి. ఈ కవులకు రాష్ట్రమంతటా శిష్యులున్నారు. వైష్ణవ సంప్రదాయానికి అంకితమైన వంశం వీరిది. భక్తి కవులుగా పేరుగాంచిన వీరు తమ శిష్యులకు వేదాంతోపదేశం చేశారు.

"శ్రీభాష్య కృత్సాదసేవాధురీణుండు
  పరతత్త్వ సిద్ధాంత భావుకుండు
నిగమాంత సద్ధర్మ నిర్ణయశీలుండు
  సకల రహస్యార్థ సంగ్రహుండు
నఖిల భాగవతార్చనా సక్త చిత్తుండు
  బుధ జన స్తుత మంత్రబోధకుండు
వసుధ చాతుర్వర్ణ్య వరశిష్యనికరుండు
  నిరుపమ సద్ధర్మ నియతలౌక్యు

డహి నగాధీశు సచ్చరణాబ్జమధుర
పానమత్త ద్విరేఫోపమాన హృదయు
డనగ విలసిల్లె శ్రీ వేంకటార్యసుతుడు
సరసగుణశీలి వేంకటాచార్య మౌళి"

మరింగంటి వేంకటాచార్యుల విషయంలో చెప్పబడిన గుణగణాలు ఇంచుమించు మరింగంటి కవులందరికీ వర్తిస్తాయి. మరింగంటి కవుల రచనలలో ప్రబంధాలతో పాటు ద్విపద రచనలు, యక్షగానాలు, నాటకాలు, హరికథలు, తిరునామాలు, మంగళహారతులున్నాయి. వీరు సంస్కృతరచనలు కూడా చేశారు.

ఈ కవులలో మొదటివారైన జగన్నాథాచార్యులు 'శ్రీరంగనాథ విలాసం' అనే ప్రబంధాన్ని రచించారు. వీరి పూర్వీకులైన చెన్నయాచార్యులు, తిరువేంగళాచార్యులు, అప్పలాచార్యులు రచనలు ఏవీ చేసినట్లు కనిపించదు. కాని వీరంతా విశిష్టాద్వైత ప్రచారకులుగా సుప్రసిద్ధులు. తిరువేంగళాచార్యులకు ఎనిమిది మంది పుత్రులు. అప్పలాచార్యులు పెద్దవారు. తక్కినవారు వేంకటాచార్యులు, నరసింహాచార్యులు, కోనేటి రాయలు, జగన్నాథాచార్యులు, సింగరాచార్యులు, రంగాచార్యులు, నరహరాచార్యులు. అప్పలాచార్యులే పొన్నగంటి తెలగన్నచేత యయాతి చరిత్రను రచింపచేసి మల్కిభరాం (ఇబ్రాహీంషా)కు అంకితం చేయించాడు. జగన్నాథాచార్యుల సోదరులైన సింగరాచార్యులు దశరథరాజ నందన చరిత్ర, శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకళ్యాణము, తారక బ్రహ్మ రామ శతకం రచించాడు. సింగరాచార్యులు "ఏకదిన ప్రబంధ రచనా వచశ్రీ" గా పేరుగాంచినాడు. ఇతడాశు కవితలో దిట్ట. శబ్దశాసనధుర్యుడుగా, శతలేఖినీ పద్యఘటికాశతగ్రంథ కల్పనాధురీణుడుగా కీర్తింపబడిన ఇతని కాలం 1520-1590 మధ్య అయ్యివుంటుంది. తన నలభైయవ ఏట మల్కిభరాం ఆస్థానం ప్రవేశించాడు. ఇతడే మల్కిభరాంచేత అగ్రహారాలు, సన్మానాలు పొందినాడు.

విద్వత్కవులైన మరింగంటివారు తమ రచనలను శ్రీకారంతోడనే ఆరంభించినారు. సింగరాచార్యుల దశరథ రాజనందన చరిత్ర నిరోష్ఠ్యకృతి. అంటే పఫబభమలు లేకుండానే రచన చేయబడింది. ఇది ఐదు ఆశ్వాసాల ప్రబంధం. సాహిత్యంలో నిరోష్ఠ్య రచనలలో కెల్ల ఇది మొదటిది. పెదవులను ఒకదాన్ని ఒకటి తాకకుండా 929 పద్యాలను చదువుకోవచ్చు. ఉదాహరణకు రామశబ్దం లేకుండానే రామాయణం అన్నమాట. ఈ కావ్యంలోని యుద్ధ వర్ణనకు సంబంధించిన ఒక పద్యాన్ని గమనించండి.

"కటచర్ర ధరాధర నభస్తన కీక సకర్ణ నాసికా
నిటల కరాస్య దంత కచనేత్ర కటీర గలాస్యజంఘుకా
చ్ఛటల సిధారలన్ క్షితిజశాఖలచే దెగిజన్యధాత్రినం
తట కలయంగ్రదెళ్లిరట దైత్యహరీ శితలేక చర్యలన్" 4-98

యుద్ధభూమిలో శత్రువీరుల శరీరాలు ఏవిధంగా ముక్కలు ముక్కలుగా ఎగిరిపడ్డాయో వర్ణింపబడిన పద్యమిది.

ఇట్లే సీసపద్య రచన సరళ సుందరమై, భావగర్భితమై ఒప్పారుతుంది.

"సీతగాదిది దైత్య శేఖర! నీకేల
నల్లినయట్టి నీలాహిగాని,
సీతగాదిది దైత్య శేఖర! నీ నెత్తి
కట్టె జాఱిన యట్టి యశనిగాని"

మరింగంటి కవులలో చాలమంది వేంకట నరసింహాచార్యులనే పేరుతో ఉన్నారు. ఈ వంశానికి చెందిన మూడవ వేంకటనరసింహాచార్యులు "తాలంకనందినీ పరిణయం" అనే ప్రబంధాన్ని రచించాడు. ఇక ఐదవ వేంకట నరసింహాచార్యుల గూర్చి చెప్పనక్కరలేదు. ఆతని రచనలు విశిష్టమైనవి. అతడు చేపట్టి మెప్పించని ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. ఆతని సాహిత్య సేవ నిరుపమానమైనది. అతని "జనకసుతాభ్యుదయం" అనే ప్రబంధం ఐదు ఆశ్వాసాలతో సుమారు మూడు వేలపద్యగద్యములలో రచింపబడింది. "అఖిల రామాయణార్థములన్ని యేకకృతిని ఒనగూడునట్లుగా కృతి రచింతు"నని చేసిన ప్రతిజ్ఞ కృతిని పరిశీలించినప్పుడు నెరవేరినట్లు గ్రహించవచ్చు. దీనిలో వాల్మీకి రామాయణంలోని శ్లోకాలకు అనువాదాలున్నాయి. "తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ" అనేదానికి "మధుమాసంబున మేషశుద్ధ నవమీ మధ్యాహ్న కాలంబునన్" అని చేసిన అనువాదం హృద్యమైంది. చైత్రమాసాన్ని మధుమాసమని పూర్వికులు వ్యవహరించేవారు.

వేంకట నరసింహాచార్యులు రాముణ్ణి నావ నెక్కించడానికి ముందు అతనితో గుహుడు పల్కిన పల్కులను అధ్యాత్మ రామాయణం నుండి గ్రహించినాడు. "చనుటకు మీ పదాబ్జములు క్షాళన చేయకగాని నావపై నినుమొదలెక్కనీను" అని వర్ణించిన తీరు హృద్యమైంది. వీరికంటె ముందు మొల్ల తన రామాయణంలో ఈ ఘట్టాన్ని హృద్యంగా వర్ణించింది.

"సుడిగొని రామ పాదములు సోకిన ధూళి వహించి **రాయి యే**
వ్వడ నొక కాంతయయ్యెనట పన్నుగ నీతని పాదరేణువు
య్యెడవడి నోడసోకనిది యేమగునోయని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయమ్ము పెంపునన్" అయోధ్యా -32

వేంకట నరసింహాచార్యుల ప్రబంధాలలో ప్రసిద్ధి చెందినవి శ్రీరామానుజ అభ్యుదయం, నృకంఠీరవాభ్యుదయం, విష్వక్సేన ప్రభాకరం, గోదావధూటీ పరిణయం, శ్రీకృష్ణ శతానందీయం, జాంబవతీ కుమార శృంగార విలాసం మొదలైనవి ఉన్నాయి. ఇంకా పేరు ప్రద్యుమ్న విజయం అనే యక్షగానాన్ని రచించారు. కూర్మనారాయణ చరిత్ర, సుమాలినీ పరిణయం, సుచిత్రాభ్యుదయం, శశికళ, లలిత మొదలైన నాటకాలను రచించారు. సుందరీ విలాసం అనే ప్రహసనం, గోపాల చూడామణి శతకం, రాఘవ శతకం, శ్రీరంగాపుర సత్యనారాయిణ శతకం మొదలైన రచనలతో పాటు సత్యనారాయణ వ్రతం అనే హరికథ సుప్రసిద్ధమైనవి. వీరి లఘు రచనలలో తారావళులు, స్తవాలు, ఆచార్యస్తుతి వంటివి ఉన్నాయి.

వేంకట నరసింహాచార్యుల ప్రబంధాల్లో ఒకటైన 'గోదావధూటీ పరిణయం' లోని కథ కేవలం గోదాదేవికి సంబంధించింది. రాయలవారి ఆముక్త మాల్యదలోలాగ ఇందలి కథ కలగూరగంప కాదు. 'శ్రీ కృష్ణ శతానందీయం'లోని కథకు పోతన భాగవత కథ ఆధారం. మాయా బ్రహ్మ వేషంలో కృష్ణుడు సత్యలోకానికి చేరగా అక్కడ యధార్థ బ్రహ్మకు మాయా బ్రహ్మకు వాగ్వివాదం

జరిగింది. ఈ వాగ్వివాదం కళాపూర్ణోదయంలోని "ఒట్టు సుమీ యన్న ఒట్టు సుమా" అన్న రంభా మాయా రంభల సంభాషణను గుర్తుకు తెస్తుంది.

"నీవెవ్వడన్నచో నీవెవ్వడనుచు
నేరౌరమనగ నేరౌర యనుచు
బ్రహ్మనేరాయన బ్రహ్మనే రాయను
నిక్కకు రాయన నిక్కకనుచు
నోయి పోపోయన నోయి పోపోయను"

ఇలా సాగుతుంది బ్రహ్మకు, మాయా బ్రహ్మకు మధ్య సంభాషణ.

వేంకట నరసింహాచార్యులు నాటకాలలో వస్తుపరంగా "లలిత" విశిష్టమైంది. 1958-60 మధ్యకాలంనాటి సాంఘికేతివృత్తాన్ని కథా వస్తువుగా గ్రహించి కవి ఈ నాటకాన్ని రచించినాడు. నిజాం పాలనలోని చివరి రోజులు తెలంగాణా ప్రజలకు పీడకలలవంటివి. తెలంగాణాలో పోలీసు చర్య తర్వాత ముఖ్యంగా స్త్రీలలో వచ్చిన చైతన్యానికి ప్రతీక లలిత. ఇందులోని పాత్రలు - మోహనరావు, గోపాలు ఆంగ్ల మిశ్రితమైన తెలుగును, రామావధాని, రంగాచారి సంస్కృత మిశ్రితమైన తెలుగును, జమీందారు, అతని ఉద్యోగులు, పోలీసులు ఉర్దూ మిశ్రితమైన తెలుగును మాట్లాడడం నేటి తెలుగు భాషావాదకాన్ని సూచిస్తుంది.

మరింగంటి కవులెంతటి భక్తి భావ సంపన్నులైనప్పటికీ, సమాజాన్ని విడిచి రచనలు చేసినవారుకాదు. డా॥ దాశరథి సాహిత్యం వీరి రచనలపై ప్రభావం చూపి ఉండవచ్చు. వేంకట నరసింహాచార్యుల సామాజిక దృక్పథానికి ఈ క్రింది పద్యాన్ని ఉదాహరణంగా పేర్కొనవచ్చు.

"ప్రేగులు మాడిపోవ నిరుపేదలు కంటికి పుట్టెడేడ్చుచున్
భోగ విహీనులై నిరతమున్ శ్రమలందుచునుండ హాయిగా

రాగములందుచుండిరి ధరాతలమందు జమీనుదారులిం
కేగతి కర్షకోద్ధరణ మింతకు నీశ్వర సృష్టిమెట్టిదో?" లలిత - 1 అం. 50 పద్యం.

విద్వత్కవులైన మరింగంటి వారు తమ సమస్త రచనలను దైవాంకితం చేసినారు. కాని దానికి అపవాదుగా వేంకట నరసింహాచార్యుల (5వ) వారి "మానసప్రబోధశతకం" కన్పిస్తున్నది. వీరు దానిని భార్యావియోగంతో బాధపడుతూ **వ్రాశారు. తన అర్ధాంగికే** అంకితం చేశారు. మానవుడు తన చివరి దశలోనైనా **పరమాత్మను గూర్చి ఆలో**చించాలని, పరమాత్మను ఆశ్రయించాలని కవి ఇందులో **ఆకాంక్షించాడు.**

"**కమల మరంద**మానుచు సుఖంబుగ నుండెడి షట్పదంబుదు
ర్భ్రమగొని హేమపుష్ప రసవాంఛను దేలగ జేరి తత్పరా
గము కనులందురాల మృతి గాంచిన కైవడి నీచకాంక్షతో
సమసెదలేల? మూఢ మనసా! హరి పాదములాశ్రయించుమా?"

మచ్చుకు కొందరి రచనలలోని అందచందాలనే నేను ఈ వ్యాసంలో ప్రదర్శించినాను. ఈ కవులందరూ వైష్ణవ కవులే కనుక వారి రచనా వస్తువు విష్ణు సంబంధమైంది కావడంలో ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. వారందరూ పండిత **పామర రం**జకంగా రచనలు చేశారు. వైష్ణవ మతవ్యాప్తికి, విశిష్టాద్వైత ప్రచారానికి వీరు చేసిన సేవ అపూర్వమైంది. వీరికంటె పూర్వులు ఒక్క తాళ్లపాక వారు మాత్రం ఈ పనిచేసినట్లు సాహిత్య చరిత్ర నిరూపిస్తుంది. వీరి రచనలలో భక్తి శృంగారాలు సమిశ్రితమై ఆంధ్రుల హృదయాలను అలరించాయి. శృంగార రచనలతో ఐహికానందపు రుచులను చూపిస్తూ భక్తి రచనలతో ఆముష్మిక చింతనకు మార్గం వేసినారు. వీరు ఆశు కవితలు అల్లినారు. మధుర కవితలు చెప్పినారు. విస్తర కవితలను విస్తరింపచేసినారు. 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకళ్యాణం' వంటి చిత్ర కవితా సంబంధమైన రచనలు చేసినారు. వైవిధ్య భరితమైన రచనలతో ఒక వంశం వారు సుమారు 5 వందల ఏండ్లు వైష్ణవ సంప్రదాయమార్గంలో సాహితీ రథాన్ని నడిపించడం తలుచుకుంటేనే అబ్బురాన్ని కల్గిస్తుంది. ✦

5. రాకమచర్ల వేంకటదాసు

- డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి

"అదియేరాకమచర్ల గుట్టయన విఖ్యాతమ్ము నాక్షేత్ర, మ
య్యదియే మందిర, మందు శ్రీనృహరితానైతోచియున్నాడు, అ
ల్లదియే మామిడితోట, యాకెలనుదు గ్గాంభోనిధింబోలు నా
హ్రదమిం పొందును తజ్జలంబు విమలంబౌ స్నానపానాలకున్"

శ్రీ రాకమచర్ల వేంకటదాసు జీవితచరిత్రను పద్య కావ్యంగా అందించాలన్న తపనతో ప్రారంభించి 261 పద్యాలు వ్రాసి, ఆ తర్వాతి భాగం పూర్తి చేయకుండానే పరమపదించిన అనుష్ఠాన వేదాంతి రాకమచర్ల భజన సంఘాల విస్తారకులైన శ్రీ వెంకటరావు పంతులు గారి అముద్రిత కావ్యంలోని పద్యమిది.

ఈ రాకమచర్ల ఒక గ్రామం. రంగారెడ్డి జిల్లా పూడూరు మండలంలో ఉంది. గ్రామ సమీపంలోనే ఒక గుట్ట. ఆ గుట్టపై యోగానంద లక్ష్మీ నృసింహ స్వాములుంటారు. స్వామికి కుడి ప్రక్కన ఆంజనేయస్వామి విగ్రహముంటుంది. ఆలయ ప్రాంగణంలోని మధ్య కక్ష్యలో శ్రీ వేంకటదాసు విగ్రహముంటుంది.

వెంకటదాసు వర్ణన :

ఆ వెంకటదాసును ఆయన శిష్యులో భక్తులో ఈ విధంగా వర్ణించారు.

"కురచపాదాలు, నిడుద హస్తాలు, ఉచితమైన బొజ్జ, విశాలమైన హృదయం, ఉచితమైన కంఠం, గుండ్రని ముఖం, గొప్ప శిరం, ఉబ్బు చెంపలు, ఉన్నత ఫాలభాగం, దీర్ఘమైన నాసిక, అందమైన కనుబొమ్మలు, సోగకన్నులు, ఉచితమైన చెవులు, గంభీరమూ శ్రావ్యమూ అయిన స్వరం, ఛామనఛాయతో

సర్వావయస్ఫూర్తి కలిగి మిక్కిలి పొట్టిగాను, అంత పొడవుగాను కాక మరీ లావుగాక, అంత సన్నముగాక, సమమైన సుందరమైన దేహం కలిగి ఉండేవాడు". ఈ వర్ణన "శ్రీ రాకమచర్ల మాహాత్మ్యం వేంకటదాసుగారి జీవితము - వీరి భక్త బృంద చరితములు" అనే గుజిలీ ప్రతిలో ఉంది. ఈ వర్ణన కనుగుణంగా ఉన్న విగ్రహమే ఇప్పుడు రాకమచర్ల క్షేత్రంలో ఉంది.

కవికి విగ్రహమా!

లక్షా ఇరవైవేల కీర్తనలు శ్రీ వేంకటదాసు వ్రాశారని ప్రతీతి. అందులో ఇప్పుడు అచ్చయి మనకు లభిస్తున్నవి 500 మాత్రమే. మౌఖిక ప్రచారంలో ఉన్నవి కలుపుకొన్నా ఈ కీర్తనలు ఏడువందలు దాటవు. వారి పేర అంటే రాకమచర్ల భజన సంఘాల పేర రంగారెడ్డి, పాలమూరు, హైదరాబాదు, మెదక్, కొన్ని కర్ణాటక జిల్లాల్లో మొత్తం 350 భజన సంఘాలు వెలసినై. అవి కొన్ని చోట్ల అనునిత్యం, మరికొన్ని స్థలాల్లో వారానికోసారి భజన కార్యక్రమాలు కొనిసాగిస్తున్నయ్. వారి ఫొటోలు ముద్రించి, వారి చిత్రాలు గీయించి ముందు పెట్టుకొని కొందరు భజనలు చేస్తుండగా, భక్తులెందరో వారి చిత్రాలను పూజామందిరాలలో భద్రపరచుకొన్నారు. కవి రూపం బాహ్యంగానే కాదు, భక్తుల హృదయాలలో భద్రంగా నిలిచిపోయింది. బాహ్య ప్రదేశాల్లోనే కాదు ఎందరి గుండె గూటిలోనో విగ్రహంగా వెలసిన ఈ వేంకటదాసు కథాకమామిషు ఏమిటి?

వేంకటదాసు జీవితం :

లభ్య సామగ్రితో పరిశోధన దృష్టితో రచిస్తే ఈ జీవితం ఓ వంద పుటలైనా అవుతుంది. ఇక్కడ సమయం, మనకున్న పరిధిని దృష్టిలో ఉంచుకొని క్లుప్తంగా చెప్పుకొందాం.

1518 నుండి 1687 వరకు గోలకొండను కుతుబ్‌షాహీ రాజులు పాలించారు. ఆ తర్వాత 1724 నుండి 1948 సెప్టెంబర్ 17 వరకు హైదరాబాద్ రాష్ట్రాన్ని లేదా నిజాం రాష్ట్రాన్ని అసఫ్జాహీలు పరిపాలించారు. వీరి కాలంలోనే

1800 నుండి 1875 వరకు శ్రీవేంకటదాసున్నట్టుగా ఆధారాలు లభిస్తున్నాయి. అంటే దాదాపుగా రెండో నిజాం నుండి అయిదో నిజాంల కాలంగా చెప్పుకోవచ్చు.

ఒకనాడు బ్రహ్మాండంగా వెలిగిన రాచకొండ దేవరకొండ రాజ్యాలు ఈ నిజాంల దౌష్ట్యాల వల్ల కుప్పకూలిపోయాయి. రెడ్డి వెలమ పద్మనాయక రాజుల మధ్యన సామరస్యం నశించింది. కాకతీయ రాజ్య పతనానంతరం ముసునూరి నాయకులు చేపట్టిన మహోద్యమం కొన్ని సత్ఫలితాల నిచ్చినా, దేశచరిత్రలోనే మొదటి స్వాతంత్ర్య వీరులుగా వారు పేర్కోబడ్డా, ఆ ఉద్యమం ఊపునందుకోలేక పోయింది. అకారణంగానే ఓరుగల్లు, రాచకొండ, దేవరకొండ, భువనగిరి తలలు వంచేసినై.

అటువంటి దేవరకొండ రాజ్యంలో పెద్దాపురం అనే ఊరుంది. ఆ ఊరికరణీకం పురుషోత్తమరావు. ఆయన భార్య సాధ్వి అనంతమాంబ. ఆ అనంతమాంబ పురుషోత్తమరావుల మూడో సంతానం ఈ వేంకటదాసు.

పరిపాలకులు మారారు. కొత్తవాళ్ళకు పురుషోత్తమరావు మంచితనం తెలియదు. కొండెపు మాటలకు చెవులు వ్రేలాడవేసే నిజాం అధికారులు పురుషోత్తమరావు కరణీకాన్ని లాక్కొని మరొకరికిచ్చారు. ఆ తర్వాత పురుషోత్తమరావు రోగగ్రస్థులై మరణించారు. ఆస్తిపాస్తులన్నీ హరించుకుపోయాయి. పూలమ్మినచోట కట్టెలమ్మలేక అనంతమాంబ పిల్లలతో ఊరూరు తిరిగింది. చివరికి రాయప్రోలు చేరుకొన్నది. ఆ గ్రామాధికారికి పురుషోత్తమరావు తెలుసు. అతను వారికి ఆశ్రయమిచ్చాడు. నివాసానికి ఓ పాకనిచ్చాడు. అప్పటికే వెంకటదాసుకు తండ్రి వల్ల తల్లి వల్ల కొంత చదువబ్బింది. తాను నేర్చుకొన్నదే ఆ ఊరి పిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించాడు.

వ్యవసాయ దారుల పిల్లలు, వ్యాపారుల పిల్లలు వచ్చి చదువు నేర్చుకొంటున్నారు. వారిచ్చే నూకలతో కాలం గడిచిపోతున్నది.

ఈ సందర్భంలోనే వెంకటదాసు స్వయంగా భారత భాగవత రామాయణాది గ్రంథాలు చదవడం ప్రారంభించాడు. గీతా రహస్యాలు తెలుసుకొన్నాడు. ఆ తర్వాత ఒకరిద్దరి ప్రేరణ వల్ల యోగిని మరింగంటి లింగమాంబ సన్నిధికి వెళ్లి ద్వైతాద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతాలెన్నో ఆయా గ్రంథాల ఆధారంగా అధ్యయనం చేశారు.

ఆ తర్వాత వారి పాండిత్య ప్రాభవాలు పదిమందికి తెలిశాయి. వారు ఆశువుగా భజన కీర్తనలు చెప్పడం ప్రారంభించారు. పిల్లలకు పెద్దలకు చదువులతో పాటు భజన కీర్తనలు నేర్పించారు. రాత్రుళ్లు కోలాటాలు నేర్పించారు. ఊరూరా భజనలు ప్రారంభించారు. అది వరకు గుళ్లకు వెళ్లడానికి భయపడే జనాన్ని సమీకరించి, గుడిలో ఇంటిలో, నడివీధిలో భజనలు చేయించారు. దేవుని ఉత్సవాల పేరిట ఊరేగింపులు తీయించారు.

భక్తి చైతన్యం ప్రవాహమయింది :

అసఫ్జాహీల కాలంలో హైదరాబాద్ పరిసరాల్లోనే భక్తి చైతన్యం ప్రవహిస్తున్నది. ముచుకుందానంది సాక్షిగా అది పల్లెల్ని స్పృశిస్తున్నది. పల్లీయుల గుండెల్ని స్పృశిస్తున్నది. ఊరుపేరూలేని వేంకట దాసు వాగ్గేయ కారులై పోయారు. ఆయన భక్త తుకారాం, సమర్థ రామదాసు, భక్త రామదాసు వారసులైపోయారు.

ఈలోగా నీలంగిరి వీరయ్యప్ప దగ్గరికి వెళ్లి గురుశుశ్రూష చేసి గురూపదేశం పొందారు. ఆ వీరయ్యప్ప ద్వారానే ఆత్మానాత్మ వివేకం, ప్రకృతి పురుష సంయోగం, కార్యకారణ సంబంధం, కూటస్థ లక్షణం, బ్రహ్మాండాది కల్పనం, శరీరత్రయ అవస్థాత్రయ విశేషాలు, షడూర్మికలు, జ్ఞానభక్తియోగాల తారతమ్యాలు, సిద్ధులూ వాటి సాధన, జీవాత్మ పరమాత్మ నిరూపణం, సగుణ నిర్గుణోపాసన లక్షణం, మంత్రం - మంత్రాదిష్ఠాన దేవత - మంత్ర ప్రభావం, బ్రహ్మైక్యాను సంధానం ఇలా ఎన్నో విని రామతారక మంత్రోపదేశాన్ని స్వీకరించి మళ్లీ తన కార్యక్షేత్రంలోకి వచ్చారు వేంకటదాసు.

రాకమచర్ల - ఉమ్మెత్తాల

ఈ లోగానే వారిని ఉమ్మెత్తాల గ్రామ వాసులు తమ గ్రామానికి తీసుకొని వెళ్ళారు. రాకమచర్లకు ఈ గ్రామం నాలుగు కి.మీ. దూరంలో ఉంటుంది. ఉమ్మెత్తాలలో ఉంటూ రాకమచర్ల గుట్ట మీద వెలిసిన యోగలక్ష్మీ నరసింహస్వామి వారిని సేవించుకొంటూ తాను ఆశువుగా కీర్తనలు చెప్పుకొంటూ, పిల్లలకు పాఠాలు చెబుతూ, యువకులతో కోలాటాలాడిస్తూ, రాకమచర్లను భజన సంప్రదాయానికి కేంద్రకంగా తీర్చిదిద్దారు వేంకటదాసు. అందువల్లనే వారికి రాకమచర్ల వేంకటదాసు అనే పేరు వచ్చింది.

ముచుకుందుల అపరావతారం

వేంకటదాసును ముచుకుందుల అపరావతారంగా జనం చెప్పుకోవడం మొదలయింది. ఈ రాకమచర్ల గుట్టలో ఒక గుహ ఉంది. ఆ గుహలోనే ముచుకుందులున్నారనే ఓ కథ జనంలో ప్రచలితమయింది.

ముచుకుందుడు మహాతపస్వి. అయితే ఇతడు క్షత్రియుడు; అనేక యుద్ధాలు చేశాడు. విసిగి భగవద్ధ్యానంలో పరమ ప్రశాంత జీవితం గడుపుతున్నాడు. అతని తపస్సు కారణంగా ఒక గొప్ప తేజస్సు అతనిలో ప్రవేశించింది. ఆ తేజస్సు కళ్ల నుండి వెల్వడినట్లయితే మొదటిసారి ఎదురుగా ఉన్న వారు భస్మమై పోతారని కూడా తెలిసింది. తన వలన ఎవరికీ అపకారం జరగరాదని భావించిన ముచుకుందుడు ఈ గుట్టలో శయన ధ్యాన యోగంలో ఉండి జీవితం చాలించాలని నిశ్చయించుకొన్నాడు.

అందుకే ఆ గుట్ట అంతర్భాగంలో ఉన్న గుహలో ఉన్నాడు. అది ద్వాపర యుగం. కాలయవనుడు ఎన్నో కిరాతకాలు చేస్తున్నాడు. వాడు ఏ ఆయుధాలకు లొంగడం లేదు. కృష్ణ కాలయవనులిద్దరూ భీకరంగా పోరాడారు. కృష్ణుడు యుక్తిపన్ని వెనుకకు తగ్గుతూ వస్తున్నాడు. కాలయవనుడు ముందుకు దూకి

గోల్కొండ తెలుగు కవి పండితులు - సాహిత్యము

వస్తున్నాడు. శ్రీకృష్ణుడు ఆ విధంగా రాకమచర్ల వరకు అతణ్ణి తీసుకొని వచ్చాడు. వెనుకకు పరుగెత్తినట్లు నటించి గుహలోకి వెళ్లిపోయాడు. కాలయవనుడూ తరుముతూ గుహలోనికి వచ్చాడు. అక్కడ కృష్ణుడు లేడు, ముసుగుతన్ని పడుకొన్న ఒక ఆకారమున్నది. కాషాయవస్త్రం కప్పుకొని నిద్రపోతున్నట్లు కృష్ణుడే నటిస్తున్నాడని కాలయవనుడనుకొన్నాడు. భీకరంగా అరుస్తూ మీదికి దూకి ముసుగు లాగేశాడు. అంతవరకు తన జ్వలిత తపోచక్షురగ్ని ఎవరికీ అపకారం కలిగించరాదని ఆశించిన ముచికుందుడు, ఈ హఠాత్పరిణామానికి తట్టుకోలేక కళ్లు తెరిచాడు; అంతే కాలయవనుడు భస్మమై పోయాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు ముచికుందుని ముందుకు వచ్చి నిలిచాడు. దుష్ట శిక్షణలో శిష్టరక్షణలో ఇదొక ఎత్తా స్వామీ అంటూ శ్రీకృష్ణుని ముందు మోకరిల్లాడు ముచికుందుడు. శ్రీకృష్ణుడు నవ్వుతూ ముచికుందుణ్ణి అభినందించాడు. స్వామీ! నాకు ముక్తిని ప్రసాదించు అని కోరుకొన్నాడు ముచికుందుడు. నీవింకా తపస్సుచెయ్! ఈ జన్మలో నీకు ముక్తి లభించదు. వచ్చే జన్మలో బ్రాహ్మణుల ఇంట జన్మిస్తావు. మహాభక్తుడవై లోకాన్ని తరింపచేసే ఎన్నో కార్యాలు నిర్వహిస్తావు. అప్పుడే నీకు విముక్తి లభిస్తుందని శ్రీకృష్ణుడన్నాడు.

ముచికుందానది - మూసీనది

ఆ ముచికుందుడున్న గుహే అది. ఆ గుహ నుండి జాల్వారుతున్న నీరే అక్కడ ఒక చెఱువుగా మారింది. అది చెఱువంటే చెఱువు కాదు. చెఱువంతటి పెద్దబావి. ఆ బావి ఎప్పుడూ కోల్ వెడుతుంది అంటే పొంగిపారుతుంది. అది కాల్వయై, నదియై, రెండుపాయలై, ఓ పెద్ద సాగరమై, మళ్లీ రెండు పాయలు కలిసినదియై ముచికుందానదిగా పేరు పొందింది. ఇప్పటికి మూసీగా పిలువబడుతున్న ముచికుందానది జన్మస్థానం రాకమచర్ల గుట్టే.

ఒకనాడు భాగ్యనగర పరిసరాల్ని సశ్యశ్యామలం చేసి నేడు మురికి కూపంగా - కాల్వగా మారిపోయిన మూసీనది వెనుక ఇంత పురాణగాథ ఉంది.

ఇటువంటి రాకమచర్ల క్షేత్ర కథాకథనముంది. ఆ ముచికుందుడే రాకమచర్ల వేంకటదాసు.

భక్తి ద్వారా ఏకత

ఇంకేం! అవతార పురుషుడనే భావన జనంలో కలిగింది. ఆయన నోట పలికిన ప్రతిమాట ముత్యాల మూట అయ్యింది; రతనాల పేట అయ్యింది. ఎన్ని పాటలు ఎన్ని పాటలు! లభించినవి కొన్నే!

1. గురుమహారాజ గురు మహారాజ
పరబ్రహ్మ సద్గురు మహారాజ ॥ప॥
పరతత్త్వాశ్రిత సరసిజ సంభవ
హరిహర రూపక గురుమహారాజ ॥గురు॥

2. రామనెనరుంచవే పావన నామ!
రామ నెనరుంచవే ॥పా॥
రామజగదభిరామ రామలలామ
రాజలలామ సద్గుణధామ
తారకనామ భాస్కర వంశసాగర సోమ
దనుజవిరామ సీతా ॥రామ॥

3. రామ నారాయణ రామ నారాయణ
రామశ్రీ వైకుంఠ ధామ నారాయణ ॥రామ॥
వామన శ్రీధర వసుదేవ నందన
కామితార్థప్రదా స్వామి నారాయణ

- ఇది మొత్తం కొన్ని వందల పాదాల కీర్తన. అన్ని పాదాలు లభించలేదు. లభించిన 52 పాదాలలో చివరి రెండు పాదాలీ క్రింది విధంగా ఉన్నాయి.

గోల్కొండ తెలుగు కవి పండితులు - సాహిత్యము

- కొరగాని నరుడనక్కరజూడ నీకింత
బరువాయెనా దయాపరుడ నారాయణ ॥రా॥
కేశవాచ్యుత మహోల్లాస రాకమచర్ల
వాస వెంకటదాస వరద నారాయణ ॥రా॥

4. దండములివిగో రామ భవ
ఖండన తారక నామ ॥దం॥
చండకిరణ సమకుండలధర వే
దండ రక్షకాఖండవిజయభవ ॥దం॥

5. చెలియాజీవుని లోని దేవుడేడే అక్కరో... 6. కంటిరే మీలోన కమలాక్షుడున్నాడు కాంతలారా ... 7. అయ్యేటిపని యేమోకానీ రామ సయ్యాన నీదయారానీ... 8. ఇంత బలవంతమా ! ఏమి నాతో పంతమా... 9. చూడబోదమురావె చిత్తమా హరిని వేడుక దర్శించి వత్తమా.. 10. నమామి వెంకట రమణా సురనారద వందిత చరణా ... 11. దశరథ రామ రాజేంద్రా.. నన్ను దయజూడు సద్గుణ సాంద్రా..., 12. ఏల మాటాడవే - ఓ రామయ్య ఎంత కఠినూడవే... 13. భవ సాగరము జుట్టుకొనెరా - నా ప్రాణేశ చెయిబట్టుకొనరా.. 14. తారకనామం దలుతాం దలుతాం - తాపత్రయంబుల గెలుతాం గెలుతాం ... 15. అన్నన్న యిదియేమి చిత్రమూ - నన్ను దరించ వెంత మాత్రమూ... 16. ఉన్నదేమో ఉన్నదీ - సద్గురు నాజ్ఞ ఉన్నదేమో ఉన్నదీ... 17. పదము గందు గదరా హరినీ పదము గందు గదరా... 18. తాతను జూపవుగా ఓ బ్రహ్మ దేవ తాతను జూపవుగా...

ఇలా భక్తి కర్మ జ్ఞానాలు ప్రవాహశీలమై ప్రజల్ని ముంచెత్తినై. వెంకటదాసును వారికళ్లముందు అవతారమూర్తిగా నిలిపినై.

అధ్యయనం అవసరం

1800 ప్రాంతంలో నిజాం రాష్ట్రానికి తెలుగు వారికి ఈ గోలకొండ ప్రాంతానికి వెంకటదాసు పెట్టిన భిక్ష ఇది. ఆ కాలం, చారిత్రక పరిస్థితులు, భక్తి ద్వారా చైతన్యం, పాలకుల దౌర్జన్యాలు, ప్రజల స్థితిగతులు, లోతుకుదిగి అధ్యయనం చేసి వేంకటదాసు భక్తి కీర్తనలను అన్వయించుకోవలసి ఉంది.

అంతేకాక వారి కీర్తనల పరమార్థాలు, భక్తి జ్ఞాన కర్మయోగాల, వివిధ సాంప్రదాయిక విషయాలు, సామాజికాంశాలు, కీర్తనలతో జోడించిన మహిమలు, వారి మనోవైద్య చికిత్స విధానం, వారు ఆడించిన ఆటల తీరుతెన్నులు, వారి సమాధిని దర్శించే భక్తుల మనోభావాలు, వారి జీవన చరమదశ, వారి నిర్యాణం శా.శ 1751 సిద్ధార్థ నామ సం॥ర మార్గశిర శు॥ 13 అని కచ్చితంగా తెలుస్తున్నా విశ్వసించని వైనం, వారిపై ఇతర వాగ్గేయ కారుల ప్రభావం, వారి సమకాలికులైన కవి పండిత వాగ్గేయ కారులు, తదనంతర పద సంకీర్తనల కర్తలపై వారి ప్రభావం, వారి కీర్తనల్లో భాషా విశేషాలు...ఇలా ఈ అంశాలన్నీ పరిశీలించవలసి ఉంది. ఇదివరకే పరిశోధించిన వారి ఆలోచనలు వివిధ సంప్రదాయాలతో సమీక్షించవలసి ఉంది. అటువంటి నిష్పాక్షిక సత్య సందర్శనానికి మరో అవకాశం తీసుకొందాం. వెంకటదాసు రామదాసు మరో రూపమా అన్నంత వరకు వెళ్లి ఆలోచిద్దాం.

✦

6. సారంగు తమ్మయ్య

- డా॥ కె. కుసుమాబాయి

మంచిగంధం వృక్షాన్ని మహానాగర చుట్టుకున్నా దాని సుగంధం చెడక అది దైవపూజకు అర్హమై భగవంతునికి ప్రీతిపాత్రమౌతుంది. అదే విధంగా విషయ వాంఛలు భక్తుని నిష్ఠను ఎంత భంగపరిచినా అతని భక్తి భగవంతుని ప్రేమకు పాత్రమౌతుంది. ఈ విషయాన్ని ఋజువుచేసే ఇతివృత్తాన్ని గ్రహించి సమకాలీన సామాజిక పరిస్థితులకు అద్దంపట్టే విధంగా 'వైజయంతీ విలాసమనే' కావ్యాన్ని సారంగు తమ్మయ రచించాడు. ఈయన గోల్కొండ నవాబు 'మహమ్మదుషాహీ' (1581-1611) దగ్గర కరణీకం చేశాడు. తమ్మయ తన ఇంటి పేరును గూర్చి చెబుతూ... భరద్వాజ గోత్రంలో సారంగధరుడు ఉద్భవించాడని ఈ సారంగధరుని వంశంలో జన్మించిన వారంతా సారంగువారైనారని, ఈ క్రింది పద్యం ద్వారా తెలిపాడు.

"సారంగధరుడు వెలయగ
సారంగుని వారటంచు సచివాగ్రణులై
పేరుం బెంపును గాంచిరు
దారతనయ్యాభవులనగ దద్వంశభవుల్ !

సారంగు తమ్మయ 'ప్రసన్నామృతం'లోని కథను ఆధారంగా గ్రహించి కొన్ని మార్పులు చేర్పులతో 'వైజయంతీ విలాస' కావ్యం రచించాడు. ఇది విప్రనారాయణుని కథ. తెలుగులో తాళ్ళపాక చిన్నన్న రచించిన 'పరమయోగీ విలాసం' అనే ద్విపదలోను, అళియరామరాయలు మేనల్లుడైన సిద్ధరాజు తిమ్మరాజు రచించిన 'పరమయోగి విలాస'మనే పద్యకావ్యంలోను విప్రనారాయణుని చరిత్ర కీర్తింపబడినది.

ప్రహ్లాద, నారద, పరాశర, పుండరీకాది పరమభక్తులు పౌరాణిక వైష్ణవ భాగవతోత్తములుగా ప్రసిద్ధులు. శ్రీరామానుజాచార్యులుకు పూర్వమే వైష్ణవ మతాన్ని, వైష్ణవ సంప్రదాయాల్ని ప్రచారం చేసిన పరమభక్తులు పన్నిద్దరాళ్వారులు ఉన్నారు. ఈ ఆళ్వారులను దివ్యసూరులనీ, నిత్య సూరులనీ, ద్వాదశ సూరులనీ వ్యవహరిస్తారు. అందులో తొండరడిప్పొడియాళ్వారు పరమభాగవతోత్తమునిగా ప్రసిద్ధుడు. అతని చరిత్ర సంస్కృతం, తమిళం, తెలుగు బాషలో విప్రనారాయణుని కథగా ప్రఖ్యాతి చెందినది. గరుడ వాహన పండితుడు 'దివ్య సూరి చరితమని, పెరుమాళ్ జియ్యరు గురుపరంపరా ప్రభావమని మనవాళముని, ఉపదేశరత్నమాల అనీ, అనంతాచార్యులు ప్రసన్నామృతమనీ' సంస్కృతంలో రచించిన కావ్యాల్లో విప్రనారాయణుని చరిత్ర ఉన్నది.

తెలుగులో విప్రనారాయణుని చరిత్రను ప్రత్యేకంగా రచించిన వారిలో ప్రథముడు చదలువాడ మల్లన. తంజావూరు విజయరాఘవ నాయకుడు విప్రనారాయణ చరిత్రను యక్షగానంగా రచించాడు. అధునాతనంగా విప్రనారాయణ చరిత్రను పిడుగు వేంకటకవి తృతీయాశ్వాస భరితంగాను, పానుగంటి లక్ష్మీనరసింహం గారు, ఎం. రామదాసు గారు, ఆర్. నారాయణ దాసుగారు నాటకంగాను రచించారు. రెండుసార్లు చలన చిత్రంగాను రూపుదాల్చిన ఈ విప్రనారాయణుని కథ ఆంధ్రదేశంలో పండిత పామర సమాదరణకు పాత్రమైందని చెప్పవచ్చు.

విప్రనారాయణుడు వైజయంతి అంశతో జన్మించాడు. కనుక సారంగు తమ్మయ తన కావ్యానికి వైజయంతీ విలాసమని సముచితంగా నామకరణం చేశాడు. ఇది నాలుగు ఆశ్వాసాలు కలిగిన కావ్యం. రసవత్తరమైన విప్రనారాయణుని కథకు సరసమైన సారంగు తమ్మయ శైలి. బంగారానికి పరిమళమబ్బినట్లుగా కనిపిస్తుంది. ఈ కావ్యంలో ప్రతి పద్యంలోనూ ఒక ప్రత్యేకత, ప్రతి అంశంలోనూ ఒక విశిష్టత కనిపిస్తుంది.

తమ్మయ తన ఇష్టదైవమైన శ్రీరాముని కళ్యాణాన్ని ప్రస్తుతిస్తూ కృతిని ప్రారంభించాడు. వైజయంతీ విలాస కథ విష్ణుభక్తునికి సంబంధించింది. కనుక తమ్మయ వైష్ణవ సంప్రదాయానుసారంగా విష్ణు సంబంధమైన సుదర్శనాన్ని, ఆదిశేషుని, గరుత్మంతుని, విష్వక్సేనుని స్తుతించినాడు.

తెలుగు కావ్యాల్లో స్వప్న వృత్తాంతాన్ని రచించటం తిక్కనగారే మొదట ప్రారంభించారు. అదే రీతిలో తమ్మయ కవికి కూడా శ్రీరామచంద్రుడు స్వప్నంలో సాక్షాత్కరించి వైజయంతీ విలాస కావ్యాన్ని తనకంకితమిమ్మని కోరినాడు. ఈ సందర్భంలో రామచంద్రుని రమణీయ రూపాన్ని కవి సీస పద్యంలో చిత్రించాడు. ఈ పద్యం అనుప్రాస శోభితమై 'నల్లనివాడు పద్మనయనంబులవాడు' అనే పోతనగారి పద్యానికి అనుకరణ ప్రాయమై మనోహరంగా కనిపిస్తుంది.

సీ॥ "రవికోటి రుచి పెంపు రవణింపు మణి కిరీ
టంబువాఁడురులలాటంబు వాఁడు,
ప్రతిలేక తన జోక భాసిల్లు సిరిపేరి
జోటివాడు, సుపర్ణ శాటి వాడు
కరుణారసము మించు కమలాళి వర్షించు
చూపువాఁడెనలేని రూపువాడు,
పలువన్నియల మించు తులకించుడామూపు
వింటివాఁ, డభ్రంబు వంటివాఁడు"

'నగు మొగంబున నెలవంక నలికమయిన
తిరుమణి ధరించువాఁ డొక్క దివ్య పురుషుఁ
డెదుట నిలుచుండి, నా పేర నీవు సేయు
కావ్యమంకిత మొనరింపు భవ్య సరణి" - 1-32

ప్రాచీన కాలంలో వేశ్యావృత్తి బలీయంగా ఉండేది. ఎంత నైష్ఠికులనైనా వేశ్యలు దిగజార్చిన సంఘటనలున్నాయి. రాతిగుడి వలె గట్టిదనం పవిత్రత

కలిగిన సజ్జనుల చిత్తాల్లో రాగివృక్షం అనే రాగాన్ని ఉదయింపచేయగల నీచజాతి పక్షులైన కాకులవంటి వారు వేశ్యలు. వేశ్యా సంపర్కం ఎంత ప్రమాదమో తిమ్మయ ఇలా వివరిస్తూ సమాజానికి మంచి సందేశాన్నందించాడు.

"కాకులు రావిపండ్లు దిని క్రక్క శిలామయ దేవ మందిరా
నీకములందు రావులు జనించును సజ్జన చిత్తవృత్తియ
వ్యాకుల లీలజాతిగుడి వంటిది లోకములోన వేశ్యలున్
గాకుల వంటి వారలటుగాన బ్రమాదము చేర నిచ్చినన్" 2-98

వేశ్యామాత లెంత ధనాశాపరులో, తరతరాల వరకు పురుషులనెట్లు వారు నిర్ధనులుగా చేయగలరో తమ్మయ మిక్కిలి చమత్కారంగా చెప్పాడు.

"ధనమూలము జగమంతయు,
ధనవంతుని గాని వేశ్యతల్లి దరిద్రున్
దనకూతుజేరనీయదు,
ధనమేడది దాని కొనగ దరతరమైనన్" 3-120

ఈ పద్యాన్ని తమ్మయ వేశ్యతల్లి ధనవంతునిగాని తన కూతురుని చేరనీయదు అనీ, దరిద్రుని తన కూతురు జేరనీయదు అని రెండు విధాలుగా అన్వయించుకోవడానికి వీలుగా రచించాడు. వేశ్యతల్లి తన కూతురుకు తమ వృత్తి ధర్మాన్ని ఎంత నైపుణ్యంగా చెప్తుందో కవి ఇలా చక్కగా తెలిపాడు.

"తమ్మువల పంటకుండగ
గ్రమ్మి, విటుల గలయు నేర్పుగఅపమనలకున్
గొమ్మరొ! తామరపాకును,
గుమ్మరి పురువులును బరమగురువులు సుమ్మీ" 3-89

నీటిలో ఉన్న తామరాకుకు నీరు అంటనట్లే, బురదలో తిరిగినా కుమ్మరి పురుగుకు బురద అంటనట్లే విటుల వలపు తమకు అంటకుండా జాగ్రత్త వహించాలని వేశ్యతల్లి కుమార్తెకు వృత్తి, ప్రవృత్తిని అనుభవపూర్వకంగా చెప్పినట్లనిపిస్తుంది. వేశ్యతల్లి స్వభావాన్ని తమ్మయ వర్ణించిన తీరు ప్రశంసనీయంగా ఉన్నది.

మరోచోట వయసు ఉడిగిన ముసలి వేశ్యల స్వరూప వర్ణన జుగుప్స కలిగే విధంగా ఇలా చేశాడు తమ్మయ.

వేశ్యమాతయునై, వయోవృద్ధయైన
గూఢి సురాపానమొనరించె, నిట్టివేళ
గోతికలుద్రావి యుండ, దేల్గుట్ట, భూత
మావహించుట గాదె స్వభావ మరయ -3-105

ఇంకొకచోట ఈ వృద్ధ వేశ్యల గురించే ఇలా అన్నాడు తమ్మయ.

"శునకములు దేజి తమదిక్కుచూడ రోయు
వయసుతో నుందురు వేశ్యవాటి యందు
సూనశరభుక్త నిర్ముక్త శుష్క పత్ర
భాజనమ్ములు వృద్ధ వేశ్యాజనములు" 3-70

మన్మథుడు భుజించి విడిచిన ఎండుటాకుల వంటి వేశ్యల వైపు శునకాల వంటి వేశ్యలవైపు శునకాలవంటి విటులు కూడా చూడటానికి అసహ్యపడతారనే వాస్తవాన్ని చెప్పాడు తమ్మయ. దీని ద్వారా పురుషులకు వేశ్యల పట్ల రోతను జనింపచేయాలని కవి ఉద్దేశ్యంగా తోస్తుంది.

వారకాంత వలపెంత కపట భూయిష్ఠమో తమ్మయ సందర్భానుసారంగా వివరించాడు. హేయభాజనమైన వేశ్యజన్మ జన్మమేనా? అని, ఆసేతు హిమాచల

మధ్య ఏభై కోట్ల యోజనాలు కలిగిన భూమిలో పరికించి చూచిన నీతి నియమం కలిగిన వేశ్య ఉండదని చెప్పాడు. అంతేకాక

"ఒక్కని బిల్వపంపి, మఱియొక్కని చేత బిసిండిబట్టి వే
ఱొక్కని యింటికేగుచు, మఱొక్కని నా నడుచక్కినొక్కచో
బొక్కిలిదార్చి కూడు, భ్రమ బూదివిటుల్ తెలియంగ లేరుగా
కెక్కడి సత్య? మేడవల? పెక్కడినేనుము? వారకాంతకున్. 2.77

ఇలా తమ్మయ వేశ్యా గర్హణం చేసిన తీరును పరిశీలించినపుడు కవికి గల నిశిత పరిశీలనా శక్తి, లౌకిక పరిజ్ఞానం, సామాజిక స్పృహ స్పష్టమవుతుంది. వేశ్యల పట్ల జనులకు అసహ్యం కలిగించడమే కవి లక్ష్యంగా తెలుస్తుంది.

ఇక కావ్య సౌందర్యాన్ని పరిశీలించినపుడు వైజయంతీ విలాసం వర్ణనాబాహుళ్యంతో, అలంకార శోభతో మనోజ్ఞమైన ప్రబంధంగా కనిపిస్తుంది. పోతనగారికి వలె తమ్మయ కవికి కూడా శబ్దాలంకార ప్రీతిమెండు అని తెలుస్తుంది.

"రమణీయ తేజో విరాజులు రాజులు
పటు పరాక్రమ సముద్భటులు భటులు
నిజ బలాధరిత దిగ్గజములు గజములు
చరణవేగ జితార్క్య హరులు హరులు
వివిధ క్రమ ప్రీతి విబుధులు బుధులు
కవితాభినవ మరుత్కవులు కవులు
రతిరాజ కంఠహార మణులు రమణులు
వరధర్మ వర్తకుల్ వర్తకులును" 1-8

ఈ విధంగా శ్రీరంగ క్షేత్రాన్ని ఛేకానుప్రాసలో కవి వర్ణించాడు.. ఈ క్రింది యమకం వారకాంత అంతరంగాన్ని ఆవిష్కరిస్తుంది.

గోల్కొండ తెలుగు కవి పండితులు - సాహిత్యము

లోపల బరికించిననీ
లోపల సదృశములు వారయోషాతతికిన్ 2-82

ఇలా వృత్యానుప్రాస, లాటానుప్రాసాది శబ్దాలంకార ప్రయోగంతో తమ్మయకవి వైజయంతీ విలాస కావ్యానికి బాహ్య సౌందర్యాన్ని సమకూర్చటమే గాక **అర్థాలంకారాల**తో అంతః సౌందర్యాన్ని కూడా చేకూర్చాడు. ఉదాహరణకు **ఈ శ్లేషానుప్రాణిత** ఉపమాలంకార రచనలోని చమత్కారాన్ని పరికించవచ్చు.

"**ఆ తతి** ప్రహ్లాద సమ
న్వీతంబై కువలయంబు విలసిల్లె నవ
ద్యోత పటాపటలుండై
శీతాంశుడు పొడిచె నారసింహుడు పోలెన్" 2-42

ఉగ్రమూర్తియైన **నారసింహు**నితో చంద్రుని పోల్చటమే విలక్షణం. ప్రహ్లాద, కువలయ శబ్దాలకు శ్లేషను కూర్చి అప్పుడే పొడిచిన చంద్రుని చూచి కలువ మిక్కిలి ఆహ్లాదంతో విలసిల్లినదనీ, నారసింహుని ఉద్భవంతో ప్రహ్లాదునితో కూడిన భూమి విలసిల్లినదనీ ఉపమాలంకార సమన్వితంగా శ్లేషను కూర్చిన తమ్మయ **ప్రతిభ** ప్రశంసనీయం.

తమ్మయ శైలి ప్రధానంగా కథా కథనరీతిలో సాగినప్పటికీ అవసరమైన చోట్ల చక్కని నాటకీయ శిల్పం కనిపిస్తుంది.

"నిర్జితేంద్రియుండు నిష్ఠాపరుండని
యొప్పెసారెసారెజెప్పెదీవు
వీని బలిమి చెఱిచి విటుచేసి తెచ్చిన
గలదె పందె మనినఁగాంత పలికె" 2-26

"నీవె కాదిప్పురిలో
నే వేశ్యాపుత్రియైన నీతని విటునిన్
గావింప జాలెనేనియు
నా వేశ్యకు నీళ్ళుగట్టి యటనే మోతున్"

"అప్పరో! నీకునే గట్టియును నీళ్ళు
నెంత మోచిన గాని నాకెగ్గలేదు
నిన్ను బనిగొనగా నాకు నీతిగాదు
వేఱెపన్నిద మొకటిగావింపు మనిన" 2-27

దేవదేవి మధురవాణితో పందెం వేసే సన్నివేశమిది. పద్యరూపంలో సాగిన సంభాషణమిది. విభిన్న భావాలున్న ఇద్దరు యువతులు హృదయాల్లోని పట్టుదల, పంతం, రోషం మొదలైన భావాలు తన సరళమైన శైలిలో స్పష్టీకరించాడు తమ్మయ. ఈ సందర్భంలో నాటకీయ శైలిని ఔచితీమంతంగా ఉపయోగించుకున్నాడు కవి.

మరోచోట మాయా విటుడు బంగారు గిన్నెను తీసుకొని వెళ్ళి వేశ్యమాత వద్దకు వచ్చినపుడు ఆమె
"ఎందుండి వచ్చి తెవ్వరాయనవుపే
రెద్ది? యిటకు రాబనేమి" అని అడుగుతుంది. జవాబుగా విటుడు
"ఓ యలివేణి! యిప్పురినెయుండుదు, నన్యుడగాను, విప్రనా
రాయణుకూర్మి శిష్యుడను, రంగడటందురు పేరు, మీకునే,
డాయన పంపినాడొక యర్ఘ్యసువస్తువు, కొమ్ము యందుకొ
మ్మా, ...యని"4-4

అతడు పలికినాడు. ఇటువంటి సన్నివేశంలో నాటకీయ శైలిని తమ్మయ ఆశ్రయించడం వలన పాత్రలు రంగస్థలం మీది పాత్రల వలె కళ్ళముందు సాక్షాత్కరించాయి. సజీవతను పొందాయి.

తిక్కనగారి నాటకీయ శిల్పాన్ని పుణికి పుచ్చుకున్న సారంగు తమ్మయ, నన్నయగారి నానారుచిరార్థసూక్తి నిధిత్వాన్ని కూడా సంతరించుకున్నాడు. తన కావ్యంలో సందర్భానుసారంగా ఎన్నోసూక్తులు కూర్చినాడు.

'శతభిషగ్వరుండు, సకలౌషదీనాథు
డమృతధాము,డింది రానుజన్ము
డట్టి రాజు రాజు యక్ష్మచే, గృశియించు
గర్మ నమనుభవమున గాక తగునే?'3-129

పై పద్యంలో చంద్రునికి వేసిన విశేషణాల్లో ప్రత్యేకత ఉన్నది. చంద్రుడు తానే వైద్యుడు. ఔషధాలకు నాథుడు, అమృతానికి నిలయుడు. లక్ష్మికి సోదరుడు, అయినా క్షయవ్యాధితో కృశిస్తున్నాడు. కర్మఫలం అనుభవించక తప్పదని ఎంతటివారైనా దాన్ని తప్పించుకోలేరని చెప్పటానికి ఎన్నుకున్న ఉపమానం సముచితంగా కనిపిస్తుంది.

లౌకిక నీతులు చెప్పటంలో వేమనకు సాటియైన కవిలేడు. ఆ వేమన పద్యానికి దీటైన రీతిలో తమ్మయ కొన్ని పద్యాలు రచించాడు. అందుకు ఉదాహరణ ఈ క్రింది పద్యం.

"నల్లిగల శయ్యనిద్రయు
జిల్లిగల ఘటంబు నందు జేర్చిన నీరున్
దల్లిగల వేశ్య దగిలిన
పల్లవు సుఖములును బోధి పల్లవ సఖముల్ " 3-123

'చెప్పులోని రాయి చెవిలోన జోరీగ' - అని వేమన ఇంటిలోని పోరును చెప్పగ, తమ్మయ ఇంటి బయటి పోరును చెప్పాడు.

అచ్చ తెనుగు కావ్యం వెలసిన కాలానికి చెందిన తమ్మయ అచ్చతెనుగు పద్యాలను అక్కడక్కడా అందంగా చెప్పాడు.

"మీ యక్క పిలువుమనెనో
మీ యమ్మయు బిలువుమనెనో మృషలాడితివా
మీయక్కతోడునీకున్
మీయమ్మకు దప్పుదువు సుమీ కావేరీ" 4-41

అని విప్రనారాయణుడు దేవదేవి తనను పిలువనంపుట నిజమని నమ్మలేక మాటాడినపుడు కావేరి అనే వేశ్య చెప్పిన జవాబు కూడ అచ్చ తెనుగు పదాలతో నిండియున్నది.

"మాయక్క పిలువుమనియెను
మా యమ్మయు పిలువమనెను, మాయాయతోడే,
మా యంబికమ్మయానే
వేయిక బదనయ్యు! యేల వేదన బొరలన్" 4-45

కావేరి మాటల్లో అచ్చతెలుగు పదాలను గుప్పించిన తమ్మయ కావేరి నదీ వర్ణనలో సంస్కృత పదాలను గుభాళింపచేసి సంస్కృతాంధ్ర భాషా ప్రావీణ్యాన్ని ప్రదర్శించుకున్నాడు.

"వియదుదుభ్వవ్యమిత ప్రభూతమహిమన్ విఖ్యాతమైతత్పురో
భయ పార్శ్వంబుల నప్రయత్నపరిఖా భావంబునంబొల్చున
క్షయపుణ్యాకర వారి వారి నిధికిన్ గాలీపు దేవేరివా
గ్దయలద్రీంద్ర కుమారి కుంభ భవసాక్షాన్మారికావేరినిన్" 1-11

శ్రీరంగక్షేత్రానికి అప్రయత్న పరిఖవలె నెలకొన్న, కావేరి నది వారినిధికి గారాపుదేవేరిగా వర్ణింపబడింది. పైన కావేరి సామాన్య కాంత. కావేరి నది దివ్యకాంత

కనుక తమ్మయ వారకాంత కావేరి సంభాషణను సామాన్యభాషలో సరళంగా ఉండాలని అచ్చతెనుగులోను, కావేరి నదీ వర్ణనను సంస్కృత పద భూయిష్టంగాను సందర్భోచితంగా, పాత్రోచితంగాను రచించాడు.

"అఖిలేశ లోకేశ అమిత ప్రకాశ
నిఖిలలోకారాధ నీకు నివ్వాళి
శ్రీ మహేశ్వర లింగ చిన్మయమూర్తి
మంగళ పదమిచ్చు నీకు నివ్వాళి"

- అను నివాళి పదాలను,

"అనుపమశైవ నిష్ఠానూన నియతి
జనుగౌతమాదుల సజ్జలయందు
దనరంగ బాశుపతవ్రతద్యుక్తి
జనునగ స్త్యాదుల సజ్జల యందు"

అని సజ్జ పదాలను పేర్కొన్నాడు. తమ్మయ కూడా ఈ పద రచన విధానంలో కొన్ని పద్యాలు రచించాడు.

నిర్యాణ రాజధానికి నేగు వానికి
జక్కని త్రోవ యాచార్య సేవ
విరజానదీ సముత్తరణంబునకు మనో
జవమైన నావ యాచార్యసేవ
త్రిగజ్జనులకు సతీపతిన్యాయమై
చాగిన ప్రావ యాచార్య సేవ
యజ్ఞాన హతులను విజ్ఞానులను జేయు
సంజీవ తేవ యాచార్యసేవ 3-12

వైజయంతీ విలాసం చారిత్రక ప్రాధాన్యం కూడా కలిగిన కావ్యం. ఇందులో దొంగతనం బ్రాహ్మణుడు చేస్తే అతనికి వేసే శిక్షను ఈ పద్యం తెలుపుతుంది.

ధనము గొనుట మొండె తలగొఱుగుట మొండె
నాలయంబు వెడల నడచుటొండె
గాని చంపదగిన కార్యంబు జేసిన
జంపదగదు విప్రజాతి బతికి - 4-111

అని 'విజ్ఞానేశ్వరీయ'మనే ధర్మశాస్త్రంలో చెప్పినట్లుగా విప్రనారాయణునికి వేయవలసిన శిక్షను గూర్చి ధర్మజ్ఞులు వివరిస్తారు. దీనిని బట్టి 'కేతన' రచించిన 'విజ్ఞానేశ్వరీయం' ధర్మ నిర్ణయానికి ప్రామాణిక గ్రంథంగా భావించడం కుతుబ్‌షాహీ యుగం వరకు ఉన్నట్లు తెలుస్తున్నది. ఆంగ్లేయుల పాలనలో కూడా హిందూ 'చట్టం' ఏర్పాటుకు ఆధారగ్రంథంగా ఈ విజ్ఞానేశ్వరీయాన్నే ఉపయోగించుకున్నారు.

తమ్మయ చక్కని సామెతలతో, జాతీయాలతో తన కావ్యాన్ని అపూర్వంగా రచించాడు. 'తవ్వితలకెత్తు', 'చేదోడు వాదోడు', కన్యారంగని వేంచేయు పెందలకడ', నోరెటులాడె', 'మ్రానిలో జేవ', 'క్రక్కిన కూడు' వంటి నుడి కారాలు.

'గంతకు దగిన బొంతలు లేవె', 'పాలు విరిగితే పెరుగగునే' 'చల్లకు వచ్చి ముంత దాచనేల','నొసలు బత్తుడును నోరు తోడేలటన్న', 'పువ్వులమ్ము నంగడినె కట్టెలమ్మ జేసెను', 'గొడ్రాలుబిడ్డ కుట్టే మెఱుగును', 'వ్రతము చెడ్డ సుఖము దక్కదటన్న' వంటి సామెతలు కావ్య సౌందర్యాన్ని ఇనుమడింప చేసాయి.

ఈ విధంగా తెలుగులో విప్రనారాయణ చరిత్ర ఆధారంగా వెలసిన కావ్యాలన్నిటిలోను, 'వైజయంతీ విలాసం' విశిష్టమైన కావ్యంగా ఖ్యాతి గాంచి, సారంగు తమ్మయ కీర్తిని సాహిత్య చరిత్రలో సుస్థిరం చేసింది.

✦

7. జానపద ప్రక్రియలు - యక్షగానము

- డా॥ పొద్దుటూరి ఎల్లారెడ్డి

గ్రామీణ ప్రజలకు మన ప్రాచీన సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పడానికి జానపద కళారూపాలు ఎంతగానో కృషి చేశాయి. అనాది కాలం నుండి తెలుగు నేలను ప్రభావితం చేసిన కళారూపాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఆ కళారూపాలు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందించాయి. సనాతన ధర్మరక్షా కర్తవ్యాన్ని ప్రబోధించాయి. నైతిక విలువల పునరుద్ధరణకు దారులు వేశాయి. ప్రజలు ధర్మమార్గంలో నడవడానికి ఎంతగానో కృషి చేశాయి.

రామాయణ, భారత, భాగవత గ్రంథాల పురాణ గాథలు పూర్వ చరిత్రల ఘనతను చాటిచెప్పాయి. మన ప్రాచీన వారసత్వాన్ని చెక్కుచెదరకుండా కాపాడినాయి. మన వేద, పురాణ సాహిత్యంలోని నీతిని, మానవీయ విలువలను సరళమైన భాషలో ప్రదర్శనా రూపంలో అందించి ప్రజల్లో భావ చైతన్యాన్ని తెచ్చాయి ఈ జానపద నాటకాలు.

అట్లాంటి జానపద కళారూపాల్లో ప్రముఖంగా పేర్కొనదగినవి బుర్రకథ, హరికథ, జముకుల కథ, గొల్ల సుద్దులు, బహురూపులు, బాలసంతులు, తోలుబొమ్మలు, చిందు భాగవతము, గొల్ల భాగవతము, యక్షగానము, చిరుతల రామాయణము, పురాణ ప్రవచనము మొదలైనవి.

ఆ రోజుల్లో నేటి వలె టీ.వీ.లు, సినిమాలు ఉండేవి కావు. కేవలం రచ్చబండ వద్ద ప్రతిరోజు ఏదో ఒక జానపద కళారూపం ప్రజలకు వినోదాన్ని అందించేది. చిత్త సంస్కారానికి దోహదం చేసేది. అనంతమైన మన వైదిక ధర్మ శాస్త్రాల సారాన్ని సరళసుందరమైన భాషలో హృదయానికి హత్తుకునే విధంగా అందించేవి మన ప్రాచీన జానపద కళారూపాలు.

జానపద కళారూపాలు ఎన్నెన్నో ఉన్నా అందులో యక్షగానం నాటకంగా ప్రదర్శించే కళారూపం. దీన్నే కొందరు భాగవతం, బాగోతం, వీధి భాగవతం అని అనేక పేర్లతో ఉచ్చరించేవారు. ఆట, పాట మరియు ఆహార్యాదులు, వాద్యములు హంగు ఆర్భాటాలతో ప్రజల్ని విశేషంగా ఆకర్షించిన జానపద నాటకం మన యక్షగానం.

ఆంధ్ర సాహిత్యంలో మొట్టమొదట యక్షుల ఆటపాటల ప్రసక్తి పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో పర్వత ప్రకరణమున పేర్కొనబడినది. శివరాత్రి జాగరణ సందర్భంలో అక్కడ చేరిన యాత్రికుల వినోదం కోసం, కాలక్షేపం కోసం ఆడిన ఆటపాటలివి.

"ఆదట గంధర్వ యక్షవిద్యాధ
రాదులై పాడెడు నాడెడువారు
విధమున ప్రచ్ఛన్న వేషముల్ దాల్చి
యధికోత్సవము దతులు కాడినట్లాడు"

యక్షులు గాన కళా కాలక్షేపాదులు చేస్తూ మరియు విచిత్ర వేషధారులుగా కనిపించారు. అంతేకాక శివుడే యక్షులను పిలిచి జక్కుల ముద్రలు వేసి సంగీత సాధనాలతో ఆటపాటల్ని ప్రచారం చేసే విధంగా నియోగించారని తెలియవస్తుంది. యక్షుల రాజు కుబేరుడని, కుబేరుడు శివుని సఖుడని కథలున్నాయి. ఆ కారణంగా యక్షులకు శైవానికి సంబంధం కన్పిస్తుంది. అప్పుడే కన్నడ దేశంలోని డెక్కల గాజాలు శ్రీ శైలాది శివ క్షేత్రాలకు వచ్చేవారిని, తెలుగు దేశంలో స్థిరపడిన కారణంగా వారే జక్కుల వారైనారనీ ఊహించారు. పంచాగ్నుల ఆది నారాయణ శాస్త్రి యక్షులే జక్కులుగా పరిగణింపబడినారనుట సమంజసమన్నారు. వారింకా జక్కుల పురంధ్రి, అక్కలు, జక్కిణులు, యక్షకన్యలు, యక్షకామినులు, యక్షనాట్యము, తదితర శబ్దాల పూర్వాపరాలను వివరించారు.

యక్ష శబ్దం ప్రాకృతంలో 'ఎక్కలగా' తెలుగు, కన్నడాల్లో జక్కులుగా ప్రయోగింపబడింది. యక్షుడనగా పరమాత్మ. యక్షులనగా ఆ పరమాత్మను గూర్చి ఆడిపాడే వారని అర్థము. వారే తెనుగులో జక్కులుగా పిలువబడ్డారు. క్రీడాభిరామంలో "జక్కుల పురంధ్రీ కామవల్లీమహాలక్ష్మి కైటభారి వలపు పాడుచువచ్చినది" అనగా జక్కుల పురంధ్రీ జక్కుల జాతికి లేదా వర్గానికి చెందిన మహిళయని తెలుస్తున్నది. తెలుగులో కూడా కొరవజాతి, కొండజాతి, జక్కుల జాతి తదితర శబ్దాలున్నాయి. అందువల్ల జక్కుల జాతి, యక్షజాతి అనే శబ్దాలకు ఆట-పాట లాడే కళాకారుల వృత్తి లేదా కులము అనే అర్థంలో ప్రయోగం జరిగిందని భావించాలి. యస్వీజోగారావు తమ సిద్ధాంత గ్రంథంలో యక్షులే జక్కుల జాతిగా పరిగణింపబడ్డారన్నారు.

"జక్కరత్తి" అనే పదం హేమచంద్రుని దేశీనామములోనే కనిపిస్తుంది. అది దీపావళి రాత్రిగా అక్షరాత్రిగా, యక్షరాత్రిగా వ్యవహృతమైనదని డా॥ యస్వీ జోగారావు గారి గ్రంథం వల్ల తెలుస్తుంది. పరమాత్మను గూర్చిగానం చేసేవారే యక్షజాతిగా పరిగణింపబడ్డారు. ఆ గానం చేయడానికి ఎన్నుకొన్న రాత్రే యక్షరాత్రి అయ్యింది. ఆ రోజు ఆడే ఆటకు యక్షరాత్రి అనే మరో పేరు కూడా వచ్చింది. దీనిని యశోధరుని జయమంగళవ్యాఖ్యలో ద్యూత క్రీడగా కూడా పేర్కొనడం జరిగింది.

సంస్కృత నాటక ప్రక్రియ తెలుగులో ఆవిర్భవించడానికి ముందే తెలుగునాట బహుళ ప్రచారంలో కొన్ని నాటకాలున్నట్లు తెలుస్తుంది. ఆంధ్ర మహాభారతంలో రాజరాజనరేంద్రుడు, నన్నయతో "ఉదాత్త రసాన్విత కావ్య నాటక క్రమములు పెక్కు చూచితి" అన్నాడు. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో "ప్రథమ పురాతన పటు చరిత్రముల క్రమమందు బహు నాటకములాడువారు" అన్నారు. వారే మరోచోట "అటుగాక సాంగ భూషాంగ క్రియాంగ పటు నాటకాల నటియించువారు" అని కూడా రచించినారు. క్రీడాభిరామ రచయిత కూడా "లెస్సగాగ క్రీడాభిరామ చరితమాడుదురు

నాటకంబుగ అవనిలోన" అని చెప్పాడు. తెలుగు సాహిత్యంలో యెడనెడ కన్పిస్తున్న ఈ ప్రయోగాల వల్ల తెలుగు నాట నిరంతరం నాటకాలాడుతున్నట్లే కనిపిస్తున్నది. అయితే ఆ నాటకాల స్వరూప మేమిటో స్పష్టంగా తెలియదు. వారు ప్రయోగించిన సాహిత్యమేమిటో కూడా సాహిత్య చరిత్రకారుల కందలేదు. అందువల్ల ఇవి మౌఖిక ప్రచారంలో ఉన్న తెలుగువారి దేశీ ప్రక్రియలుగా భావించడానికి అవకాశమున్నది. ఆదేశీ రూప ప్రక్రియ యేదో నిర్ధారించలేము. అయితే సంగీత, తాళ, లయలకు అనుగుణమైన ప్రక్రియగా దానిని ఆయా గ్రంథాలు ప్రస్తావించిన కారణంగా అది యక్షగానమేనని భావించడం వల్ల ఆ ప్రక్రియ తెలుగు వారి మార్గ సాహిత్యంతో పాటే ఎదిగిందనడానికి మార్గమేర్పడుతుంది. క్రీడాభిరామంలో జక్కుల పురంధ్రీ ఆటపాటల విశేషాల్ని వర్ణించడం కారణంగా నన్నయ కాలం నుండి కొనసాగిన నాటకాలన్నీ ఈ యక్షగాన ప్రక్రియకు సన్నిహితమైనవేనని ఊహించడానికి అవకాశమున్నది.

"కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగాన సరణి" సంస్కృత భీమేశ్వర పురాణంలో లేని ఈ మాటలు తెలుగులో కల్పించినందు వల్ల ఆనాటికే యక్షగానాదులు బహుళ ప్రచారంలో వున్నాయని తెలుస్తుంది. యక్షగానానికున్న బహుళ వ్యాప్తిత్వాన్ని పరిశీలించినపుడు శ్రీనాథుని కాలం నుండి ఆంధ్ర దేశమంతటా యక్షగానాలధికంగా ప్రదర్శితమవుతున్నాయని తెలుస్తుంది. కేవలం ఆంధ్ర దేశంలోనే కాక విజయనగర పతనానంతరం తంజావూరు రాజులచే పోషింపబడి అక్కడ కూడా యక్షగాన ప్రక్రియ కళా సౌందర్యాల్ని వ్యాపింపచేసింది.

తంజావూరు యక్షగాన పద్ధతుల్ని త్రోసిరాజని తెలంగాణాలో యక్షగానం ప్రత్యేకంగా రూపుదిద్దుకొన్నది. భాషలో, భావంలో, కొత్తపుంతలు తొక్కి యక్షగానం సామాన్యుని దరి చేరింది. రామాయణ, భారత, భాగవత కథలకు కాకి కథల్ని, పిట్టకథల్ని జతచేర్చి ఏది మూలమో ఏది కల్పితమో తెలియనంతగా పురాణ గాథల్ని యక్షగాన ప్రక్రియ ప్రచారం చేసింది. ఈ ప్రచారానికి కొంత చారిత్రక, రాజకీయ నేపథ్యం కూడా దోహదం చేసింది. కొంతమంది పాలకులు ఈ భాషా,

సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక రంగాల్ని తొక్కి వేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో యక్షగానం మరీ తలయెత్తుకొని విజృంభించింది.

1326లో కాకతీయ రాజ్యం పతనమయ్యింది. ఓరుగల్లు సర్వనాశన మయ్యింది. తెలంగాణాలో సుస్థిర శాంతి సౌభాగ్యాలకు నిలయమై అపూర్వ కళాసౌందర్య ప్రభావాల కాకరమై సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసిన కాకతీయుల రాజ్యం కూలిపోయింది. ఈ రాజ్య పతనానికి ప్రథమంగా విదేశీ మహమ్మదీయులే కారణమని చరిత్ర చెబుతున్నది.

కాకతీయుల కాలంలో యక్షగానాది నాటక ప్రక్రియలు జనపదాల్లో ఉన్నాయని ఊహించడానికి అవకాశముంది. పాల్కురికి సోమనాథుడు, పెద్దన, నంది తిమ్మన, చరిగొండ ధర్మన్న తదితర కవులందరు తమతమ గ్రంథాల్లో యక్షగాన ప్రస్తావన తెచ్చినందువల్ల ఈ ఊహకు బలమేర్పడుతున్నది.

శ్రీ సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రలో భాగవత కథలను ఆడువారే భాగవతులన్నారు. యక్షగానాది వీధి నాటకాలను వివరిస్తూ జక్కులు, అక్కులు, యక్షులు తదితర అంశాలపై వీధి నాటకాలపై వారి అభిప్రాయములీ విధంగా ఉన్నాయి.

భాగవత కథలు వైష్ణవ గురువుల చేతను, రాజుల చేతను ప్రోత్సహింపబడి ఆటలాడి జనులలో వైష్ణవమును వ్యాపింపచేసి శైవము నణగద్రొక్కుటకు దీనిని కూడా సాధనముగా గ్రహించారంటారు. భాగవత కథలను ఆటలుగా ఆడువారిని భాగవతులన్నారు. వారే భాగవతులైరి. 'భాగోతుల బుచ్చిగాడు' ప్రసిద్ధముగా అచ్చము స్త్రీవలెనే వేషము వేసి ఆకర్షణీయముగా నాడు చుండెననియు, పాడుచుండెననియు పెండెలనాగి అను స్త్రీయు అట్టిదేననియు, స్త్రీలు నాగి, గంగి (తక్కువ జాతి స్త్రీలు) వంటి వారు కూడా స్త్రీ పాత్రలు అభినయిస్తూ వుండిరని తెల్పుటకు కొన్ని గ్రంథాలు సహాయపడినవి. క్రీడాభిరామమునకు వీధి నాటకమని పేరు. అందిట్లు తెలిపినారు.

"నటులది దోర సముద్రము
విటులది యోర్గల్లు కవిది వినుకొండ మహా
పుట భేదన మిత్రితయము
నిటు గూర్చెను బ్రహ్మరసికులెల్లరు మెచ్చన్"

క్రీడాభిరామం తర్వాత చెప్పుకోదగ్గది సారంగధర యక్షగానం. ఈ యక్షగానం ప్రతి డా॥ బిరుదురాజు రామరాజుగారు సేకరించియున్నారు. సర్వజ్ఞ బిరుదాంకితుడైన పద్మనాయక భూపాలుడు గ్రంథకర్త. బిరుదు, కులం, పదవులు తప్ప పేరు తెలియడం లేదు. అందువల్ల రాచకొండ నేలిన రేచర్ల పద్మ నాయకులలో రెండవ, మూడవ సింగ భూపాలులకు ఉన్న సర్వజ్ఞ బిరుదమును బట్టి ఆ యిరువురిలో ఎవరో ఒకరు కావచ్చును. లేదా మరెవరైనను కావచ్చునని శ్రీరామరాజుగారంటున్నారు.

కాకతీయుల పతనానంతరం తెలంగాణ బహమనీ సుల్తానుల యేలుబడిలోకి వెళ్ళింది. ఈ సుల్తానులు 1518 వరకు పాలించారు. ఆ తర్వాత కుతుబ్‌షాహి వంశస్తులు 1687 వరకు తెలంగాణా ప్రాంతాన్ని ఏలినారు. ఈ కాలంలోనే భాగ్యనగరం గోలకొండ, ఏర్పడి హైదరాబాదు రూపుదిద్దుకొన్నది. నిజాం నవాబుల పాలన వరకు అంటే 18వ శతాబ్దం ప్రారంభం వరకు తెలుగు భాషకు సరియైన స్థానం లేదని చరిత్రకారులు వ్రాశారు.

అద్దంకి గంగాధరకవి, పొన్నగంటి తెలగన్న, సారంగు తమ్మయ్య, మరింగంటి సీతారామాచార్యులు, నేబతికృష్ణమాచార్యులు, తెనాలి రామలింగము, కంచెర్ల గోపన్న మొదలైన కవులు భక్తులు, సంస్కర్తలు ఈ కాలంలో జన్మించారు. ప్రసిద్ధులెవ్వరు యక్షగానాల ప్రస్తావన చెయ్యకున్నా యక్షగానాల బాణీల్లో కంచెర్ల గోపన్న అనేక కీర్తనలు రచించారు. ఆ తర్వాత యక్షగాన సాహిత్యంలో వచ్చిన దరువులూ, బాణీలకు గోపన్న కీర్తనలు ప్రాణం పోశాయి.

నిజాం నవాబుల కాలంలో తెలుగువారి భాష, సాహిత్య, సాంస్కృతిక వికాసం జరిగిందని కొంత మంది చరిత్రకారులు రాస్తున్న రాతల్లో అంతా సత్యమే వుందని చెప్పలేం. ఆనాటి నవాబుల అణచివేతకు కంచెర్ల గోపన్న జీవితమే ప్రబల తార్కాణమని చెప్పవచ్చును.

1650 ప్రాంతంలో పాలమూరు జిల్లా లేమామిడి నివాసి అయిన కాకునూరి అప్పకవి రాసిన అంబికా వాదమనే యక్షగానమావిర్భవించింది. అప్పకవీయ అవతారికలో అంబికా వాద నాయక యక్షగాన కృతియు చేసితినని చెప్పికొన్నాడు. లభించిన ఆధారాలను బట్టి కందుకూరు రుద్రకవి సుగ్రీవ విజయమే ప్రథమాంధ్ర యక్షగానమని నిర్ధారింపబడినది. వేటూరి ప్రభాకర శాస్త్రి రుద్రకవి 1568 ప్రాంతం వాడని అభిప్రాయపడ్డారు. 15వ శతాబ్దం ఉత్తరార్థం వాడైన ప్రోలుగంటి చెన్నశౌరి సౌభరి చరిత్రం మొదటిదని జోగారావు గారి అభిప్రాయం.

నిజాం పాలనలో యక్షగానాలు :

కుతుబ్‌షాహీల పతనానంతరం 1724లో నిజాం నవాబుల పరిపాలన ప్రారంభమైంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా 1948 సెప్టెంబర్ 17వ తేదీన పోలీసు చర్య జరిగేవరకు ఇప్పుడున్న తెలంగాణా యించుమించు నవాబుల చేతుల్లోనే వుంది. అక్కన్న మాదన్నల హత్య జరిగిన తర్వాత ముస్లిం పాలకుల దమన నీతి మరీ పెరిగిపోవడం వల్ల ఈ ప్రభుత్వ పదవీ కాలంలో అంటే దాదాపు రెండున్నర శతాబ్దాల కాలంలోదీనికీ ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద ప్రభుత్వంగానే ముద్రపడింది. అధికార బలంతో, జులుంతో జరిగిన పరిపాలనలో ఉర్దూభాష ఆధిపత్యం తెలుగు మీద అడుగడుగునా కన్పిస్తుంది.

అటు కృష్ణాపత్రిక జాతీయోద్యమ మహాశక్తిగా రంగంలోకి ప్రవేశించగా, ఇటు కొంత కాలం ఆలస్యంగానైనా గోలకొండ పత్రిక రంగంలోకి వచ్చింది. తెలంగాణలో భాషా, సాహిత్య, సాంస్కృతిక వికాసానికి ఈ పత్రిక అద్దం పట్టింది.

ఈ మధ్య కాలంలోనే యక్షగానం ఒక అపూర్వ సాంస్కృతిక ప్రసార సాధనంగా తన వంతు బాధ్యతను నిర్వర్తించింది.

యక్షగాన ఆవిర్భావ వికాసాలు ఆషామాషీ వ్యవహారం కాదు. ఒక ప్రయోజనాన్ని, ఒక దృఢ సంకల్పాన్ని మనసులో వుంచుకొని చేసిన ప్రచారమని తెలుస్తుంది. తాను పుట్టిన నేల, తన జీవితానికాధారమైన వృత్తి, తన వికాసానికి దోహదం చేసిన సంస్కృతీ తదితరాలన్నింటిలో ఉన్న విశిష్టాంశాలను ప్రచారం చేసి వాటిని రక్షించుకోవడం, పాలకులైన విదేశీయ, విధర్మీయ, విజాతీయ నియంతలు ఈ భూమిని, ఈ వృత్తులను, ఈ సంస్కృతినీ, ఈ తత్త్వచింతనను ప్రత్యక్షంగా, పరోక్షంగా అణచివేయడానికి చేస్తున్న ప్రయత్నాలను యక్షగానం చాటిచెప్పింది.

గోలకొండ నవాబులు మతసామరస్యము పాటించినారనీ, హిందూ ముస్లిం మతాలకు సమప్రాధాన్యమిచ్చినారనీ, హిందూ సంస్కృతీ వికాసానికి దోహదం చేశారనీ చరిత్ర కారులు రాసిన రాతలందు వున్నది పాక్షిక సత్యమే. ఆనాడు రాజ భాష ఉర్దూ, ప్రజలు సహజంగానే ఉర్దూలో మాట్లాడేవారు. అధికారుల దర్పానికి తెలుగు ఎక్కడో కుక్కిన పేనల్లే నక్కి యుండేది.

బహిరంగంగా హిందూ ధర్మ ప్రచారం చేసుకునే అవకాశం లేదు. ప్రభువులు నిరంకుశ నియంతలు. కాబట్టి మన ధర్మ ప్రచారం కేవలం జానపద కళారూపాల మాధ్యమంగానే జరిగిందని చెప్పవచ్చును. ఆనాడు యక్షగానాలు నిర్వహించిన పాత్ర అద్వితీయమైనది.

ఆ రోజుల్లో పల్లెటూళ్ళలో భాగవత ప్రదర్శనలు జరిగే సందర్భంలో ఆ గ్రామ పటేలు, పట్వారి మొదలైనవారి అనుమతి తీసుకోవాలి. అంతేకాకుండా సుబేదారు, జమీందారు, మొదలైనవాళ్ళ అనుమతులు పొందాల్సిన అవసరం ఉండేది.

యక్షగాన ఆట ప్రారంభంలోనే ప్రభుత్వం తరపున వచ్చిన వ్యక్తి "అరేమియా యిదర్ క్యాహోరహాహై" అంటూ ప్రశ్నించేవారు. వీళ్ళు 'యహ యక్షగానం చల్‌రహాహై' అనేవారు. 'కోన్సా యక్షగానం చల్ రహేహై' అంటే "బాలనాగమ్మ యక్షగానం చల్ రహేహై" అని చెప్పేవారు.

పేరుకు యక్షగానమైనా మన రచయితలు, నటులు, సూత్రధారులు సమర్థమైనవారు కాబట్టి అక్కడ జేరిన జనులకు మన ధర్మ నిర్వహణ, మనసంస్కృతీ పరిరక్షణ ఏదో ఒక సందర్భంలో యేదో ఒకరకంగా తెలియచేసేవారు. సందర్భాన్ని బట్టి రచయిత, గురువు, సూత్రధారులు తమతమ శక్తి మేరకు ప్రేక్షకుల మనస్సులో నాటుకునే విధంగా కర్తవ్య బోధ చేసేవారు. నాటకంలో యిలానే పాడాలనీ యివే పాడాలనే నియమేమి వుండదు. నటులు సమర్థులైనపుడు చెప్పాలనే సంకల్పమున్నప్పుడు వారు చెప్పదలచుకున్న విషయాలు స్పష్టంగా చెప్పేవారు.

ప్రభువుల నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేయడంలో యక్షగానాలు ప్రముఖ పాత్ర పోషించాయి. ప్రజల్ని ఆలోచింపచేశాయి. యక్షగానాలు నిశ్శబ్ద సాంస్కృతిక విప్లవానికి దోహదం చేశాయనడంలో సందేహం లేదు. యక్షగానాలు ధర్మ రక్షాగానాలుగా ప్రసిద్ధి పొందినాయి.

పండితులు మొదలు పామరుల వరకు అందరికీ అర్థమయ్యే విధంగా ఆటపాటలను సమకూర్చుకొని, ఆహార్యాదులు సంతరించుకొని, చక్కని హాస్యాన్ని మేళవించుకొని హృద్యమైన వాద్య సహకారంతో సర్వ కళాసమాహార రూపంగా ప్రజలకు హృదయ రంజకమైన కళారూపంగా ఆనాడు యక్షగానం వికసించింది.

సూటిగా చెప్పకుండా పాత్రల ద్వారా చెప్పించడం వల్ల ప్రజల మనస్సుల్లోకి బాగా ఎక్కేది. పాప పుణ్యాలు, దానధర్మాలు, మంచి చెడ్డలు అనే విచక్షణ ఈ యక్షగానాల ద్వారానే అందింది నాటి ప్రజలకు. నిరంకుశ నిజాం ప్రభువులకు

వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించింది యక్షగానములే యని చెప్పడంలో ఆశ్చర్యంలేదు.

నేడు సినిమాలు, టీవీలు ఎక్కువగా రావడంమూలంగా మన యక్షగానాలు తెరమరుగైనాయి. కాబట్టి మన ప్రభుత్వం వారు శ్రద్ధ తీసుకొని మన ప్రాచీన యక్షగాన కళారూపాన్ని రక్షించాల్సిన అవసరమెంతైనా ఉన్నది. మన పూర్వ కాలం నాటి దరువులు, ఆహార్యములు వీడియోలకెక్కించి కాపాడాలి. యక్షగాన నిష్ణాతులైన కళాకారుల ద్వారా యువకులకు శిక్షణ యిప్పించాలి. యక్షగాన కళాకేంద్రాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా స్థాపించి ఆసక్తిగల యువకళాకారులను తయారు చేయవలసిన బాధ్యత మన ప్రభుత్వంపై నున్నది.

యక్షగానములందు మొట్టమొదట బాలకృష్ణుని వేషము ప్రవేశిస్తుంది. వెనుక శ్రుతి పట్టే వాళ్ళుంటారు. తాళము, మద్దెల మ్రోగిస్తూ పాత్ర పాటకనుగుణంగా ఆడేందుకు ప్రోత్సహిస్తూ వుంటారు.

బాలకృష్ణుడు : బాల కృష్ణుడనురా! గోపాల బాలుడనురా !
బాలకృష్ణుడను బాలలతో గూడి
ఈ సమయంబున యిటకే తెంచితి ॥బాల॥
నందనందనుడరా! యశోద కుమారుడరా !
నందనందనులు ముందరనడువగ
భక్తుల బ్రోచెటి బాలకృష్ణుడను ॥బాల॥
మత్స్య రూపమెత్తే సోమకుపట్టి వధించితిరా !
వేడుకతోడుత బ్రహ్మకు వేదము తెచ్చియిచ్చితినిరా ॥బాల॥
కూర్మ రూపమెత్తి నేను కులగిరి మోసితినిరా !
వేడుక తోడుత అష్ట దేవతల కాపాడితి గదరా ॥ బాల ॥
శ్రీరాముడనయ్యి రావణు పట్టి వధించితిరా !
భక్తి తోడుత అయోధ్య పురుము పాలించితి గదరా ॥బాల॥

ప్రవేశం : రంభలేదా రంభోర్వసులు ప్రవేశిస్తారు.
రంభా యనెడు దానిన్ - సంపూర్ణశశి - బింబాముఖినేనున్
యంభోరుహాక్షిని - యలినీలవేణిని కంబూసన్నిభాకంఠిన్
నాదు నామంబు స్త్రీ వేదంటిన్ - ఆహా ॥రం॥
సూనాస్త్రు చేతి చిలుకన్ - నా వాక్కులు -చూడగ సుధలొలుకున్
చానారో సాహిత్య సంగీత కళలచే - మౌనుల తలపింతున్
చక్కని దానను జగమందున్ - ఆహా ॥రం॥
కల్లాలాడగ వెరతున్ పాడిచెపల్లి వితలునిదలతున్

రంభ పాత్ర కన్న ముందుగానే మంత్రి పాత్ర ప్రవేశిస్తుంది. యక్షగానానికంతటికి ఈ మంత్రి పాత్ర చాలా కీలకమైనది. ఇది సూత్రధారుని వంటి పాత్ర : పాత్రలన్నింటినీ ప్రశ్నిస్తుంది. సభకు పరిచయం చేస్తుంది. మధ్యమధ్యలో హాస్యాన్ని పోషించి ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని అందిస్తుంది. స్త్రీ పాత్రల ప్రశ్నించే ముందు నటిగా, సఖిగా మారుతుంది. పురుష పాత్రలను ప్రశ్నించేప్పుడు ప్రధానిగా వుంటాడు.

మంత్రి॥ మాతాలయను మంత్రివర్యుడా - ప్రఖ్యాతిగాంచిన మేరు ధీరుడా
నీటిసాగరు డాను నేర్పుతో యెదురైన - పాతకులనుబట్టి ఘాతనొందించెత ॥మాత॥
అసమానభూరి పరాక్రముడా నేరసికత్వమున దండిశూరుడా !
శశిసమతేజుడ శత్రుభీకరుడాను విశదంబుగానునే కదన విజయుండాను ॥మాతా॥
(రంబారంపాల)

రాణి ప్రవేశము : తెరవెనుక

కైలాస వాసానన్ కాచి రక్షించు మీ పార్వతీశా ॥
ఫాలలోచన నిన్ను ప్రస్తుతిజేతును పార్వతీశా ॥

నీలకంఠ త్రినేత్రా నిఖిలలోకేశ్వరా పార్వతీశా ॥
ఓ శూలాయుధధరసుజన సంరక్షా పార్వతీశా॥

తెరవెడలునపుడు

భామానేనయ్యానేముద్దుల భామానే - భామానువినునానామము
రుమాదేవీ । సోముని నయముఖనేయను చక్కనీ ॥భా॥
యింతినే మన్మథుని చేతిబంతినే యింతులలో పూబంతుల సమమున
యీ సభకేతెంచితి॥భా॥

శీలనే సద్గుణ జాలనే - బాలరో వినుమిక పార్వతి నాథుని
చాలననాయది సంస్తుతి జేసెద ॥భా॥ (సుగ్రీవ విజయం)

తెర వెడలి అభినయంతో నర్తనంతో ప్రేక్షకులకు కనువిందు చేస్తుంది.

రాజు ప్రవేశం : తెర వెనుక పాట

వాలి సుగ్రీవులాము వరుసతో వినరోరి ద్వారాపాలా
మేము చాల సంభ్రమముతో చనుదెంచినారము ద్వారపాలా
అష్టప్రధానులు అతిబల శాలురు ద్వారపాలా
మతినిష్ఠతో గొలుతురు నీక్షితి యందున ద్వారపాలా
కిష్కిందగిరిపైన కీర్తింతూ వేలుపుల ద్వారపాల।
లష్కరు బలమెన్న లక్ష్మీశు వశమౌన ద్వారపాల । (సుగ్రీవ విజయం)

సభ జేయుదామిప్పుడు మంత్రులారా సభ జేయుదామిప్పుడు
సభ జేయుదామిక సభికులు మెచ్చగ
శుభమందునేడు సద్విభవంబుతోడుత ॥సభ॥
వారాంగనలు ఆడగా - వరుసతో భేరి వాద్యములు మ్రోగగా

పరివారసేనలు బహుగ నుతించగ
సురలు సంతోషించి సమదృష్టి గురిపించ - సభజేయు ॥

వాలిమాయాసుర సంవాదం :-

ఓరీ యెవ్వడవుర నీవిటు జేరీ - పురిద్వారమందు మితిమీరి
జేరియుమమ్ములదూరీ। పారిపోక దుర్భాషలు పలికెవు
ఘోర ఖడ్గమున జేరి వేతునిను ॥ఓరి॥

నేను, మాయాసురుడనువాడను. పనిబూని వేగనీతోను, రణమూను
జేయమదిలోను - పూని వచ్చితిని పోనివ్వకవో వానర నిన్నువరుసతో కూల్చెద
॥నేను॥

రారా! కదనంబు సేయ నిటురారా! మరుమాట లేల వోక్రూరా! తరుణంబు
హెచ్చె నీకురా। సారె సారెకిటు మీరిపల్కెదవు ధారుణి గూల్చెద తప్పక నిన్నిక
॥రారా॥

కోతీ - బలుమాటలేల దుర్నీతీ - భూతలమున నా ప్రఖ్యాతీ తెలియక పలికెదవీరీతి
- పాతక నిన్నిదె పట్టిద్రుంచెదను - భూతలమున ప్రఖ్యాతిగాంచెదను ॥కోతీ॥

వచ్చె చూడర నీపై గద వచ్చె - మదమచ్చరంబు నీకిచ్చె దిక్కులు వణకగజొచ్చె
- విచ్చలవిడినీవెందుబోయెదావు - చెచ్చెరనిన్నిక చెండాడెదరా ॥వచ్చె॥

విషాదములో శోకావళి :

కరుణించరానన్ను దేవా! కఠినమెందుకు నన్ను కరుణించరావేమి పరమేశ్వరా
యెట్టి పాపమెరుగను గానీ - నిరపరాధిని నేను నీవైన దెలియావా? ॥కరుణించరా॥

పతినెడబాపె సురవేశ్యా యింత పనిచేసెగద విశ్వేశా!
గతిలేక యిన్నాళ్ళు గడిపితెట్టులోకాన
క్షితి కంతనేనింకా జీవింపనొల్లాను ॥పతినెడి॥
ధరణి పాడిచెనపల్లెవాసా! నీకు దయరాదా శ్రీ విఠలేశా!
కరివి గాచిన నీదు బిరుదెందుబోయెనో
పరమాత్మ నీకు నా మొర వినరాదాయె ॥ధరణి॥ (రంభరంపాల)
కరుణరసం ఉట్టిపడే విధంగా వుందీ ప్రార్థనము. రూపావతి భర్తను గానక శోకించే ఘట్టంలోనివి.

యక్షగానములో సర్వసాధారణంగా ఎరుకత పాత్ర ప్రవేశిస్తుంది. ఎరుకత చెబుతుంది. యిది జానపదుల కల్పన.

ఎరుకల నాంచారినే అవ్వోల్లవ్వా - యెరుకా జెప్పెదవినరే
యెరుక జెప్పెదనేను యేడే భువనాల
దిరుగుచు వస్తిని మురిపెంబు తోడుత ॥ఎరుకో॥
అనుమానమొందకుడీ మీరలునాదు యాత్మ శక్తినిగాంచుడీ
వనితలారా వచ్చి యడుగుడి మీరలు - మనసులోనున్నట్టి
మాటనే దెల్పేద ॥ఎరుకల॥
కైలాసంబున కేగీతీ యెరుకానే కాత్యాయనికి జెప్పితి
శైలజాతయిట్టి జత్తాది చీరెయు - ఫాలాక్షుడును జూడ బహుమానముగా
నిచ్చె ॥ఎరుకల॥

కాపుల ప్రవేశం :

రావోయి యెంకిరెడ్డి రాజుమనల బిల్చెనట
పావోయి మనతోయేమి పనిబడ్డదో కాని ॥రావోయి॥
యెందు కోసం పిలిచెనో యేమి యడుగ దలచెనో
అందరాము గూడి పోయి అడుగుదాము ఈ వేళ ॥రావోయి॥

పన్నులెక్కవజేయునేమో - పైకమంతయడుగునేమొ
యున్నమక్త భూములన్ని యూడగుంజుకానునేమొ
రైతుల భాష, యాసబట్టి తెలుస్తుంది. రాజులు పన్నులు వేయుట రైతుల దయనీయస్థితి తెలియవస్తుందీ పై దర్వుల వల్ల.

హిడింబాసురుల వాదం దర్వు :

హి॥ ఏరా! నీకింత భయం లేదురా పొద్దెంత మీరినాదిరా?

నాయాకలి యెరుగావురా? వోరి నరుడవేగంబె రాకమితి మీరి ధీరచేజేరవస్తివి ॥ఏరా॥

భీ॥ ఓరీ! నీకోసరమొచ్చినరోరీ! దనుజాధమమూర్ఖవిచారీ! నీయాకలి దీర్చెదరోరీ! కారణమేలరగదాదండమున - చేరవస్తిమిటు మీరకు మింకను ॥ఓరీ॥

చాలా గర్వంబు చేతలా-నీవే గద జూపెదౌర నరబాలా - నాయాకలెరుంగ వదేలా - ప్రాలుమాలిమహిశములు శకటము - యేల కుడుములను యేమరివస్తివి ॥బాల॥

భీ॥ నేనూ ! నీయాకలి దీర్చేదానూ! వూరకనే మళ్ళీ పోను । గదకేలంబూనీనాను - ఓరి నిశాచర వరదుడేలనే పూని వధింతును కాన లేవురా ॥నేనూ॥

నీవు! యెవ్వడవురనాతో లావూ మదమెక్కియు బహుప్రేలేవు - నేరాక్షసుడని తెలియవు. గావు బట్టెదను బకాసురండను - కావరమతినను కావజాలవనిక ॥నీవు॥

దుర్యోధన పాంచాల వాదందర్వు :

పాంచాలాధిపరారా! మము వంచెన జేసితివౌరా! యించుకైన నిను విడువక నిప్పుడె ద్రుంచివేసెదను యెంచుకోర స్థితి ॥పాంచాలాధి॥

మించి పలికెదరు మీరూ - యెదిరించి నిలువగలేరు. మంచి యంత్రము
ఘంచ జాలకను వంచన జేసితివంచు బల్కెదరు ॥మించి॥

ధీరుడవనుకున్నవురా! నీ ధీరతనణగించెదరా! ధారుణి
సురవరుదాపుజేరినను - మానక నిను సంహరణము జేసిద ॥ధీ॥

కౌరవేంద్ర యిటురారా ! నీ గర్వమణంచెదక్రూరా! ధరసురవరుడని
దలచితేమొవిన్, దురమొడి యెరుగావు దుర్యోధనయిక ॥ కౌరవేంద్రా॥

బిచ్చమెత్తు బ్రాహ్మణ యిక వచ్చెవా నా సరి - నీవు మచ్చయంత్రముం
తెచ్చనుకుంటివా వచ్చెసు బాణము చచ్చెదవికనూ॥

వాదందర్వు తండ్రి కూతుళ్ళు - (గుణసుందరి)

ఉగ్రసేనుడు

నాన్న నన్నిటు బల్క మర్యాద - నేనన్నది నిజమే కాద
నీవన్నది **యేమిటి భోధ - పన్నుగాను** పతిదైవ
మంచును **యేనా కథలు** చెప్పుచున్నవి ॥నాన్న॥

పోతే నీకపట **నాటకము** దెలినే యెవడనుకొంటివి
ఓసే నీమీసంకింటికి **యేసే** । **ఈ** సమయంబున యొకటి
కల్లెదవా - **ముసలినాకుని అంట**గట్టెదను ॥పోతే॥

ఓసీ వదరబోకె రాకాసీ - నాకరవాలంబును దూసీ
నీతల పండు గొట్టేసే - వాసిగానుకసిదీరగయిప్పుడే
కోసి వేసెదను నోరుమూలతే ॥ఓసీ॥

చాలు నీకూత లెల్లయిక మానూ - యేలాగున బోదువావీను
కల్లగాదు చంపెదాను - బాలుడవయ్యు యింతటి విదు
యేలర నీకు కొలికి వేసెదను ॥చాలు॥

యెంత పాపాత్మురాలవేయింతీ - నా చెంత నిల్వకే బంతీ ।
నిన్నింతలో వర్లగా ద్రుంతు - కాంత యొక్క వదురబోకు
నిను యింతలోన ఛేదింతును నిన్ను ॥యెంత॥

రాజరాజనరేంద్రుడు విలపించుట : కాంభోజి - ఆట

ఎటువలె యని యుందురా! నాతనయునేనెటువలె మనియుందురా!
ముటుమాయలాడిఈ మగువమాటలు విని తటకున నిన్నిట్లు దండింపబంపినే
॥ఎటు॥
గురుభక్తి మరువని గుణవంతుడవు నీకీ దుర్మోహమెటుగలిగే దోచదాయెనునాకు
॥ఎటు॥
తనయా నీవు లేని తనువేల ధనమేల
పనికి మాలిన యిట్టి ప్రభునామమింకేల ॥ఎటు॥ (సారంగధర)

చంద్రహాసుడు ప్రవేశం :

రాజేంద్ర తనయుడేతెంచెను - భానుతేజంబుదిశలెల్ల మించెను
ఈ జగంబున విష్ణు పూజలు సేయుచు భూజనులందరు
పుణ్య డంచుగొల్వ ॥రాజేంద్ర॥
లలిత మహిమయహారుడు చిన్నబాలుడు సుగుణాలవాలుడు వాలాయముగ
నిత్య వాక్యధురీణుడు చాలగ నార్యులు సన్నుతిచేయును ॥రా॥

దుష్టమంత్రికి - వీర సేనునికి వాదం: దర్వు

చలమేల నొక బాలుతలగొట్టవలెనోయి వీరసేనా ॥నీకు
యిలలోన బహుమానములు చాల యిప్పింతు వీరసేనా॥

యెటువంటి బాలుడో యిటుతోడి తెప్పించు రాజమంత్రీ నా
చటులాస్త్రమునవాన్ని తటుకున ద్రుంచెద రాజమంత్రీ

అంతఃపురంబున ఆ బాలుడుండును వీరసేనా॥నీవు
చెంతకేగివాన్ని వంతు బాపిరమ్ము వీరసేనా॥

అట్టి బాలుడు యేమి అపరాధములు జేసె రాజమంత్రీ
వాణ్నిబట్టి ద్రుంచుటకు పనియేమోతెల్పుడి రాజమంత్రీ

నాదు పట్టణముకు నాయకుడౌనంచు వీరసేనా ముందు
పాదుగ విప్రులు పల్కిరి నాతోను వీరసేనా ॥ (చారుహాస)

తార : ద్విపద

వారిజాక్షిరోనాదువార్తనునీకు - కోరితెల్పెదనమ్మ గోర్కెతో వినుము
మావూరునడిగితివి యదివేగవినవే - దేవేంద్ర పురికన్న దివ్యమైయొప్ప
ధరలోనకిష్కింధ గిరినిమరి అవూరు - తరమెవర్ణింప ధాతకునైన
పూలతోటలు మంచి పున్నాగతరులు - చాలగా గలిగుండు ఓ బిసరు హాక్షి
గోపుర ప్రాకారకుడ్యంబులును - మాపట్టణముపరిమహిలోన లేదు
పచ్చని తోర్ణమున్ బాగుగాగట్టి - హెచ్చుగా వెలుగొందు హేమాద్వారములు
అపట్టణమునేలు నతిధీరశాలి - నా ప్రాణనాథుండు నాతీరో వినవే.

పంచచామరము : వాలి

ఓరి దుర్మదాంధనిన్ను - వాలముచేబట్టియున్
బిరానవార్ధిలోన ముందు బిట్టు బెదర దేవతాన్
సురాసరీగ నాతోనిల్చి సంగరంబొనర్పయీ
ధరాతలంబులోన లేడు - దండివాడెవండిలన్

మాయా : సుగంధి వృత్తము

కోతి బింకములు మాను కూయకింకమాటలన్
మూతి ద్రిప్ప చూచునాదు ముందు నిల్చుటేలనీ
సేతులన్ని మాయచేసి జేజేలంత నేడ్వగాన్
ఖ్యాతీ మీర నిన్ను బట్టి ఖడ్గ ధార గూల్చెదన్

ఇవన్నీ ఆయా సందర్భాల కనుగుణంగా యక్షగానాల్లో వస్తాయి. వాదాలు, దర్వులు, పాటలు, పద్యాలు, వచనాలు ఇలా ఎన్నో యక్షగాన వికాసానికి దోహదం చేసినవే. గోలకొండ రాజుల కాలంలో పల్లెల్లో ప్రజల్లో పల్లవించిన, యక్షగానం చివరి నిజాంల కాలంలో సంస్కృతీభాషా పరిరక్షణ వాహకంగా పనిచేసిందనడంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు. ఈ దృష్టితో ఇంకా దీనిని లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

8. కామినేని (రాజా) మల్లారెడ్డి

షట్చక్రవర్తుల చరిత్ర - పద్మ పురాణములు

- డా॥ అయాచితం నటేశ్వర శర్మ

తెలుగు సాహిత్యానికి వన్నెలు దిద్దిన కవి - పండితులు విరాజిల్లిన ప్రాచీన సంస్థానాలలో దోమకొండ సంస్థానం ఒకటి. ఈ సంస్థాన పరిపాలనా కాలాన్ని క్రీ.శ. 15వ శతాబ్ది మొదలుకొని 20వ శతాబ్ది పర్యంతంగా పరిశోధకులు పేర్కొంటున్నారు. ఈ సంస్థాన పాలకులు పాకనాటి రెడ్డి శాఖకు చెందినవారు. రాచుళ్ల గోత్రీకులు. కామినేని వంశజులు. ఈ వంశజులలో ప్రసిద్ధుడైన 'కామినేడు' పేరుతోనే ఈ వంశానికి ఈ పేరు అన్వర్థమైంది.

ఈ కామినేని వంశంలో ఏడవతరానికి చెందిన రెండవ మల్లారెడ్డి కవిగా, కవి పండిత పోషకునిగా సుప్రసిద్ధుడు. ఇతడు క్రీ.శ. 1535-1600 మధ్యన జీవించాడని విమర్శకుల అభిప్రాయం. ఈ కవి సంస్కృతాంధ్ర భాషలలో అనేక గ్రంథాలను రచించినట్లు ఇతని శివధర్మోత్తరం ద్వారా తెలుస్తూ వున్నప్పటికీ, ఇతని రచనల్లో షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే మూడు కావ్యాలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ మూడు కావ్యాల్లోనూ లభ్యమౌతున్న ఆధారాలను బట్టి షట్చక్రవర్తి చరిత్ర మొదటి రచనగానూ, శివధర్మోత్తరం రెండవ రచనగానూ, పద్మపురాణం మూడవ రచనగానూ చెప్పబడుతున్నాయి.

హరిశ్చంద్రనల పురుకుత్సపురూరవ సగర కార్తవీర్యులనే ఆరుగురు చక్రవర్తుల వృత్తాంతాలను నిబంధించిన షట్చక్రవర్తి చరిత్రను మల్లారెడ్డి 'మహాప్రబంధం'గా పేర్కొన్నాడు. కానీ ప్రబంధ సామాన్యాలైన వస్త్వైక్యం, ఏకనాయకత్వం, ఏకాంగిరసత్వం లాంటివి ఈ ప్రబంధంలో కానరాక పోవడం వల్ల ఇది ప్రబంధ గుచ్ఛమే అనడం సమంజసమని విమర్శకుల అభిప్రాయం.

షట్చక్రవర్తులలో ఆద్యుడైన హరిశ్చంద్రుని కథ వేదాది వాఙ్మయంలో అనేక సందర్భాలలో కనబడుతోంది. ఋగ్వేదంలో అంతర్భవించిన ఐతరేయ బ్రాహ్మణంలోని కథలో హరిశ్చంద్రుడు సత్యశీలుడుగాకాక, అసత్యవచనుడుగా కనబడతాడు. ఈ కథలో హరిశ్చంద్రుడు పుత్ర సంతానం కోసం వరుణుణ్ణి ఆరాధించి, తనకు పుత్రుడు లభిస్తే ఆ పుత్రుణ్ణే నరమేధంగా వరుణునికి సమర్పిస్తానని వాగ్దానం చేస్తాడు. పుత్రుడు ఉదయించిన తరువాత అతనిపైన గల వ్యామోహంతో వాగ్దాన భంగం చేస్తాడు. అప్పుడు వరుణుడు కోపించి తన శాపంతో హరిశ్చంద్రుని జలోదరవ్యాధిగ్రస్తుని చేయడం, దానికి భయపడిన హరిశ్చంద్ర సుతుడైన రోహితుడు శునశ్శేపుని క్రేతునిగా తెచ్చి నరమేధానికి పాల్పడబోగా, విశ్వామిత్రుడు శునశ్శేపుని కాపాడి తన పుత్రునిగా స్వీకరించడం కనబడుతుంది. మార్కండేయ పురాణంలో హరిశ్చంద్రుడు సత్యవచనుడుగా, ధర్మనిష్ఠుడుగా దర్శనమిస్తాడు. దేవీ భాగవతంలోనూ, శ్రీమహాభాగవతంలోనూ ఐతరేయ బ్రాహ్మణగాథ, మార్కండేయ పురాణ గాథ సమ్మిశ్రితమై కనబడుతుంది. మల్లారెడ్డి మాత్రం గౌరన మార్కండేయ పురాణంలోని హరిశ్చంద్రుని కథనే ప్రధానంగా అనుసరించినట్లు విమర్శకులు తేల్చారు. మల్లారెడ్డి వర్ణించిన హరిశ్చంద్రుని గుణగణాలను చూడండి -

'వైరి నృపతులు జగదేక వీరుడనగ
బుధులు భూలోక కల్పక భూజమనగ
మదవతుల్యాచి సాకారమదనుడనగ
బుడమి యేలుచునుండునా భూవరుండు'

-షట్చక్రవర్తిచరిత్ర : ఆ -2, ప-7

భారతంలో అరణ్యవాసం చేస్తున్న ధర్మరాజుకు బృహదశ్వుడనే ఋషి చెప్పినట్లుగా కనబడుతున్న నలుని వృత్తాంతాన్ని మల్లారెడ్డి తన షట్చక్రవర్తి చరిత్రలో ఐదు అశ్వాసాల్లో పేర్కొనడం జరిగింది. నలదమయంతుల వివాహం వరకే కథను వర్ణించిన మల్లారెడ్డి నలుని ద్యూతక్రీడా పరాజయాది వృత్తాంతాలను వదిలివేశాడు. మల్లారెడ్డి ప్రధానంగా నైషధాన్ని అనుసరించే తన కావ్యంలో నలకథను

తీర్చిదిద్దినట్లు విమర్శకుల అభిమతం. అందుకు నిదర్శనంగా - శృంగార నైషధంలో శ్రీనాథుడు నలుని వర్ణించిన 'చాపనీరదభవశరాసారశమిత, బలవదహితతేజో దవానలుడునలుడు' (ఆ-1,ప-46) అనే పద్యపంక్తులచ్ఛాయలో మల్లారెడ్డి - 'భువిని రాజిల్లె శాత్రవ భూపభయదబలుడు కువలయబాంధవకులుడునలుడు' వంటి పద్య పాద్గాలను ఉదాహరిస్తున్నారు. ఇంకా అనేక సందర్భాలలో మల్లారెడ్డి శ్రీనాథునేకాక, శ్రీహర్షుని కూడా అనుసరించినట్లు వర్ణనలు సాక్ష్యమిస్తాయి. ప్రాచీన కవులపైన గల గౌరవాభిమానాలతో ఇలా మల్లారెడ్డి కొన్ని వర్ణనలు చేసినప్పటికీ, స్వీయ కవితా ముద్రను కూడా దర్శింపచేసే ఘట్టాలు కూడా లేకపోలేదు. అలాంటి వాటిలో నలదమయంతుల కేళీసౌధవర్ణన ఒకటి. అక్కడ మల్లారెడ్డి -

'శ్రవణోదంచిత శబ్ద విస్ఫురణమై శయ్యా విశేషాలవా
ల వినోదాస్పదమై సముజ్జ్వలతరాలంకారమై చిత్రబం
ధ వితానస్ఫుటమై సువర్ణ రుచియుక్తంబై విజృంభించు స
త్కవి కావ్యంబును బోలి చూడదగు రంగత్కేళి సౌధంబునన్'

అంటూ తన కవితా ప్రతిభను చాటుకొన్నాడు.

విష్ణువు అంశతో జన్మించిన బిందుమతీ మాంధాతల కొడుకైన పురుకుత్సుని చరిత్ర షట్చక్రవర్తి చరిత్రలో మూడవకథ. ఈకథకు మూలం శ్రీమద్భాగవతంలోనూ, విష్ణుపురాణంలోనూ, హరివంశంలోనూ కనబడుతుంది. మల్లారెడ్డి విష్ణుపురాణ, భాగవతాల్లోని వృత్తాంతాలనే అనుసరించాడని విద్వదభిప్రాయం. మూలకథను యథాతథంగా స్వీకరించిన మల్లారెడ్డి జైత్రయాత్రాది ఘట్టాలలో మాత్రం వర్ణనలను కొంత విస్తరించి చెప్పాడు.

పురుకుత్సుని సమీపించిన నర్మదా నదీ సుందరీ సౌందర్యాన్ని వర్ణించిన సందర్భంలో మల్లారెడ్డి -

'మదభృంగాలకకంబుకంఠి విలసన్మత్స్యాక్షినవ్యాంబుజ
ద్వదనంగోకకుచన్మృణాలభుజనావర్తైకనాభింబ్రభా

సదనన్ శైవల రోమరాజిని విరాజత్సైకతశ్రోణిన
ర్మద నీక్షించుచు నుమ్మదంబొదవనమ్మాంధాతృసూనుండనున్' (ఆ-6, ప- 49)

అంటూ అద్భుతమైన చిత్రాన్ని దర్శింపచేశాడు.

అంతేకాక, గంధర్వుల బాధలు భరించలేని నాగులు మహావిష్ణువును స్తుతించిన ఘట్టంలో మల్లారెడ్డి -

'వేదములుద్ధరించి, సుధవెల్వడనించి, ధరిత్రి మోచి, ప్ర
హ్లాదుని భక్తుగాచి, బలియౌదల బాదము సాచి, రాజులన్
మోది, దశాస్యుగీటడచి, మూపున నాగలిదాల్చి, దైత్యభా
ర్యాదృఢమానముల్గొని తురంగమునెక్కిన దేవ! కావవే!' (ఆ-6, ప-34)

అంటూ దశావతారాలను వర్ణించిన తీరు అమోఘం. ఈ పద్యం జయదేవుని గీతగోవిందంలోని దశావతార వర్ణనాత్మకమైన -

'వేదానుద్ధరతే జగన్నివహతే భూగోలముద్బిభ్రతే
దైత్యాన్దారయతే బలింబలయతే క్షత్రక్షయం కుర్వతే
పౌలస్త్యం జయతే హలం కలయతే కారుణ్యమాతన్వతే
మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతికృతే కృష్ణాయ తుభ్యం నమః' (గీత గోవిందమ్ :5)

అనే శ్లోకానికి అనువాదమని విమర్శకుల అభిప్రాయం.

పురూరవుని కథకు బీజప్రాయమైన వృత్తాంతం ఋగ్వేదంలోని దశమమండలంలో తొంభై ఐదవ సూక్తంలో కనబడుతోందని విమర్శకులు అభిప్రాయపడుతున్నప్పటికీ ఈ కథ మత్స్య, పద్మ, విష్ణు, స్కాంద, భాగవతాది పురాణాలలో కూడా పేర్కొనబడింది. అయితే ఈ పురాణ కథలో పరస్పరం ఇంచుక వైవిధ్యం కనబడుతూ వుండడం పురాణ కాలాల భిన్నత్వం వల్ల, ప్రవక్తల

భిన్నత్వం వల్ల సంభవమని అనుకోవలసివస్తుంది. మల్లారెడ్డి తన కావ్యంలో ఆవిష్కరించిన పురూరవుని కథ. విష్ణు, స్కాంద, భాగవత పురాణాలలోని పురూరవుని కథలతో సంవదిస్తోందని విమర్శకుల కథనం. మల్లారెడ్డి స్వీకరించిన కథ ఇలా వుంది.

'పూర్వం సుద్యుమ్నుడనే రాజు కుమార వనంలో ప్రవేశించి శివుని శాపానికి గురియై, ఇల అనే స్త్రీగా మారుతాడు. ఇల బుధుని పతిగా పొంది, అతని వల్ల పురూరవుణ్ణి పుత్రునిగా పొందుతుంది. పురూరవుడు భూలోకాన్ని పాలించే సమయంలో మిత్రావరుణుల శాపంతో ఊర్వశి భూలోకానికి వస్తుంది. పురూరవుడు ఆమెను చూసి, మోహిస్తాడు. తనతో ఉండిపొమ్మని ఆమెను ప్రార్థిస్తాడు. రాజు ప్రార్థనను మన్నించిన ఊర్వశి, తనకు ఏనాడూ నగ్నంగా కనబడరాదనే నిబంధనతో పురూరవునితో ఉండడానికి అంగీకరిస్తుంది. పురూరవుడు ఒకనాడు ఊర్వశితో సుఖిస్తూ వుండగా అగ్నులను అపహరించిన గంధర్వులను తరిమికొట్టే ప్రయత్నంలో పురూరవుడు ఊర్వశికి నగ్నంగా దర్శనమిస్తాడు. తన నిబంధనను అనుసరించి ఊర్వశి పురూరవుణ్ణి వదిలి వెళ్లిపోతుంది. ఊర్వశీ విరహంతో పురూరవుడు ఉన్మత్తుడై తిరుగుతూ కురుక్షేత్రంలో ఆమెను కలుసుకొని, గంధర్వుల అనుజ్ఞతో వివిధ యజ్ఞాలను ఆచరించి, తిరిగి ఊర్వశీ సమాగమాన్ని పొందుతాడు.

పురూరవుని జాతకాన్ని వర్ణించే ఘట్టంలో మల్లారెడ్డి రచించిన ఈ పద్యం అతని శాస్త్రాభినివేశాన్ని సూచిస్తుంది.

'పదిట నాత్మ సమాఖ్య ప్రబలగోరికలిచ్చి
మూడింట మెఱసి ప్రమోదమొసగి
యాఱిట దనరి భాగ్యములు వర్ధిలజేసి
యేడింట విలసిల్లి యేపుజూపి
రుద్ర సంఖ్య దనర్చి భద్రముల్ గృపచేసి
యైదింట నరసి భాగ్యముల బ్రోచిన

నాల్గింట నేర్చి యెంతయు గృప వాటించి
యెనిమిదింటను బొంది యెలమినంది
యినుడు సన్మిత్రనందనుండిల సుతుండు
కువలయేశుండహీనుండు గురుడు బుధుడు
కవియునై మించె లసదనుగ్రహనిరూఢి
జారుమూర్తి పురూరవ చక్రవర్తి' (ఆ-6, ప-41)

జటిలశాస్త్రాంశాల పర్ణనలోనేకాక, సహృదయమనోహరాలైన శృంగార రస ప్రధానాలైన పర్ణనల్లోనూ మల్లారెడ్డి లేఖిని ఇలా మధురసాలను వర్షిస్తుంది.

ఊర్వశీ పురూరవుల శృంగారాన్ని వర్ణించే ఘట్టంలో -

'కరికుంభములు చూచి కలికి పాలిండ్లని
భామపోకుమటంచు బట్టబోవు
బల్లవంబీక్షించి పడతి వాతెఱయని
యబలయుండుమటంచు నానబోవు
గొదమ తేటుల గాంచి మదిరాక్షి కురులని
యతివయుండుమటంచు నంటబోవు
నీలాహి గనుగొని నెలత నూగారని
ముదిత రమ్మని కేల ముట్టబోవు

బోవువచ్చును వెండియు బోవువచ్చు
నెచటికేగితివే యూర్వశీ! యటనుచు
రోయునెచ్చెలి సౌఖ్యముల్ ఓయువిధిని
దూఱునుస్సు రటంచు బూరురవుండు." (ఆ-6, ప-155)

సగరుని కథలు రామాయణ, భారత, భాగవతాలలో ప్రసిద్ధమైనవే. మల్లారెడ్డి ప్రధానంగా రామాయణంలో వర్ణింపబడిన కథనే అనుసరించి

సప్తమాశ్వాసంలో సగరచరిత్రను నిబంధించాడని విమర్శకుల అభిప్రాయం. సగరుడు పుత్ర సంతతిని కోరి భృగు మహర్షిని ప్రసన్నం చేసుకోవడానికి తపస్సును ఆచరించడం, అంశుమంతునికి గరుత్మంతుడు ప్రత్యక్షమై గంగా ప్రవాహంతో పితరులకు ఉత్తమ లోకాలు సంప్రాప్తిస్తాయని ఉపదేశించడం, భగీరథుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేయడం, గంగానది శివుని జటాజూటంలో నుండి వెలువడ లేకపోవడం, భగీరథుడు శివుణ్ని ప్రసన్నుని చేసికొని, శివానుగ్రహంతో గంగను నేలకు రప్పించడం లాంటి రామాయణ వర్ణితాంశాలు మల్లారెడ్డి రచనలో సాక్షాత్కరిస్తాయి.

జహ్ను మహర్షి పానం చేసిన గంగానదిని వర్ణించిన ఘట్టంలో మల్లారెడ్డి

'త్రావెన్ జహ్నుండు గంగన్ దట ధరణి సమగ్రద్రువల్లీకుడుంగో
జ్జీవన్నానావిహంగన్ శ్రిత జననికరాశేషజన్మార్జితాఘీ
లా విర్భూతాఘభంగన్ యమ నియమ తపోధ్యాన యోగీశ్వరాంచ
ద్భావాంభోజాత భృంగన్ ధరణి ధరసుతాధ్యక్షమూర్ధాగ్రరంగన్' (అ-7, ప-126)

అంటూ గంగార్భటిని స్రగ్ధరావృత్తంలో దీర్ఘసమాసభూయిష్ఠంగా వర్ణించిన తీరు అతని రచనలోని ఔచిత్యాన్ని సూచిస్తుంది.

కార్తవీర్యార్జునుని చరిత్ర మార్కండేయ పురాణంలోనూ, రామాయణంలోని ఉత్తరకాండలోనూ ప్రసక్తమైంది. గర్గుని ఉపదేశంతో కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుణ్ణి సేవించి వరాలను పొందిన మార్కండేయ పురాణగాధనూ, కార్తవీర్యుడు రావణుని జయించిన రామాయణ గాధనూ మల్లారెడ్డి అష్టమాశ్వాసంలో సమన్వయపరచి, రచించాడు. ఒక ఆశ్వాసంలో నిబంధింపబడిన ఈ వృత్తాంతం చక్కని ప్రాబంధిక వర్ణనలతో పాఠకులను ఆకట్టుకొంటుంది. ఇలా షట్చక్రవర్తి చరిత్ర మల్లారెడ్డి ఉదాత్త కవితాశైలికి ఉదాహరణప్రాయమని చెప్పవచ్చు.

మల్లారెడ్డి రచనలలో మరొకటి పద్మ పురాణం. పేరును బట్టి ఇది పురాణానువాదం కావచ్చునేమో అనిపిస్తుంది కానీ, ఇది పూర్తిగా పద్మపురాణానికి అనువాదం కాదు. పద్మపురాణంలోని ఏకదేశీయమైన పాతాళఖండంలోని 104 నుండి 117 వరకు గల 14 అధ్యాయాలలోని 'శివరామసంవాద' భాగానికి మాత్రమే అనువాదం. సహజంగా శివరామభక్తుడైన మల్లారెడ్డి శివమాహాత్మ్య ప్రతిపాదకమైన ఈ ఘట్టాన్ని అనువదించడంలో ఎంతో ఔచిత్యం కనబడుతుంది.

శివుడు మునివేషంలో ఉమాసహితుడై రాముని దగ్గరకు వచ్చి, అతనితో ముచ్చటించడం, రాముడు శివుని పూజించి, తనకు లింగ మహిమను ప్రబోధించుమని కోరడం; అందుకు శివుడు ఆనందించి లింగమాహాత్మ్యాన్ని వివిధ వృత్తాంత కథనాలతో జోడించి రామునికి చెప్పడంతో ప్రారంభమయ్యే ఈ కథా భాగం శివపూజా సమయంలో ఎవరు ఏ వికారాలను కలిగి వుంటారో, వారికి అలాంటి వికృతావయవాలు సంప్రాప్తిస్తాయని శివుడు రామునికి ప్రబోధించడంతో ముగుస్తుంది. మూలంలో 2400 పద్యగద్యాత్మక పంక్తులుండగా, వాటిని 1308 గద్యపద్యాలుగా అనువదించిన మల్లారెడ్డి అనువాద రచనలో సంక్షిప్తతను పాటించినాడని అనిపిస్తుంది.

ప్రధానంగా ఇది అనువాద రచన కనుక మల్లారెడ్డి పురాణానువాద రచనా నైపుణ్యాన్ని చాటిచెప్పే కొన్ని ఘట్టాలను స్మరించక తప్పదు.

శివుడు మునివేషంలో భార్యాసహితుడై అయోధ్యకు వెళ్ళగోరి, సరయూనదీ తీరంలో ఆగినప్పుడు అక్కడికి వచ్చిన కశ్యపాది మహర్షులు మునివేషంలో వున్న శంకరుని ప్రశ్నించిన విషయం పద్మపురాణం మూలంలో ఇలా వర్ణింపబడింది.

'అయోధ్యాం గంతు కామేన శంకరేణ మహాత్మనా
పార్వత్యాసహదేవేన ఉషితం సరయూ తటే
మునయస్తం సమభ్యేత్య శంకరం విశ్వరూపిణమ్
కశ్యపాద్యామహాత్మానః పప్రచ్ఛురమితౌజసమ్

స్వాగతం తే మునిశ్రేష్ఠ! సభార్యః కుత ఆగతః?
కిమాగమనకృత్యం తే కందేశం గన్తు ముద్యతః?

ఈ శ్లోకాలను మల్లారెడ్డి ఉత్పల చంపకాలలో ఎంతో నైపుణ్యంతో ఇలా వర్ణించాడు.

'శంభుడు సర్వలోకహిత సంఘటనైక నిరూఢసత్కృపా
రంభుడయోధ్యరాము నభిరాము గనుంగొన సర్వమంగళా
కుంభిసమానయాన తనుగూర్మి భజింపగ వచ్చి సప్రమో
దోంచిత చిత్తవృత్తి సరయూతట సీమ వసించెనయ్యెడన్

అనఘులు కశ్యపాది మునులప్పరమేశ్వరుజేరవచ్చి పూ
జనమొనరించి యో పరమసంయమి యెచ్చట నుండియే స్థలం
బునకు జనంగనేమిపని బూని పురంధ్రియు మీరు వచ్చినా
రనవిని శంభుడిట్లనియె నాదరమేదురదృష్టి జూచుచున్'

మూలంలో శివునికి విశేషణంగా 'విశ్వ రూపిణమ్' అని ఒకే మాట వర్ణింపబడగా, అనువాదంలో మల్లారెడ్డి 'సర్వలోకహిత సంఘటనైక నిరూఢ సత్కృపారంభు'డని వర్ణించి శివుడు విశ్వరూపుడేకాక, విశ్వహితకార్యవ్యగ్రుడు కూడా అని మూలాతిశాయి అయిన భావాన్ని నిబంధించి, తన నేర్పును చాటుకొన్నాడు.

ఇలా మల్లారెడ్డి రచనలైన షట్చక్రవర్తి చరిత్ర - పద్మపురాణాలు దోమకొండ సంస్థాన కవుల సాహితీ వైభవాన్ని తలపింపచేస్తున్నాయి.

✦

10. చెర్విరాల భాగయ్య
యక్షగానాలు - తాత్త్విక చింతన

- డా॥ బూర్గుల కేశవులు

చెర్విరాల భాగయ్య 1903లో జన్మించారు. ఈయనకు అక్క, తమ్ముడు ఒక చెల్లెలు ఉన్నారు. తండ్రి చిన్నతనములో చనిపోవుటచే కుటుంబ భారం తలపై పడింది. తల్లితోపాటు బొంబాయిలో కాపురం పెట్టినాడు. అక్కడే 40 సం॥లు కాపురం గడిపినాడు. కాయకష్టం చేసి బ్రతికినాడు.

భాగయ్య కాయకష్టం చేస్తూనే శతాధిక గ్రంథములు రచించినాడు. అతడు బ్రతికి యుండగానే లక్షలకొలది గ్రంథములు అమ్ముడుపోయినాయి. నేటికి భాగయ్య అంటే వారి కులం వారు ఎంతగానో ఆదరాభిమానములు వెలిబుచ్చుతారు. భాగయ్య కోమటి కులమునకు చెందిన వాడై కూడా కూలిపని చేసినాడు. కులవృత్తి చేసినట్లుగా అతని జీవితచరిత్రలో గోచరించుటలేదు.

చెర్విరాల భాగయ్య యక్షగాన ప్రక్రియనే ఎందుకు చేపట్టినాడు. రాజు అనేవాడు ప్రజలు కట్టిన పన్నును ప్రజలకు ఖర్చు పెట్టలేదు. ప్రజల బ్రతుకు తెరువుకు పాటుపడలేదు. అప్పుడు ప్రజలే సొంతంగా ఖర్చుపెట్టుకుంటారు అనే సత్యాన్ని భక్తరామదాసు వలన మనం తెలుసుకోవచ్చు. నిజాం ప్రభువులు హిందువులను మనుష్యులుగా చూడకపోవడం, హిందు సాంస్కృతిక జీవన విధానమును నాశనం చేయడం అందరికీ తెలిసినదే. అటువంటి దశలో ప్రజలు తిరుగబడుట చరిత్ర చెప్పే సత్యం. నిజాం కాలమందు హిందువుల యొక్క భాష, ఆచార వ్యవహారములు నశించినవి. ప్రజల బ్రతుకులు బండబారుచున్న సమయములో తమ ప్రజలను, మతాన్ని ఉద్ధరించుకొనుటకు పుణ్య పురుషులు పుడుతారు. అటువంటివారిలో చెర్విరాల భాగయ్య ఒకరు. ప్రజా జీవనములో

సాధారణ కార్మిక జీవనము గడిపినాడు భాగయ్య. ప్రజల కష్టాలను ప్రభువుల అణచివేతను కన్నులార చూచి అనుభవించినాడు. అందుకే జానపదబాణీలో ప్రజల పదజాలముతో యక్షగానమునే ఎన్నుకున్నాడు. యక్షగాన కళ సమస్త జానపద కళలకు నిలయమైనది. అందుకే యక్షగాన కళను జానపద కళల సమ్మేళనమని చెప్పవచ్చును.

హిందువులు రామాయణ, భారత, భాగవతాలను భగవంతుని గ్రంథాలుగా నమ్ముతారు. వీటిని చూచినా, వినినా ముక్తి కలుగుతుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. అందుకే యక్షగానాలన్నీ వీటిని ఆధారం చేసుకొనియే ఉద్భవించినవి. రామాయణ, భారత, భాగవతాలు అన్యాయాన్ని యెదిరించే స్ఫూర్తినిస్తాయి.

యక్షగానం : యక్షగానం దేశీ వాఙ్మయ ప్రక్రియ. సంగీతం, నృత్యం, అభినయం, వేషధారణం, పాట మొదలగు అంశాల సమ్మేళనమే యక్షగానం. దేవతా గణాలలో ఉన్న యక్షులు ప్రకృతి. జక్కులు - వికృతి రూపమును యక్షులు చేయు క్రియలన్నింటిని జక్కులు పాటించుటచే యక్షగానం అనే పేరు స్థిరపడినది. అది చివరకు జక్కుల కులవృత్తిగా పరిణమించినది. ఆధునిక కాల పరిణామములో గ్రామాలందు విడివిడిగా అన్ని కులాల వారు ఆడుతారు. అన్ని కులాల వారు కలిసి కూడా యక్షగాన మాడుతారు. వీరికి తోడు వాద్యాలు కూడా వాయించె వారుంటారు. తాళ, లయ, రాగాలతో వంత పాటగాండ్లు కూడా ఉంటారు.

తాత్త్విక చింతన : తత్+త్వం+ఇక+చింత+న= పూర్ణ వైజ్ఞానికము. దీని ద్వారానే మానవుడు పుణ్య పురుషుడవుతాడు. పురుషుడు - ఆత్మ - పరమాత్మ. స్త్రీ పురుష అతీతం. ఇటువంటి చింతన ద్వారా అపూర్వమానవ సమాజమేర్పడుతుంది. అప్పుడే వసుధైక కుటుంబమవుతుంది.

తత్ - అంటే అది రూపరహితమైన కాంతి పుంజమే పరమాత్మ. త్వం - అంటే జీవుడు. జీవుడు పరమాత్మను తలచి సిద్ధిని పొందడం. ఈశ్వర నిర్మితమైన జీవాత్మ శరీరం, ఇంద్రియాదులు జీవుని ఆధీనంలోనే ఉంటాయి. వాటి ద్వారా

పని చేసే జీవుడే కర్మ ఫలాన్ని అనుభవిస్తాడు. జీవుడు కర్మాచరణ విషయంలో స్వతంత్రుడే. జీవుడికి సంతానోత్పత్తి మంచి, చెడు గుణాలు, ఆకలి దప్పులు, సంతోషం, శోకం, మోహం అనేవి జీవాత్మ గుణాలు భగవంతుని నిగ్రహానుగ్రహాలు కర్మల స్వభావాన్ని అనుసరించే లభిస్తాయి. జీవుడు కర్మ చేయటంలో స్వతంత్రుడే కాని ఫలితానుభవంలో పరతంత్రుడే. అందుకే మోక్షప్రాప్తి విషయంలో జీవుడు పరమాత్మ ఆధీనుడై యుంటాడు.

చిరుతల రామాయణం : "చెల్లెలా! నీవన్న మాత్రమున నా మనస్సంతయు ఆ జానకీ పైనే యుండెను. దాని స్వయంవరములో శివధనస్సును నేనే విరచివేయు వాడను. కాని కొంచెములో తప్పిపోయినది"

పై మాటలు శూర్పణఖతో రావణాసురుడు పలికినవి.

"కనుగొను నాథా। యాకనకంపు కురంగమును ।
వనజాక్షాదాని బట్టు । కొని తెచ్చియు నాకిటిమ్ము॥
కనులపండువుదోపదాని । కాపాడియు బెంచుకొందు॥

పై మాటలు సీత రామునితో పలికెను.

రావణాసురుడు పరస్త్రీయగు సీతను కోరినాడు. సీత బంగారు వన్నెగల జింకను కోరినది. ఇచ్చట ఇర్వురు కోరిక అనే కర్మను పొందినారు. ఇర్వురు కష్టాలు పడినారు. ఇర్వురూ కష్టాలతోనే మరణాన్ని పొందినారు. వారివారి గుణకర్మల ననుభవించక తప్పలేదు. ఇర్వురు చేసిన తప్పు ఒకటే "కోరిక" యనునది. దాని ఫలితం "మరణం" యనునది. దానిని ఇర్వురు యనుభవించినారు.

మారీచుడు : "వినాశ కాలే విపరీతబుద్ధిః యనునట్లుగా నీకీ బుద్ధి జనించినది. నేనేమి చేయగలను. ఆరాముని చేతిలో జచ్చిన నాకు మోక్షమబ్బును. అటులే వచ్చెదను పదుము"

మారీచుడు పై మాటలు పల్కెను. రావణాసురుడు సీత ఇర్వురు కోరికలకు లోనగుటచే వారి వినాశనము సమీపించినది. పరమాత్మ ప్రేరణతోనే మారీచుడు బంగారు జింకగా మారినాడు. అందుకే మారీచుడు మోక్షప్రాప్తిని కోరుకున్నాడు. అంటే పరమాత్మ మారీచుని చేత మంచి పని చేయించుట యనేది రాముని బాణముతో చంపబడుట. ఇది భగవంతుని ప్రేరణ. అందుకు ప్రతిఫలముగా అతడు మోక్షమును పొందినాడు.

నల మహారాజు చరిత్రము యక్షగానం : నల మహారాజు పుష్కరునితో జూదమాడుచు సర్వ సంపదలు కోల్పోయి ఆపదలు పొందుచున్నప్పుడు భార్యతో పల్కిన మాటలు.

"చీకటి హెచ్చాయె చిత్తంబు మాసెను నాకు గతి యిట్లు నన్నీడ్చె"

అందుకు భార్య దమయంతి పల్కిన పలుకులు కూడ జోడించినచో

"మన సత్య ధర్మంబె - మనల రక్షించును ।
జననాథ దిగులొందనేలా ధీవిశాలా॥"

మానవుడు బుద్ధిజీవి చీకటి అనేది అజ్ఞానం. అజ్ఞానమే అధిగమించినపుడు జ్ఞానం లోపించును. అజ్ఞానములో మానవుడు ఏమి చేయాలో తెలియక అంధకారములో ఉండును. ధర్మమును నాల్గు పాదముల నడువ వలసిన రాజే అన్యాయానికి బలి అయినపుడు చేయునది లేక తన యొక్క కర్మగతిని తలంచుకొని చింతించును. ఇచ్చట నలమహారాజు కూడా అదే మానసిక వ్యధ చెందుచున్నాడు. తన భార్య దమయంతి రాజుకు మనశ్శాంతిని ప్రబోధిస్తుంది. సత్యజ్ఞానంచే ధర్మమనే కర్మ వలన మానవునికి ఆనందము కలుగును. ఈ ఆనందము వలన నశించిన బుద్ధికి ఊరట కలుగును. అందుకే దమయంతి తన భర్తను ఓదార్చుచు పల్కిన పల్కులు.

శివాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. పరమేశ్వరుని ప్రేరణతోనే కర్మలు జరుగును. అందుకే పరమేశ్వరుడే సకల కర్మలకు కారణమని అర్థం. "ఏమి

పాపము జేసితినిరా నాపై యింత గోపము నీకదేరా- కామ జనక నాపై కఠినమెందుకు నీ నామమే యే మారకను దలతు ఏమాయ జూదము నాడజేసి ।కష్ట॥తోయధిలో నన్ను ద్రోసీ పాయనియిడు మూలపాలుగావించుట న్యాయమా యిది నీకు। నాపైన కృప జూడు । ఏ ఆకలి గొని పక్షులాను ।బట్ట। యేక వస్త్రము విసరగాను. ఆకాశవీధిని యవిబట్టుకొనిపోయె చీకాకు గలిగే నా చిత్తమందున దేవ ఏ సంగతి వద్ద కెటులా జేరుదును. నా గతి నేమని దెల్పుదూనూ । క్షితిని రాజంపేట శ్రీలక్ష్మీ వల్లభ పతిత పావన నాదు । గతినీవె యనియుంటి ఏ॥ (నల.మ.రా.చ. 41 పు)

మానవుడు సుఖదుఃఖాలను సమానముగా అనుభవించడు. సుఖాన్ని యనుభవించినంత తృప్తిగా దుఃఖాన్ని అనుభవించలేడు. కష్టాలు వచ్చినప్పుడు భగవంతుని ప్రార్థించటం ఆ కష్టాలకు కారణమైన కర్మను భరించలేక తను కొల్చునట్టి భగవంతుడే చేయించినట్లు బాధపడతాడు. ఈ కష్టాల నుండి నన్ను బయటకు లాగమని సుఖాన్ని కల్గించమని కోరుకుంటాడు. మానవుడు ఆ విధముగా కోరుకొనుట తప్పుకాదు. కర్మ చేయుటకు మానవునికి స్వేచ్ఛ కలదు. ఫలితం పొందుటలో మాత్రం స్వేచ్ఛ లేదు. అది భగవంతుని స్వాధీనములో నున్నది. అందుకే నలుడు భగవంతుని వేడుకొన్నాడు. చెడు కర్మకు ఫలితం అనుభవించక తప్పదు. ఎందుకనగా భగవంతుడు మంచి చెడుకర్మల గూర్చి తన మనస్సుకు సూచన ప్రాయముగా తెల్పుతాడు. మంచి కర్మ చేయమని, చెడు కర్మ చేయవద్దని మాత్రం నిరోధించడు. చెడు కర్మ చేసిన కష్టాలనుభవించక తప్పదు. మానవుడది భరించుకోలేక భగవంతుడు నా చేత చెడు కర్మ ఎందుకు చేయిస్తున్నాడని వేడుకొంటాడు.

శ్రీకృష్ణతులాభారము - యక్షగానము : "రుక్మిణీదేవి యా తులసి దళమును తులయందిడిన తోడనే తుల సమానముగా నగుటయు నంత దివి నుండి దేవతలు పుష్పవృష్టిని గురిపించిరి. నారదుడు మహానందముతో యో తులసీ దళమును గొని తన శిరంబున ధరించి నృత్యము గావింపజొచ్చెను"

ఈ యక్షగానము వలన చెర్విరాల భాగయ్య కవి లోకమునకుపదేశించిన దేమనగా, ద్రవ్యం వలన ఏమి సాధించలేము. ధనం, గర్వం, అందం వీటి వలన గర్వంతో ఉప్పొంగు సత్యభామను భర్త వశీకరణ వ్రతం చేయమని నారదుడు ఉపదేశించెను.

నారదుడే తన వ్రతఫలంగా శ్రీకృష్ణుని దానంగా గ్రహించి మరల శ్రీకృష్ణుని ఎత్తు ధనమియ్యమని కోరును. సత్యభామ శ్రీకృష్ణుని యెత్తు ధనమియ్య లేకపోయెను. అప్పుడు రుక్మిణీ దేవి తులసిదళాన్ని తులయందిడెను. శ్రీకృష్ణునికి సమానంగా తూగెను.

సత్యభామ ధనంతో సమంగా చేయలేకపోయెను. రుక్మిణీదేవి తులసిదళంతో భర్తను సాధించుకున్నది. భగవంతునికి భక్తియే ప్రధానం. ధన కనక, వస్తువులు కావు. శ్రీకృష్ణుడు అవతార పురుషుడు. ఇందు దైవతత్వమున్నది. దైవం మంచికి ప్రతీక. ఆ దైవాన్ని రుక్మిణిదేవి తన మనస్సులో నిల్పుకొన్నది. ఆమె దైవాంశసంభూతురాలు.

చిరుతలసత్యహరిశ్చంద్ర : చంద్రమతి : "చింతించబోకుడీ యిలను । యెంతయైనను భగవంతుడె మనపాలగలడునూ"

సృష్టికి పూర్వం మూడు పదార్థాలు కలవు. అవి ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి. ఈ ప్రకృతిలో సత్త్వ, రజ, స్తమో గుణాలు మూడుపాళ్ళు సమానంగా ఉంటాయి. ప్రకృతిలో అంతర్లీనమై భగవంతుడుండును. కర్మఫలాన్ని మానవుడు భరించలేనపుడు భగవంతుని ధ్యానిస్తాడు. సత్యహరిశ్చంద్రున్ని వీరబాహుడు మాల కులానికి చెందినవాడు. ఏనుగుపై మనిషి నిలబడి గవ్వను మీటిన యది యెంత యెత్తునకు పోవునో యంత ఎత్తు ధనరాశి పోసి హరిశ్చంద్రుని కొనవలెను. గవ్వ ఆకాశమార్గమున యెంతయెత్తునకు పోయినది తెలుసుకొనుట కష్టం. వీరబాహుడు యంత ధనము కల్గియుండుట యసంభవం. ఒకవేళ యతడు అంత ధనం కల్గియుండిన ఆ పురంలోని అగ్ర వర్ణాల వారు ఇంకా ఎంతో ధనవంతులై

యుందురు. ఆ పురంలో ఇతర కులాల వారు యెందుకు హరిశ్చంద్రుని కొనలేదు. వారి పేదరికమే యందుకు కారణం కావచ్చును. ఒకవేళ మాల వానితో పోటీ పడుట యెందుకులే అని భావించుకొనవచ్చును. అప్పుడు వీరబాహుడు అంత ధనరాశిని యెట్లు సంపాదించి యుండును. అతని సంపాదనకు మూలమార్గం స్మశానంలో వచ్చు కాటి సుంకమే తప్ప మరోమార్గం లేదు. అందుచేత వీరబాహు ధనసంపన్నుడు కాదు. అతడు స్మశానం నుండి ఇంటికి వెళ్లు మార్గంలో హరిశ్చంద్రుని విక్రయానికి వేలం పాడుతున్నారు. అప్పుడు అగ్రవర్ణాలు, ధనవంతులు కొనుటకు నిశ్చేష్టులైనారు. అదే సమయమున వీరబాహు విక్రయ రహస్యమును యర్థం చేసుకొని వేలానికి సిద్ధమైనాడు. ఏనుగుపై మనిషి నిలబడి గవ్వను యాకాశమార్గానికి మీటిన యది తిరిగి భూమిపై పడును. అది యందరికి తెలిసిన సత్యం.

వీరబాహు మాత్రం స్మశానంలో తనకు లభించిన సుంకమును మొలనందుంచుకొని యుండెను. ఆ సుంకం డబ్బులనే పిడికిట తీసి గవ్వపై పోసి నక్షత్రకునితో వాదుకు దిగెను. గవ్వయెత్తు ధనం పోయవలెను. గవ్వ యాకాశ మార్గంలో ఎంత ఎత్తుయని పోయవలెను. ఆకాశమార్గానికి మీటిన గవ్వయెత్తు పోసినాను. ఇంక నీ గురువు ఎవరో? చెప్పుకో యని నిష్ఠూరంగా పలికెను. హరిశ్చంద్రుడు నావాడు అని చేయిపట్టి యింటికి తీసుకొని పోయెను. నక్షత్రకుడు చేయునది లేక తిరుగు ప్రయాణమై పోయెను.

దాసర్ల కథలోని అంశమే పై విమర్శకు మూలం. దాసర్లు చెప్పు సత్య హరిశ్చంద్రుని కథ మరియు గ్రంథాలలో ఉన్న కథకు భిన్నముగా నున్నది. నిజమునకు దాసర్లు చెప్పుకథయే వాస్తవానికి దగ్గరగా యున్నది. లోకులు నమ్మదగినట్లుగా నున్నది. ఈ కథ యందలి తాత్త్విక చింతన సత్యాన్ని తెలుసుకొనుటయే.

10. గోల్కొండ (కుతుబ్షాహీల) శాసన సాహిత్యము

- డా॥ బి.ఎన్. శాస్త్రి

ఆంధ్రదేశమును ఏకచ్ఛత్రాధిపత్యముగ పాలించిన రాజవంశములలో కుతుబ్షాహి వంశము నాలుగవది. కరీంనగర్ జిల్లా కోటి లింగాల శాతవాహనులకు నల్లగొండ జిల్లా ఇంద్రపురి విష్ణుకుండినులకు, వరంగల్ జిల్లా హనుమకొండ కాకతీయులకు జన్మస్థలములు.

కుతుబ్షాహీ వంశజులు యావదాంధ్రమునేకాక, కళింగ, తమిళాది ప్రాంతములను తమ అధికార పరిధిలోనికి తెచ్చుకొని పాలించినారు. ఆ రాజవంశీయులకు సంబంధించిన 41 సంస్కృతాంధ్ర శాసనములు 37 అరబీ ఫార్సీ శాసనములింతవరకు ప్రకటింపబడినవి.

సంస్కృతాంధ్ర శాసనములు :

1. ఘన్‌పూర్ శాసనము శా. సం 1451 - క్రీ.శ. 1529
2. రాచపేట శాసనము శా. సం 1451 - క్రీ.శ. 1529
3. కొండపల్లి శాసనము శా. సం 1452 - క్రీ.శ. 1530
4. కొండపల్లి శాసనము శా. సం 1452 - క్రీ.శ. 1530
5. నాగులపాడు శాసనము శా. సం 1466 - క్రీ.శ. 1544
6. కోయలకొండ శాసనము శా. సం 1472 - క్రీ.శ. 1550
7. పానుగల్లు శాసనము శా. సం 1473 - క్రీ.శ. 1551
8. రాచకొండ శాసనము శా. సం 1473 - క్రీ.శ. 1551
9. కొలలంపూడి శాసనము శా. సం 1487 - క్రీ.శ. 1565
10. ఈపూరు శాసనము శా. సం 1496 - క్రీ.శ. 1574
11. మల్కాపురం శాసనము శా. సం 1499 - క్రీ.శ. 1577
12. జుత్తిగ శాసనము శా. సం 1505 - క్రీ.శ. 1583

13. బొడగుల శాసనము శా. సం 1512 - క్రీ.శ. 1590
14. అమీనాబాదు శాసనము శా. సం 1514 - క్రీ.శ. 1592
15. మంగళగిరి శాసనము శా. సం 1515 - క్రీ.శ. 1593
16. మంగళగిరి శాసనము శా. సం --------------------
17. జాగర్లమూడి శాసనము శా. సం 1520 - క్రీ.శ. 1598
18. ధర్మావరము శాసనము శా. సం 1521 - క్రీ.శ. 1599
19. శ్రీ కూర్మము శాసనము శా. సం 1522 - క్రీ.శ. 1600
20. జాగర్లమూడి శాసనము శా. సం 1524 - క్రీ.శ. 1602
21. మంగల్‌పల్లి శాసనము శా. సం 1524 - క్రీ.శ. 1602
22. సింహాచలము శాసనము శా. సం 1526 - క్రీ.శ. 1604
23. శ్రీ కూర్మము శాసనము శా. సం 1526 - క్రీ.శ. 1604
24. వాడపల్లి శాసనము శా. సం 1530 - క్రీ.శ. 1608
25. మాచర్ల శాసనము శా. సం 1541 - క్రీ.శ. 1619
26. ఉర్లుగొండ శాసనము - క్రీ.శ. 1647
27. అనుంపల్లి శాసనము శా. సం 1572 - క్రీ.శ. 1650
28. మూసాబుర్జ్ శాసనము శా. సం 1578 - క్రీ.శ. 1656
29. దేవుల చెఱువు శాసనము శా. సం 1580 - క్రీ.శ. 1658
30. పెదపరిమి శాసనము శా. సం 1585 - క్రీ.శ. 1663
31. శనిగరం శాసనము శా. సం 1586 - క్రీ.శ. 1664
32. ఈపూరు శాసనము శా. సం 1590 - క్రీ.శ. 1668
33. కుద్రవల్లి శాసనము శా. సం 1591 - క్రీ.శ. 1669
34. కావేరి పాక్కం శాసనము శా. సం 1591 - క్రీ.శ. 1669
35. కువ్వం శాసనము శా. సం 1592 - క్రీ.శ. 1670
36. నల్లగొండ శాసనము
37. చాగలేరు శాసనము శా. సం 1599 - క్రీ.శ. 1677
38. ముక్తేశ్వర శాసనము

39. లేపాక్షి శాసనము శా. సం 1600 - క్రీ.శ. 1678
40. ఎడ్లపల్లి శాసనము శా. సం 1600 - క్రీ.శ. 1678
41. సత్యవీడు శాసనము శా. సం 1602 - క్రీ.శ. 1680

అరబీ ఫారసీ శాసనములు :

1. జామెమసీదు శాసనము హిజరి సం 924 - క్రీ.శ. 1518
2. ఎల్గందుల శాసనము హిజరి సం 931 - క్రీ.శ. 1525
3. సుల్తాన్ కులీ కుతుబ్షా సమాధి శాసనము హిజరి సం 950 - క్రీ.శ. 1544
4. పానుగల్లు శాసనము హిజరి సం 958 - క్రీ.శ. 1551
5. మక్కదర్వాజ శాసనము హిజరి సం 967 - క్రీ.శ. 1559
6. గూడూరు శాసనము హిజరి సం 970 - క్రీ.శ. 1562
7. ఇబ్రహీం కుతుబ్షా సమాధి శాసనము హిజరి సం 988 - క్రీ.శ. 1580
8. రాచకొండ శాసనము హిజరి సం 1473 - క్రీ.శ. 1551
9. కొలలంపూడి శాసనము హిజరి సం 1487 - క్రీ.శ. 1565
10. సాజిమ్ ఖానమ్ మసీదు శాసనము హిజరి సం 1008 - క్రీ.శ. 1599
11. మహ్మద్ కులీ కుతుబ్షా సమాధి శాసనము హిజరి సం 1020 - క్రీ.శ. 1612
12. బీబీ ఖదీజా సమాధి శాసనము హిజరి సం 1031 - క్రీ.శ. 1622
13. మియాన్‌మిష్క్ సమాధి శాసనము హిజరి సం 1035 - క్రీ.శ. 1625
14. గోలకుండ కోట పశ్చిమ కుడ్య శాసనము హిజరి సం 1038 - క్రీ.శ. 1628
15. సుల్తాన్ మహ్మద్ కుతుబ్షా సమాధి శాసనము
16. జహరాబీ సమాధి శాసనము
17. తోళీ మసీదు శాసనము హిజరి సం 1043 - క్రీ.శ. 1633
18. అంబర్‌ఖాన శాసనము హిజరి సం 1052 - క్రీ.శ. 1642
19. బోధన్ మసీదు శాసనము హిజరి సం 1065 - క్రీ.శ. 1655
20. మూసాబురుజు శాసనము హిజరి సం 1066 - క్రీ.శ. 1656
21. ప్రేమావతి సమాధి శాసనము హిజరి సం 1073 - క్రీ.శ. 1662

22. మహమ్మద్ కుతుబ్షా కుమార్తె కుల్సూమ్ కుమారుని సమాధి శాసనము
23. హయత్‌బక్షీ బేగం సమాధి శాసనము హిజరి సం 1077 - క్రీ.శ. 1667
24. గోలకొండ మసీదు శాసనము హిజరి సం 1077 - క్రీ.శ. 1667
25. హీరా మసీదు శాసనము హిజరి సం 1079 - క్రీ.శ. 1669
26. తోళీ మసీదు శాసనము హిజరి - 1082 - క్రీ.శ. 1671
27. రహీంఖాన్ మసీదు శాసనము హిజరి సం 1082 - క్రీ.శ. 1671
28. మాసాబ్ టాంక్ శాసనము
29. పెట్లాబురుజు ఫిరంగి శాసనము హిజరి సం 1083 - క్రీ.శ. 1672
30. అబ్దుల్లా కుతుబ్షా సమాధి శాసనము హిజరి సం 1083 - క్రీ.శ. 1672
31. నేక్ నాంఖాన్ సమాధి శాసనము హిజరి సం 1084 - క్రీ.శ. 1673
32. మూసాబురుజు శాసనము హిజరి సం 1085 - క్రీ.శ. 1674
33. మియాన్‌మిష్క్ సమాధి శాసనము హిజరి సం 1085 - క్రీ.శ. 1674
34. అబ్దుల్లా కుతుబ్షా కుమార్తె ఫాతిమా సమాధి శాసనము హిజరి సం 1087 - క్రీ.శ. 1676
35. మియాన్ మిష్క్ సమాధి శాసనము హిజరి సం 1089 - క్రీ.శ. 1677-78
36. మియాన్ మిష్క్ సమాధి శాసనము హిజరి సం 1091 - క్రీ.శ. 1680
37. సాజింఖాన మసీదు శాసనము హిజరి సం 1093 - క్రీ.శ. 1682

గోలకొండ కుతుబ్షాహీల నాటి రాజభాష :

ఫారసీ వారు ప్రజల శ్రేయస్సును కోరి వారికి రాజ శాసనములర్థమగునట్లు తెలుగు భాషలో శాసనములు వేయించినారు. ఈ శాసనములలో అధికముగా తెలుగు వచనములున్నవి. కొన్ని సంస్కృత శాసనములు, సంస్కృతాంధ్ర శాసనములున్నవి. శాసనముల భాష ఆనాడు జన సామాన్యము వాడునట్టి భాష. భూమి కొలతలు, విస్తీర్ణము, వ్యాపార సంబంధిత ధాన్యము కొలతలు అనాటి ప్రజల కర్థమగునట్లు శాసనము లందు వివరించబడినవి.

కొన్ని గద్య పద్య శాసనములు వేయింపబడినవి. పద్యములలో కొన్ని సాధారణముగాను, కొన్ని ప్రౌఢముగను ఉన్నవి. ఆనాటి కుతుబ్షాహీల శాసనముల వివరణమీ క్రింద నీయబడుచున్నది.

1. సుల్తాన్ కులీ కుత్బుల్ముల్క్ శాసనములు :

సుల్తాన్ కులీ కొడంగల్ జాగిర్దారుగనున్న కాలమున హస్నాబాదులో ఒక శాసనమును వేయించెను. కుతుబ్షాహీల తొలి శాసనమిది.

సుల్తాన్ కులీ క్రీ.శ. 1518లో జామె మసీదు శాసనమును వేయించెను. ఈయన కాలములో ఎల్గందల, గోలకొండ, ఘన్‌పూర్, కొండపల్లి దుర్గములందు శాసనములు వేయింపబడినవి. జామె మసీదు శాసనము మహముద్షా బహమనీ పేర వేయింపబడినది.

శ.సం. 1451 క్రీ.శ. 1529లో యారలీ కుమారుడు మాలుక్ తన పుత్ర పౌత్రాదులకు సుకృతమగునట్లు బావి త్రవ్వించి ఘన్‌పూర్ శాసనము వేయించెను.

శ.సం. 1452 చైత్ర శుద్ధ తదియ సోమవారము (క్రీ.శ. 1530లో) కొండపల్లి శాసనము వేయింపబడినది. శ్రీకృష్ణ దేవరాయల మరణానంతరము ఈ దుర్గమును సుల్తాన్ కులీకుతుబ్షా సాధించెను. స్వతంత్రుడైనను సాహు సుల్తాన్ నిజహితుండైన తుబుల్ముల్కుసదన ఏలికకు ప్రభువును తెలుపుకొనినాడు.

సుల్తాన్ కులీ కుతుబుషా ప్రతాపాన కొండపల్లి మొగు దుర్గములను సాధించి దీనాంధకృపణ పంగులు మొదలగు తిరిపేలకు దరివేసులకు కొండపల్లి దక్షిణాన పెయ్యంగలుపకను కిదరబాదు గడీ లంగరు సాగించి ఈ లంగరు ధర్మ సత్రాలకు రెండు గ్రామములు కవులూరు కిదరబాదులను దానమిచ్చుచు శాసనము వేయించెను.

శ.సం. 1452 వికృతి సంవత్సర వైశాఖ బహుళ అమావాస్య బుధవారము క్రీ.శ. 1530లో ఇచటనే మరియొక శాసనము వేయింపబడినది.

సుల్తాన్ కులీ కుతుబ్షా ఆజ్ఞానుసారము ప్రజల కనుకూలముగా కొండపల్లి తానేదారు అత్తామియ, నాయబ్ తానేదారు ఆదిరజాతా కొండపల్లి స్థలకరణము గోపరాజు మహాపాత్రుడు అందిశాత సుంకాలు వసూలు చేయుట మానియు చున్నామని తెలుపుచు శాసనము వేయించిరి. శాసన రచయిత కొండపల్లి కరణము వీరకేదారమాని గోవింద గోవింద రాజ మహాపాత్రుని తనయుడు గోపరాజు మహాపాత్రుడు. స్వతంత్ర పాలకునిగా సుల్తాన్ కులీ కుతుబ్షా క్రీ.శ. 1518 - 1543 వరకు గోలకొండ రాజ్యమునేలెను.

2. ఇబ్రహీం కుతుబ్షా పాలనా కాలమున ఫారసీ సంస్కృతాంధ్ర శాసనములు వేయింపబడినవి.

1. కోయల కొండ శాసనము : కోయలకొండ హాశిం ఇబ్రహీం కుతుబ్షా గౌరవార్థము క్రీ.శ. 1550 సాధారణ, మాఘశుద్ధ పంచమి సోమవారమునాడు శాసనము వేయించెను.

2. పానగల్లు శాసనము : పానుగంటి ఉదయ సముద్రం కాలువ ఇందుపుకేల సీమలో నమిలె వద్ద మూసీనది కతువ ఖిలమై యుండ పునరుద్ధారకముగా కతువగట్టి కాలువ చేయించి, నమిలె మొదలుకొని కృష్ణ ఈ మధ్య చెఱువులు కుంటలు నింపునట్లు గోలకొండ ఇబ్రహీం కుతుబ్షా పనుపున రహమతుల్లా అనునతడు కతువ కాలువ తూములు 3000 హొన్నులు వ్యయపరచి బాగు చేయించి నరసింహస్వామికి భూదానమొసగినట్లు శాసనమందున్నది. శాసన కాలము క్రీ.శ. 1551.

3. రాచకొండ శాసనము : మాలిక్ ఇబ్రహీం కుతుబ్షా ఒడయలకు మన్నేవార్, సామంతులు అష్టాదశ ప్రజలు తాము ఇబ్రహీం కుతుబ్షాకు నమ్మదగిన వారమని, అన్యులు కారని శపథము చేయుచు సాధారణ మాఘ శుద్ధ పంచమి నాడు క్రీ.శ. 1550లో శాసనము వేయించిరి.

4. కొలలంపూడి శాసనము : కొలలంపూడి సింగరాజు తన తండ్రి మల్లపరాజు తల్లి గంగమకు పుణ్యముగా ఆదికేశవునికి గర్భగృహము అంతరాళమండపము భూలక్ష్మీ దేవులకు గరుడ స్తంభము, నీలకంఠేశ్వరునికి గుడి నిర్మించి దేవతలను ప్రతిష్ఠించెను. క్రీ.శ. 1565 అక్షయ మాఘశుద్ధ ద్వాదశి శుక్రవారము శాసనము వేయించెను.

5. ఈపూరు శాసనము : క్రీ.శ. 1574 శ్రీముఖ ఆషాఢ శుద్ధ ఏకాదశిన రావూరు తిమ్మానాయుని కుమారుడు చంపన వినుకొండ సీమలోని రావూరు గ్రామమున అల్లాడనాధుని దశిమి శావలకు కేసరి పాలకుచ్చెల క్షేత్రమును తిరుమల నరసింగయ్యకు దానమిచ్చుచు శాసనము వేయించెను.

6. మల్కాపుర శాసనము : క్రీ.శ. 1577 కార్తీక శుద్ధ పంచమి శుక్రవారము రావిపూడి స్థల ప్రజలు ఇబ్రహీం కుతుబ్షా ఆనతిన తమలో తాము భూమి పన్ను కొలతలకు సంబంధించిన ఒప్పందము నేర్పరచుకొని శాసనము వేయించిరి. కాపులు పూర్తి పన్నును, మహమ్మదీయులు అర్ధపన్నును చెల్లించవలెను. బ్రాహ్మణులు పన్ను చెల్లించనవసరము లేదు. ఇవి శాసన ఒప్పందములు.

III. మహమ్మదు కులీకుతుబ్షా :

1. జుత్తిగ శాసనము : శ.సం. 1505 స్వభాను ఆశ్వీయుజ శుద్ధ దశమి శనివారము నాడు ఇబ్రహీం కుతుబ్షా తనయుడు మహమ్మదు కులీ కుతుబ్షా అజ్ఞ ప్రకారము వాసుకి, రవి, సోమేశ్వరాలయములు ఖిలమై యుండ సత్తిరాజు సోమరాజు కుమారుడు పెద్దిరాజు అతని తనయుడు సోమేశ్వరుడు అత్త లచ్చమ

దేవాలయములను పునర్నిర్మించి వెల్లవేయించి వాసుకి,రవి, సోమ లింగములను విజ్ఞానేశ్వరుని, నత్తరామ లింగముల ప్రతిష్ఠించి దుర్గ, భైరవ, కంఠేశ్వర వాయు, వరుణ, వైష్ణవేశ్వర బ్రహ్మేశ్వర పాపవినాశేశ్వరాలయములను నిర్మించి ప్రతిష్ఠలొనర్చు సందర్భమున శాసనము వేయించిరి. శాసన కాలము క్రీ.శ. 1583.

2. బొడగులా శాసనము : శ్రీకాకుళము జిల్లాలోని బొడగులా గ్రామ సమీపమందున్న కొండ చెంతనున్న శిలపై శాసనమున్నది. మహమ్మదు కులీకుతుబ్షా గోలకొండ రాజ్యము నేలుచుండగ, ఉత్కళ దేశమును బాహుబలేంద్రుని బంధువు సింగ భూపాలుడు పాలించుచుండెను. అసికా, లాంగవేణిల నడుమ సింగసాగర తటాకమును క్రీ.శ. 1590లో నిర్మించి ఈ శాసనమును చేయించెను. శాసనము సంస్కృత భాషలో నున్నది.

3. అమీనాబాదు శాసనము : శ. సం. 1514 నందన వైశాఖ శుద్ధ తదియ గురువారము క్రీ.శ. 1592లో అమీనాబాదులో శాసనము వేయింపబడినది. ఇది గద్య పద్యాత్మకము కులీకుతుబ్షాకాలమున కొందరు సామంతులు తిరుగుబాటులు చేసిరి. సుల్తాను పంపున అమీనుల్ముల్కు తిరుగుబాటునణచి విజయ స్కందావారము నుండి ఈ శాసనమును ప్రకటించెను.

4. మంగళగిరి శాసనము : శ.స్రం. 1515 క్రీ.శ. 1593 విజయ కార్తీక శుద్ధ విదియ నాడు కులీ కుతుబ్షా ఖొజ్జ అలీని పిలిపించి నీ ప్రాంతపు కొలు మామూళ్ళు వసూలగుచున్నవి. కొండవీడు, బందరు, నిజాం పట్టణం ప్రాంతముల పరిస్థితులు బాగులేవు. ఆ ప్రాంతములు బేజారైనవని తెలియుచున్నది. వాటిని బాగు చేయవలెనని తెలిపెను. ఖొజ్జ అలీ ఆ ప్రాంతముల ప్రజలకు రైతులకు కౌళ్ళ వివరములు తెలిపి కొన్ని రాయితీలు కల్పించుచు శాసనము వేయించెను. శాసనము నిలిపిన వాడు ఖానాజీ చాంధిమియా పేరిట రూపారుండు.

5. మంగళగిరి అష్టముఖ శిలాస్తంభ శాసనము : ఇది ఫారసీక భాషలో నష్క్ లిపిలో నున్నది. తెలుగులోను వేయింపబడినది. ఖాజా నైమతుల్లా ఒడయలు అంగడివీధి ప్రాంత వాసులగు మంగళగిర్యాది రెండు పట్టణముల వారికి జరిగిన ఒప్పందము శాసన రూపమున వేయించెను. ఈ ప్రాంతీయులు నమ్మకముతో గ్రామములను అభివృద్ధి పరచి జనసంఖ్యను పెంచవలసినదిగా ఒప్పందము చేసుకొనబడినది.

6. జాగర్లమూడి శాసనము : శ.సం. 1520 క్రీ.శ. 1598లో మహమ్మదు కులీకుతుబ్షా పాలించు కాలమున ముర్తజానగర్ అగ్రహారమందలి ఇజారతి గ్రామము జాగర్లమూడి శ్రీసంగమేశ్వర దేవరకు భూమి దానమిచ్చునపుడు వేయించిన శాసనమిది.

7. శ్రీకూర్మ శాసనము : శ. సం. 1521 క్రీ.శ. 1599 వికారి చైత్ర బహుళ దశమి మంగళవారమున మహమ్మదు కులీ కుతుబ్షా పనుపున అమీనుల్ముల్కు హరాఖ్ఖానైన ముకుంబాహులో బలేంద్రాదుల నోడించి శత్రుసైనిక సమూహమును సంహరించెను. ముకుందబాహు బలేంద్రుడుపారిపోవు చుండ అతనిని వెన్నంటి తరిమి తిరిగి వచ్చుచు శ్రీకూర్మ నాథాలయమును పడగొట్టించి మసీదు నిర్మించి శాసనము వేయించెను.

8.ధర్మవరము శాసనము : శ.సం. 1522 క్రీ.శ. 1600 నాటి శాసనమిది. మహమ్మదు కులీ కుతుబ్షా సైనికాధికారి ఎక్లాస్‌ఖాన్ అద్దంకి, కొండవీడు ప్రాంతము నేలుచు ఎక్లాసుపురమున భూసంబంధ విషయములను వివరించుచు గద్యపద్యాత్మకమైన ఈ శాసనమును వేయించెను. శాసనమున మహమ్మద్ కులీకుతుబ్షా వర్ణన మిట్లున్నది.

"మహమ్మద్ కులీ కుతుబ్షా నిజభుజబల సమాక్రాంత చతురాశీతి దుర్గాధీశ్వరుండును గోలకొండ స్థాన నివాసుండును ఆయన కుతుబనముల్కు

పౌత్రులున్ను ఇభరామ చక్రవర్తికి పుత్రులున్ను ఏకదాటి సేనాతురంగ ఖురపుటచూన్‌లంకృత ఖండికోట గిరిదుర్గ రాయసింహాసనాస్థాన పెనుగొండ ప్రదేశుండును. అసహాయ పీఠకళా వినోదిన్ని, నిజమంజువాణి వాతాన్ సమాకషన్ తాగత ఛప్పన్న దేశ విద్వత్కవిగాయక వందిమాగధపారిహాసికాది నానాయాచక దారిద్ర్య భంజనుండున్ను భూలోక దేవేంద్రుండును అని వర్ణింపబడినాడు.

9. **జాగర్లమూడి శాసనము** : శ. సం. 1524 శుభకృతు జ్యేష్ఠ మాసము క్రీ.శ. 1602 **నాటి శాసనమిది.** జాగర్లమూడి సీమలోని జాగర్లమూడి గ్రామమున **మామిడితోట వేయించినట్లీ** శాసనమందున్నది.

10. మంగల్‌పల్లె శాసనము : శ.సం. 1524 క్రీ.శ. 1602 శుభ కృత్సంవత్సరమున మహమ్మద్కులీకుతుబ్షా పాలించు కాలమున పానగల్లు నరసానాయకుడు నల్లగొండ నేలుచుండ సైదురీమోఖాస అతని **సేవకుడు** సర్వయ కుమారుడు. వేంకటయ శివకేశవాలయ సమీపమున బావిని త్రవ్వించెను. వినాయక స్తంభమును తోటను నిలిపెను. తోటపై ఎట్టి పన్ను కూడా విధింపబడలేదు. కాసయనహతి వినాయకస్తంభమును పొందించెను.

11. **సింహాచల** శాసనము : శ.సం. 1526 క్రోధి కార్తీక శుద్ధ విదియ ఆదివారము క్రీ.శ. 1604 నాటి శాసనమిది. పద్మనాయక వంశోద్భవుడును, విప్పర్ల గోత్రజుడును అగు రాజాధిరాజ మహారాజ శ్రీ కమళయంగారి తనయుడు సర్వప్ప అశ్వారాయనింగారు సింహాద్రి నరసింహుని నిత్యనైవేద్యాలకు రాగభోగములకు నరవ గ్రామమును సర్వమాన్యముగా దానమిచ్చినట్లు శాసనము వేయించెను.

12. శ్రీకూర్మ శాసనము : శ.సం. 1526 క్రీ.శ. 1604 క్రోధి ఆశ్వయుజ శుద్ధ దశమి శుక్రవారము వేయించిన శాసనమిది. మహమ్మద్కులీ కుతుబ్షా పునుపున ఆశ్వారాయనింగారు సైన్యయుతుడై వెడలి అనేక దుర్గములను సాధించి ముకుందబాహు బలేంద్రునోడించి, సరిహద్దుల వరకు వెన్నాడి తరిమి శ్రీకూర్మము వచ్చి అచటి కూర్మ నాధునికి నిత్య నైవేద్యములు సాగకుండుటను గమనించి

శ్రీకూర్మ గ్రామమును సర్వమాన్యముగా దానమిచ్చుచు శాసనము వేయించెను. క్రీ.శ. 1599లో అమీనుల్ముల్క్ దేవాలయమును ధ్వంసమొనర్చెను. సర్వప్ప అశ్వారాయుడు క్రీ.శ. 1604లో పునరుద్ధరించి అగ్రహార మొసంగెను.

13. వాడపల్లి శాసనము : శ.సం. 1530 క్రీ.శ. 1608 కీలక జ్యేష్ఠ బహుళ చవితి ఆదిత్య వారమున ఈ శాసనము వేయింపబడినది. మహమ్మదు కులీకుతుబ్షా గోలకొండ వజ్రసింహాసనాసీనుడై పాలించుచుండ ఆయన దక్షిణ భుజాదండుండగు మలిక్ అమీరూరన మలినగారికి నా మహమ్మదు చేత వజీరాబాదు సీమ మొఖాసాగాదయచేయ విలాయతి విలాయతు సకల సామ్రాజ్యమును ధర్మ పరిపాలనతో ఏలుచుండగా ఆ దివాణానకు అదిష్టాతలైన తలుపునూరి కోనప్ప మళయదేశపు గంగోజి చొప్ప దేవులు గారికి సమసవదరలు చింతరెడ్డి బస్విరెడ్డి, దొడ్డమాధవరావు, మల్లు అన్నప్పసెట్టి యల్లప్ప మయలు వీరప్ప నర్ర అవుభళరెడ్డి దొరసాని యల్లమ్మ దొరసాని అయ్యప్పను బొమిరే కొనమనేండు, తెల్లగొర్ల యల్లప్ప స్థలకరణాలు. చెన్నూరి సోమరాజు, కాచిరాజు వేంకటయ్య మునుగంటి సింగరాజు విన్నపం చేస్తేను. వాడపల్లి శ్రీ నరసింహ దేవరకు నిత్యనివేద్యమహోత్సవములకు రామానుజ కూటానకు కొత్తపల్లి గ్రామము నాచంద్రార్క స్థాయిగా నిచ్చుచు లక్ష్మీ నరసింహ దేవరకు దేవస్వ అగ్రహారముగ నిచ్చిరి. శాసన లేఖకుడు అశిశలన్ మల్లివోడాపల్లి రచించినవాడు మునుగంటి అన్నమరాజు.

4. సుల్తాన్ మహమ్మదుత్కుదుబ్షా కాలము : మాచర్ల శాసనము : మాచర్ల చెన్న కేశవాలయమందున్న శాసనమిది. విశ్వకర్మ సంజాతుడైన రామచంద్రుడు రామడక గ్రామమున తనకున్న మాన్యమును కేశవ దేవర దీపారాధనమునకు దానమిచ్చుచు శ.సం. 1541 క్రీ.శ. 1619లో శాసనము వేయించెను.

V. అబ్దుల్లా కుతుబ్షా కాలము : 1. అనుంపల్లి శాసనము : అనంతపురం జిల్లా గుత్తి తాలూకా అనుంపల్లి ఆంజనేయ స్వామి ఆలయ రాతి స్తంభముపై శ.సం. 1572 క్రీ.శ. 1650లో వేయించిన శాననమున్నది. గోపాలస్వామి,

హనుమదాలయములకు పూజారులకు గ్రామ వర్తకులు ప్రజలు ద్రవ్య రూపమున నిచ్చు వివిధ సువర్ణాది దానముల వివరములు తెలుపుచున్న శాసనమిది.

2. మూసాబుర్జు శాసనము : శాసనము శ.సం.1587 - క్రీ.శ. 1665 మన్మథ మాఘ శుద్ధ సప్తమి బుధవారము నాటిది. ఔరంగజేబు గోలకొండ ముట్టడి సమయమున అతని వజీరు మూడు రోజులలో కోటను వశపరచుకొనెదనని బీరములు పలికి యుద్ధమునకు బయలు దేరెను.

అబ్దుల్లా కుతుబ్షా మూసాఖాన్ నాదేశించుచు బురుజు చెంత నుండి మొగలు సేనల నెదిరించి అప్రమత్తుడవై యుండుమని తెలిపెను. ఆ యుద్ధమున ఫిరంగి ప్రేలుడు వలన మొగలు సేనాని వజీరు మీర్ మీరా క్రీ.శ. 1656లో మరణించెను. తరువాత దక్కన్ సుబేదారు ఔరంగజేబుతో సంధి కుదిరెను. ఆ సంధి గోలకొండ గౌరవమునకు గొడ్డలిపెట్టు. మూసాఖాన్ ఉప్పరిధర్మా చార్యుల నేతృత్వమున బురుజును పునర్నిర్మించెను. మూసాఖాన్ నిర్మించుట వలన ఈ బురుజు మూసాబురుజు అనబడినది. క్రీ.శ. 1667 నాటికి మూసాబురుజు పునరుద్ధరింపబడినది.

3. దేవుల చెరువు శాసనము : చిత్తూరు జిల్లా మదనపల్లి తాలూకా దేవుల చెరువు గ్రామము పడమర వాగుచెంతనున్న శిలపై శ.సం. 1580 - క్రీ.శ. 1658లో శాసనము వేయింపబడినది.

ఆనెగొంది వీర ప్రతాప శ్రీ వీర రామ దేవరాయలు పాలించిన తరువాత హజరత్ గోలకొండ, చంద్రగిరి, గండికోట ఆది రాజ్యములను పాలించుచు మఖాఅలంఖాను కుమారకుయిదు ఖాను ఆధిపత్యమున సోంపల్లి కరణం నారాయణకు దేవుల చెరువు గ్రామ పారుపత్యమిచ్చెను. ఆ గ్రామ భూమి తగాదాలు, కొలతల తగవులుండుట వలన వాటిని పరిష్కరించుచు వేయించిన శాసనమిది.

4. పెదపరిమి శాసనము : గుంటూరు జిల్లా పెదపరిమి గ్రామ దక్షిణపు డొంకలో నున్న శాసనము శ.సం. 1585 క్రీ.శ. 1663 నాటిది. తాడికొండ, పరిమి గ్రామ ప్రజలు భూమి తగాదా పరిష్కారము చేసుకొనినట్లు శాసనమందున్నది.

5. శనిగరం శాసనము : కరీంనగర్ జిల్లా శనిగరము చెరువు అలుగు ప్రక్క కట్ట మైసమ్మ గుడి ఎదురుగా ఫసిలీ 1070 - క్రీ.శ. 1664 ప్లవంగ శ్రావణ ప్రథమ దివసమున వేయించిన శాసనమున్నది.

నీరుపార్లు మత్తడి నిర్మాణమునకు 540 హొన్నులు ఖర్చు అయినవి. నరసింహక్షేత్రమున దైవమునకు వృత్తులు 30 పెట్టబడినట్లుగా శాసనమందున్నది.

6. ఈపూరు శాసనము : గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఈపూరు వీధిలో నల్లరాతిపై శ.సం. 1590 - క్రీ.శ. 1668లో వేయించిన శాసనమిది. కీలక కార్తీక శుద్ధ పౌర్ణమి ఆదివారము నాడు ఈ శాసనము వేయబడినది. మొఖాసాలు ఆగాశిరమాసాపాజు నూతిని నిర్మించినట్లు శాసనమందున్నది.

7. కుద్రవెల్లి శాసనము : కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా కుద్రవెల్లి గ్రామమున గోకులమ్మ చెరువులో గల శిలపై శ.సం. 1591 సౌమ్య ఆషాఢ శుద్ధ త్రయోదశి గురువారం క్రీ.శ. 1669 నాడు వేయించిన శాసనమిది. కుద్రవల్లిలో అబుల్ హసన్ ఒక తటాకమును నిర్మించినట్లు శాసనము తెలుపుచున్నది.

8. కావేరిప్పాక్కం శాసనము : తమిళనాడులోని ఉత్తర ఆర్కాటు జిల్లా అర్కోణము తాలూకాలోని కావేరి ప్పాక్కం గ్రామమున మసీదు ఎదురుగానున్న శిలాఫలకముపై శ.సం. 1591 కీలక మార్గశిర శుద్ధ దశమి శుక్రవారము క్రీ.శ. 1669 నాటి శాసనమున్నది. కావేరిప్పాక్కం గ్రామమున మసీదు నిర్మించిన విషయమీ శాసనమందున్నది.

9. కువ్వం శాసనము : చెంగల్పట్టు జిల్లా తిరువల్లూరు తాలూకా కువ్వం గ్రామ దేవాలయ తటాక సమీప శిలా ఫలకముపై శ.సం. 1592 విరోధికృత్సంవత్సర మార్గశిర మాసము క్రీ.శ. 1670 నాటి శాసనమున్నది.

కొమ్మసాని కుమారుడు తిమ్మనాయనింగారు తిరుకరిలం గట్టును అరటితోట తిమ్మానాయనికి సుకృతముగా తర్విక్కోలేశ్వరస్వామికి అరటితోట అందలి సకల వృక్షములు సమర్పించినట్లు శాసనమందున్నది.

VI. తానాషా కాలము : 1. భాగలేరు శాసనము : అనంతపురం జిల్లా హిందూపురం తాలూకా భాగలేరు గ్రామ ఈశ్వరాలయ సమీప ఫలకముపై శ.సం. 1599 పింగళ కార్తీక బహుళ ద్వాదశిన క్రీ.శ. 1677న శాసనము అబుల్ హసన్ తానాషా కాలమున వేయింపబడినది. ఇందు హజరతు వజీరులను పదములున్నవి. శాసనాక్షరములు చెదరిపోయినవి.

2. ముక్తేశ్వర శాసనము : నరసరావుపేట తాలూకా ముక్తేశ్వరము చెరువు వద్ద గల శిలా స్తంభముపై శ.సం. 1600 కాళయుక్తి వైశాఖ శుద్ధ పౌర్ణమి సోమోపరాగ పుణ్యకాలమున తేజ్‌ఖాన్ ఖవంద్ వారు ముక్తేశ్వరమున చెరువు నిర్మించిన సందర్భము నందు శాసనమును వేయించెను.

3. లేపాక్షి శాసనము : అనంతపురం జిల్లా హిందూపురం తాలూకా లేపాక్షి శివాలయ ప్రవేశ ద్వారము ఎడమవైపున ఉన్న తూర్పుగోడపై శ.సం. 1600 రౌద్రి వైశాఖ శుద్ధ తదియ సోమవారము క్రీ.శ 1678లో వేయించిన శాసనమున్నది.

లేపాక్షిలోని శాంతనంజుండేశ్వర స్వామి అభిషేక నైవేద్యాదులకు భూమిని దానమిచ్చుచు లేపాక్షి గ్రామమందలి రెడ్లు, కరణాలు శాసనము వేయించిరి.

4. ఎడ్లపల్లి శాసనము : గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎడ్లపల్లి గ్రామమున యోగానంద నరసింహాలయ ముఖమండపమున శ.సం. 1602 రౌద్రి శ్రావణ

శుద్ధ దశమి ఆదివారము క్రీ.శ. 1680 నాటి శాసనమున్నది. ఎడ్లపల్లి పడమట పొలములో నామ డొంక చేశ్వాను గుదరపాడువారు నరిహద్దులు నిశ్చయింకొనినపుడు మాణిక్య రాయడు శాసనము వేయించెను.

5. సత్యవీడు శాసనము : చిత్తూరు జిల్లా సత్యవీడులోని మాతాంగేశ్వరాలయ మందున్న బావి, తెట్టె రాతిపై శ.సం. 1608 క్షయ శ్రావణ శౌరి వారమున సంస్కృత భాషలో వేయింపబడిన శాసనమిది. శాసన కాలము క్రీ.శ. 1686 అబుల్ హసన్ తానాషా కాలమున సత్యపురికి దక్షణమున పేట కృష్ణ భూపతి ఒక బావిని త్రవ్వించినపుడు శాసనమును వేయించెను.

శాసన కవిత - వచనము :

ఒంగోలు తాలూకాలోని ధర్మావరము గ్రామమున శ.సం. 1522. శార్వరి నిజ శ్రావణ శుద్ధ సప్తమి బుధవారము నాటి శాసనమున మహమ్మదు కులీ కుతుబ్షా

"నిజ భుజ బలసమాక్రాంత చతురాశీతి దుర్గా ధీశ్వరుండున్ను గోలకొండ స్థాన నివాసుండున్ను అయిన కుతుపనములకకుపౌత్రులున్న సేనాధిపమాత్రసాధిత గజపతి రాజ్య రాజమహేంద్రాది బహుదుర్గ దేశండున్ను దానధారాప్రశస్త మేఘుండును మానవాపరాధ దండన కార్తవీర్య సదృశుండున్ను అయిన ఇభరామ చక్రవర్తికి పుత్రుడున్ను ఏకధాటీ మాత్ర సేనాతరంగ ఖురపుట చూర్ణ కృత గండికోటగిరి దుర్గరాయ శాసనా స్థానపెనుగొండ ప్రదేశుండున్ను అసహాయ వీర కళా వినోదిన్ని నిజమంజువాణి వార్తా సమాకర్ష తాన్ తథప్పన్న దేశ విద్వత్కవి గాయక వందిమాగధపారిహాసికాది నానాయాచక దారిద్ర్య భంజనుండున్ను భోగభూలోక దేవేంద్రుడున్ను అయిన మహమందు పాదుషా సార్వభౌముండు గోలకొండ అశ్వపతి సింహాసనాసీనుడై ప్రిథివి సామ్రాజ్యము చేయుచుండ॥ అని వర్ణింపబడినాడు.

అతని సేనాని ఎక్లాస్ ఖాన్ : "మహమ్మదు కులీకుతుబ్షాకు దక్షిణ భుజదండమయినటువంటిన్ని స్వదేశ ప్రాంత పరదేశగిరిదుర్గ వనదుర్గ జలదుర్గ శ్రిత అంతరమన్నియ సప్తాంగహరణుండున్ను అనాయాససాధిత దుర్వార భీషణ శాత్రవశిరోభూషణుండునూ రత్న ప్రభానీరాజిత పాదపద్మ ద్వయుండున్ను విద్యాకళా ప్రవీణుండున్ను వితరణ కల్ప వృక్షావతారండున్ను ఖోడానందఖానే ఆజాం అకరా ఖాన ఆలిశాన వికలాసఖాన నిషాను సాహసవిక్రమార్కావతారుండును" అని వర్ణింపబడినాడు.

సీ॥ వివిధ సేనల దూరి పెద్ద గుంపుల సేసి
పదిరి గొల్చిన యట్టి పాలెగాండ్ల
దుర్గాధిపుల బిరుదులు రణావనింగొట్టి
పట్టించుకొనియెడి పాలెగాండ్ల
పూర్వాబ్ధి పర్యంతమున దాడివెట్టిన
పడమటింగట్టుల పాలెగాండ్ల
జలదుర్గ గిరివన స్థలదుర్గ భూముల
పట్టు గల్గిన యట్టి పాలెగాండ్ల
మహిత ఘుమ ఘుమముమడియోమానినాడ
మాత్రమానంబఛ్చిమాంబుధిమలేవిమిగులం
బరువు వెట్టించి మహమందు పాదశహ
ప్రధాన వర్యుండు యెకలాసఖాన విభుండు

అట్లే అమీనుల్ముల్కు వేయించిన అమీనాబాదు శాసనము నందీ క్రింది పద్యమున్నది.

ధాటిగనేగివుద్దగిరి దార్కొని వేంకటరాజుదోలిముం
గోటలు లగ్గవట్టి వినికొండయు బెల్లము కొండ తంగ్గెడల్
పాటసరిన్ హరించి మరితాల్మిని గైకొనె కొండ వీడు క
ర్నాటక రాజధాని యిభురాముండా బాహు బలంబు మీరుచున్